# లోకల్ గైడ్

LGTV

జాతీయ దినపత్రిక

LOCAL NEWS GOBAL FOCUS

తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్

ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 14, | సంచిక 203, | పేజీలు -12 | శుక్రవారం - 22 - మే - 2026 | వెల రూ.2/-

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, Yadadri Bhuvanagiri



లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com

విలేకరులు కావలెను

సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.

ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి

8977761499/9110308094


# పెట్టుబడుల ఆకర్షణకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' ఏజెన్సీ

## హెల్త్‌సిటీకి వైద్య పర్యాటక కేంద్రం తెచ్చేందుకు చొరవ

1,500 ఎకరాల్లో ఏర్పాటు

హైదరాబాద్ వెలుపలా జీసీసీలు

ఫ్యూచర్‌సిటీలో ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీసు అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు



హైదరాబాద్: హైదరాబాద్ వెలుపలా జీసీసీ(గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)ల ఏర్పాటుకు కంపెనీలకు ప్రోత్సాహం అందించేలా ప్రత్యేక పాలసీ రూపొందించాలని, జిల్లాలకూ ఐటీ వెలుగులు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు, పెట్టుబడిదారులకు సహకరించేందుకు ' మిగతా..2లో



## రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వండి

ఎస్ఏఎస్‌సీఐ కింద అదనపు సాయం అందించండి

సాస్కీ కింద రూ.5వేల కోట్లు అందించండి

విద్యారంగ రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించండి

## ఇరాన్‌ను గట్టిగా దెబ్బతీశాం.. అవసరమైతే మళ్లీ కొడతాం: ట్రంప్



యూఎస్ కోస్ట్ గార్డ్ అకాడమీ స్నాతకోత్సవంలో పాల్గొన్న డొనాల్డ్ ట్రంప్

ఇరాన్‌ను ఇప్పటికే దెబ్బతీశామన్న ట్రంప్.. ఈసారి ఇంకా గట్టిగా కొడతామని వెల్లడి




## ఉక్కపోత... ప్రజలు ఉక్కిరిబిక్కిరి

రాష్ట్రమంతటా దారెత్తిస్తున్న ఎండలు

ఆకాశం నుంచి నిప్పుల వర్షం కురిసినట్లు వాతావరణం హడలెత్తిస్తోంది

పిడుగురాళ్లలో 47.6 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత

11 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా..

నాలుగు రోజులపాటు ఇదే పరిస్థితి

అమరావతి: రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఆకాశం నుంచి నిప్పుల వర్షం కురిసినట్లు వాతావరణం హడలెత్తిస్తోంది. రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోత ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మిగతా..2లో

## ఇరాన్‌తో యుద్ధం: 42 విమానాలు కోల్పోయిన అమెరికా

ఇరాన్‌తో యుద్ధంలో అమెరికాకు భారీ నష్టం



మొత్తం 42 విమానాలు ధ్వంసం లేదా దెబ్బతిన్నాయని వెల్లడి

యుద్ధం ఖర్చు 29 బిలియన్ డాలర్లకు చేరినట్లు ప్రకటన

అమెరికా కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ నివేదికలో వివరాలు

# కాలుష్య పరిశ్రమలపై కఠిన చర్యలు తప్పవు

## గోస్తనీ నది కాలుష్యంపై అత్యవసర పరిస్థితిగా గుర్తింపు

: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

తనిఖీ కమిటీలలో బాధితులను భాగస్వామ్యం చేయాలి

శబ్ద కాలుష్య నిబంధనలు అందరికీ వర్తిస్తాయి

నెల్లూరు 'వైట్ కేటగిరి' పరిశ్రమల కాలుష్యంపై విచారణకు ఆదేశం



అమరావతి: దేశ పురోగతికి పరిశ్రమలు ఎంత ముఖ్యమో, ప్రజల ఆరోగ్యం, పర్యావరణాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యమని ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని, మిగతా..2లో

# తెలంగాణపై భానుడి ప్రతాపం

## పగలు బయట తిరగొద్దని ప్రజలకు సూచన

19 జిల్లాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు

అత్యధికంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో 46.5

25 వరకు వడగాలులు వీస్తాయి: వాతావరణశాఖ




హైదరాబాద్-న్యూస్‌టుడే, బృందం: భానుడి భగభగలకు రాష్ట్రం అట్టుడుకుతోంది. అధిక వేడితో కూడిన మిగతా..2లో

## టెట్రా ప్యాక్‌లలోని వోడ్కాపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

టెట్రా ప్యాక్‌లు సాచెట్లలో మద్యం అమ్మకాలను నిషేధించాలని పిటిషన్



పిటిషన్ దాఖలు చేసిన కమ్యూనిటీ ఎగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్ సంస్థ

పండ్ల రసాలను పోలి ఉండి తప్పుదారి పట్టించేలా ఉందన్న పిటిషనర్



## ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులకు కేంద్రం పచ్చజెండా

161 కిలోమీటర్లు.. ఆరు వరుసలు

ప్యాకేజీ-1లో గిర్మాపూర్ నుంచి ప్రజ్ఞాపూర్ వరకు..

ప్యాకేజీ-2లో ప్రజ్ఞాపూర్ నుంచి తంగడ్‌పల్లి వరకు..

2 ప్యాకేజీలతో బిడ్ల దాఖలుకు టెండర్ల ఆహ్వానం

హైదరాబాద్: ప్రాంతీయ వలయ రహదారి (ఆర్ఆర్ఆర్) ఉత్తరభాగం పనులకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఈ రహదారి పనులను 5 నుంచి 2 ప్యాకేజీలకు కుదించి బుధవారం తాజా టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా తంగడ్‌పల్లి వరకు మొత్తం 161.518 కిలోమీటర్ల మేర ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రీజినల్ ఎక్స్‌ప్రెస్‌వేని మిగతా..2లో



## కువైట్‌లోని తెలుగు మహిళకు అండగా ప్రభుత్వం..

సురక్షితంగా రప్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశం

కువైట్‌లో వేధింపులకు గురవుతున్న తిరుపతి జిల్లా మహిళ

సెల్ఫీ వీడియో ద్వారా ప్రభుత్వానికి సాయం కోసం విజ్ఞప్తి

తక్షణం స్పందించి రప్పించాలని ఆదేశించిన సీఎం చంద్రబాబు,

భారత రాయబార కార్యాలయంతో ఏపీఎన్ఆర్టీ సంప్రదింపులు

ఘటనకు బాధ్యులైన ఏజెంట్లపై విచారణకు సీఎం ఆదేశం

# హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని తయారు చేయటమే లక్ష్యం

## స్వర్ణాంధ్ర 2047 విజన్ కూడా అమలు చేశాం

ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు ఏపీలో పనిచేయాలి: చంద్రబాబునాయుడు

హింసలేని సమాజం, ఒత్తిడి లేని మనుషులు అనే అంశాన్ని బోధిస్తున్నారన్న సీఎం

గ్రామాల నుంచి కొలంబియా వరకు అనిశ్చిత నెలకొంటే చర్చల ద్వారా మార్పులు తెచ్చినట్లు వెల్లడి



అమరావతి: ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పని చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శ్రీ రవిశంకర్ గురూజీ జన్మదినోత్సవంతో పాటు మిగతా..2లో

# కొయ్యగూడెం బ్లాక్--3ని సింగరేణికి అప్పగించండి

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి భట్టి విజ్ఞప్తి

'బొగ్గు గ్యాసిఫికేషన్'ప్రాజెక్టులను చేపట్టేందుకు సంస్థ సిద్ధంగా ఉంది

ప్రీ--మైనింగ్ పనులు పూర్తయిన తాడిచెర్ల కోల్ బ్లాక్--2 మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేసేలా ముందస్తు అనుమతులు మంజూరు చేయాలి

న్యూఢిల్లీ: సింగరేణి సంస్థ భవిష్యత్ ప్రణాళికలు, రాష్ట్ర విద్యుత్ అవసరాలే



లక్ష్యంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డితో సమావేశమయ్యారు. కోల్ ఇండియా తరహాలోనే సింగరేణిలోనూ మిగతా..2లో

## ఇరాన్‌తో యుద్ధం: 42 విమానాలు కోల్పోయిన అమెరికా

ఢిల్లీ: ఇరాన్‌తో ఇటీవల జరిగిన యుద్ధంలో అమెరికాకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" పేరుతో చేపట్టిన ఈ సైనిక చర్యలో మొత్తం 42 అమెరికా విమానాలు ధ్వంసం కావడం లేదా దెబ్బతినడం జరిగిందని అమెరికా కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ తన నివేదికలో వెల్లడించింది. ఈ నివేదిక ప్రస్తుతం అమెరికా రక్షణ, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ధ్వంసమైన వాటిలో అత్యాధునిక యుద్ధ విమానాలు, డ్రోన్లు కూడా ఉన్నాయి. నివేదిక ప్రకారం, నాలుగు ఎఫ్-15ఈ, ఒక ఎఫ్-35ఏ యుద్ధ విమానం, ఏడు కేసీ-135 రీఫ్యూయలింగ్ విమానాలతో పాటు అత్యధికంగా 24 ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు ఉన్నాయి. వీటితో పాటు ఏ-10 థండర్‌బోల్ట్, ఈ-3 సెంట్రీ అవాక్స్ వంటి ఇతర కీలక విమానాలు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు సీఆర్ఎస్ పేర్కొంది. విమానాల నష్టంతో పాటు ఈ యుద్ధం అమెరికా ఖజానాపై కూడా తీవ్ర ప్రభావం చూపింది. ఈ ఆపరేషన్ కోసం అయిన ఖర్చు సుమారు 29 బిలియన్ డాలర్లకు చేరనుందని పెంటగాన్ తాత్కాలిక కంప్ట్రోలర్ జూల్స్ డబ్ల్యూ హర్ట్స్ మే 12న అమెరికా పార్లమెంటరీ కమిటీకి తెలిపారు. దెబ్బతిన్న పరికరాల మరమ్మతులు, కొత్తవాటి కొనుగోలు అంచనాలు పెరగడంతోనే ఈ వ్యయం పెరిగినట్లు ఆయన వివరించారు. అమెరికా కాంగ్రెస్‌కు విధానపరమైన అంశాలపై విశ్లేషణలు అందించే సీఆర్ఎస్, రక్షణ శాఖ మరియు సెంట్రల్ కమాండ్ విడుదల చేసిన అధికారిక ప్రకటనలు, వార్తల ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా ఈ సైనిక చర్యను ప్రారంభించిన విషయం తెలిసిందే.

## ఇరాన్‌ను గట్టిగా దెబ్బతీశాం.. అవసరమైతే మళ్లీ కొడతాం: ట్రంప్

అమెరికా : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అణ్వాయుధాన్ని సంపాదించుకోవాలనే టెహ్రాన్ ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. నిన్న కనెక్టికట్‌లోని న్యూ లండన్‌లో ఉన్న యూఎస్ కోస్ట్ గార్డ్ అకాడమీ 2026 బ్యాచ్ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. "ఇరాన్‌ను అణ్వాయుధం తయారు చేసుకోనివ్వం. ఇది చాలా సులభమైన విషయం. వారు దాన్ని తయారు చేయలేరు. అయితే, వాళ్లు ఒప్పందం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు" అని అన్నారు. తమ ప్రభుత్వం ఇరాన్‌ను ఇప్పటికే ఆంక్షలతో గట్టిగా దెబ్బతీసిందని, అవసరమైతే మరింత కఠినంగా వ్యవహరించాల్సి రావొచ్చని వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు చెందిన చమురు నౌకలను సీజ్ చేయడంలో కోస్ట్ గార్డ్ కీలక పాత్ర పోషించిందని, 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో వారి భాగస్వామ్యాన్ని ట్రంప్ ప్రశంసించారు.

తన రాజకీయ, ఆర్థిక విధానాలను సమర్థించుకున్న ట్రంప్

ఈ ప్రసంగంలో ట్రంప్ తన రాజకీయ, ఆర్థిక విధానాలను కూడా ప్రముఖంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న సరిహద్దు విధానాలను విమర్శిస్తూ, తన పాలనలో చరిత్రలోనే అత్యంత పటిష్టమైన సరిహద్దును ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. అమెరికా ప్రస్తుతం ప్రపంచంలోనే 'హాటెస్ట్ కంట్రీ' అని అభివర్ణించారు. తాను విధించిన టారిఫ్‌ల వల్ల సెమీకండక్టర్, ఆటోమొబైల్ పరిశ్రమలు తిరిగి అమెరికాకు వస్తున్నాయని, దేశంలోకి 18 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. కోస్ట్ గార్డ్ సేవలపై ట్రంప్ ప్రశంసల వర్షం కురిపించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడంలో కోస్ట్ గార్డ్ కీలక పాత్ర పోషిస్తోందని, సముద్ర మార్గంలో 'ఉక్కు గోడ' (వాల్ ఆఫ్ స్టీల్)లా నిలుస్తోందని అన్నారు. గడిచిన ఏడాదిలో 5,200 మంది ప్రాణాలను కాపాడారని గుర్తుచేశారు. కోస్ట్ గార్డ్ మౌలిక సదుపాయాల బలోపేతానికి భారీగా నిధులు కేటాయిస్తున్నామని, కొత్త కట్టర్లు, హెలికాప్టర్లతో పాటు ఆర్కిటిక్ ప్రాంతం కోసం ఐస్‌బ్రేకర్లను నిర్మిస్తున్నామని ప్రకటించారు. రష్యా వద్ద 48 ఐస్‌బ్రేకర్లు ఉంటే, అమెరికా వద్ద ఒక పాతది మాత్రమే ఉందని, తాము మొత్తం 11 నిర్మిస్తున్నామని వివరించారు. ఈ అకాడమీలో రెండవసారి స్నాతకోత్సవ ప్రసంగం చేసిన మొదటి అధ్యక్షుడిగా ట్రంప్ నిలిచారు. ప్రసంగం మధ్యలో పలువురు క్యాడెట్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. "మీరు పోరాడండి, గెలవండి" అంటూ క్యాడెట్లలో స్ఫూర్తి నింపారు.

## టెట్రా ప్యాక్‌లలోని వోడ్కాపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

ఢిల్లీ: టెట్రా ప్యాక్‌లు, సాచెట్ల వంటి గుర్తించలేని ప్యాకేజీలలో మద్యం అమ్మకాలను నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈరోజు కేంద్రం స్పందనను కోరింది. ఇటువంటి ప్యాకేజింగ్ వినియోగదారులను తప్పుదోవ పట్టించి, మైనర్ల మద్యపానాన్ని ప్రోత్సహించగలదని పిటిషన్‌దారు పేర్కొన్నారు. కమ్యూనిటీ ఎగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్ అనే లాభాపేక్షలేని సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై, భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం కేంద్రానికి, పలు రాష్ట్రాల ఎక్సైజ్ శాఖలకు నోటీసులు జారీ చేసింది. టెట్రా ప్యాక్, సాచెట్లలో వోడ్కా విక్రయాలు వినియోగదారులను తప్పుదారి పట్టిస్తాయని, మైనర్లను మద్యం వైపు ప్రోత్సహించే అవకాశం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనిటీ ఎగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్ సంస్థ తరపున లాయర్ విపిన్ నాయర్ వాదనలు వినిపిస్తూ, అలాంటి అనేక మద్యం ఉత్పత్తుల ప్యాకింగ్‌పై సరైన హెచ్చరికలు ఉండటం లేదని కోర్టుకు తెలిపారు. అవి పండ్ల రసాలను పోలి ఉండేలా ప్యాక్ చేస్తున్న సందర్భాలు ఉన్నట్లు తెలిపారు. అలాంటి ప్యాకేజీలలో మద్యం అమ్మకాలను నిషేధిస్తూ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఒకే విధమైన విధానాన్ని రూపొందించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు ఈ అభ్యర్థనను పరిశీలించింది. ప్యాకింగ్ తప్పుదోవ పట్టించేలా ఉందంటూ కేంద్రం, రాష్ట్రాల్లోని ఎక్సైజ్ విభాగాలకు నోటీసులు జారీ చేసింది.

## కువైట్‌లోని తెలుగు మహిళకు అండగా ప్రభుత్వం.. సురక్షితంగా రప్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి: కువైట్‌లో వేధింపులకు గురవుతూ, స్వదేశానికి రాలేక ఇబ్బంది పడుతున్న తిరుపతి జిల్లా మహిళ భాగ్యవతి విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణం స్పందించారు. ఆమెను వీలైనంత త్వరగా, సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే, తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం తొండవాడ గ్రామానికి చెందిన భాగ్యవతి ఉపాధి నిమిత్తం ఈ ఏడాది ఫిబ్రవరిలో కువైట్ వెళ్లారు. అక్కడ గృహ సహాయకురాలిగా పనిచేస్తున్న ఆమెను యజమానులు శారీరకంగా, మానసికంగా తీవ్రంగా వేధిస్తున్నారని, తిరిగి పంపించమని అడిగితే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ ఆమె సెల్ఫీ వీడియో ద్వారా తన ఆవేదనను తెలియజేశారు. ఈ వీడియో సోషల్ మీడియా ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి వచ్చింది. దీనిపై వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు, ఏపీ ప్రవాసాంధ్రుల సంస్థ (ఏపీఎన్ఆర్టీ) ద్వారా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలతో ఏపీఎన్ఆర్టీ అధికారులు కువైట్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరిపి, భాగ్యవతిని స్వదేశానికి తీసుకొచ్చే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ ఘటనకు కారణమైన ఏజెంట్ల పాత్రపై విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా ముఖ్యమంత్రి ఆదేశించారు. మరోవైపు, తిరుపతి జిల్లా యంత్రాంగం, స్థానిక పోలీసులు భాగ్యవతి కుటుంబ సభ్యులతో నిరంతరం మాట్లాడుతూ వారికి ధైర్యం చెబుతున్నారు. ఆమె సురక్షితంగా తిరిగి వచ్చేవరకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అధికారులు భరోసా ఇచ్చారు.

## రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వండి

న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, విద్యారంగ రూపాంతరమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కీలక భేటీ జరిపారు. రాష్ట్రంలో మౌలిక వసతుల విస్తరణ, మానవ వనరుల అభివృద్ధికి కేంద్రం నుంచి అదనపు ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ ఆయన వినతిపత్రాలు సమర్పించారు.

'సాస్కీ'పథకం కింద....

రాష్ట్రంలో కొనసాగుతున్న మూలధన వ్యయాలు, సంక్షేమ పథకాలకు మద్దతుగా 'సాస్కీ'(ఎస్ఏఎస్‌సీఐ) పథకం కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రిని భట్టి విక్రమార్క కోరారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికిగానూ ఇప్పటికే కేంద్రం రూ.4,208 కోట్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం రూ.30,000 కోట్లతో భారీ ప్రణాళికను రూపొందించిందని భట్టి పేర్కొన్నారు. ఏడీబీ సహకారంతో రూ.4,049.11 కోట్లు, ఏఐఐబీ సహకారంతో రూ.4,903.44 కోట్ల వ్యయంతో చేపట్టే విద్యా ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే, ఈ రుణాలను రాష్ట్ర ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం వెంట ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ప్లానింగ్ సెక్రెటరీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

## కొయ్యగూడెం బ్లాక్--3ని సింగరేణికి అప్పగించండి

మొదటి పేజి తరువాయి

కోల్ ఇండియా తరహాలోనే సింగరేణిలోనూ ఆధునిక సాంకేతికతతో 'బొగ్గు గ్యాసిఫికేషన్'ప్రాజెక్టులను చేపట్టేందుకు సంస్థ సిద్ధంగా ఉందని, ఇందుకు కేంద్రం సహకరించాలని కోరారు. తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీలకమైన కొయ్యగూడెం బ్లాక్--3 గత వేలంలో కేటాయించినా నాలుగేళ్లుగా పనులు ప్రారంభం కాలేదని, కాబట్టి దాన్ని సింగరేణికి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రీ--మైనింగ్ పనులు పూర్తయిన తాడిచెర్ల కోల్ బ్లాక్--2 మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేసేలా ముందస్తు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ అంశాలపై త్వరలోనే కేంద్ర, రాష్ట్ర అధికారులు, సింగరేణి ప్రతినిధులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ భేటీలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడుల ఆకర్షణకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' ఏజెన్సీ

మొదటి పేజి తరువాయి

ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట ప్రత్యేక ఏజెన్సీని ప్రారంభించాలని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... "ఐటీ, ఇతర ఉద్యోగ అవకాశాలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించాలి. కోర్ అర్బన్ రీజియన్ ప్రాంతాల్లో ఐటీ, డేటా సెంటర్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. అందులో భాగంగా 1,500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించండి. డేటా సిటీ కోసం ఎస్టీపీలలో శుద్ధి చేసిన నీటిని తీసుకోవాలి. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, విజయవాడ-హైదరాబాద్ హైవేల వెంట జీసీసీలు, డేటా సెంటర్లు ఏర్పాటు చేసే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి. వాటి ఏర్పాటుకు ఆయా నగరాల ప్రధాన రహదారుల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించండి. భారత్ ఫ్యూచర్ సిటీ(బీఎఫ్‌సీ)లో ప్రపంచస్థాయి మౌలిక వసతులతోపాటు పర్యావరణహిత నెట్-జీరో విధానాలను అమలు చేయాలి. ఏఐ, హెల్త్ సిటీలు, ఇండస్ట్రియల్ కారిడార్ పనులను వేగవంతం చేయాలి. ప్రతిపాదిత ఏఐ సిటీ పనులను వెంటనే ప్రారంభించండి. అందులో మౌలిక వసతుల కల్పన ప్రపంచ స్థాయిలో ఉండేలా అంతర్జాతీయ నగరాలను అధ్యయనం చేయండి. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేసిన తర్వాతే భూకేటాయింపులు చేపట్టండి. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించిన ఐదు ప్రాంతీయ వైద్య పర్యాటక కేంద్రాల్లో ఒకదాన్ని ఫ్యూచర్ సిటీలోని హెల్త్ సిటీలో ఏర్పాటు చేసేలా కేంద్రంతో చర్చించండి. అవసరమైతే ప్రధాని మోదీతో నేను మాట్లాడతా. ఫ్యూచర్ సిటీలోని పారిశ్రామికవాడలో వివిధ కంపెనీల ప్రాంగణాల్లో త్వరలో భూమిపూజలు చేయడానికి అవసరమైన పనులు చేపట్టాలి. ఇక్కడ స్థాపించే కంపెనీలన్నీ యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపు కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలి. ఫ్యూచర్‌సిటీలో ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీసు అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించనున్నాం. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను రప్పించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట ఒక ప్రత్యేక ఏజెన్సీ ప్రారంభించాలి. పెట్టుబడిదారులకు ఒకే వేదికపై అన్ని అనుమతులు, సేవలు అందించేందుకు ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలి. దీనికి గ్రూప్-1 స్థాయి అధికారిని నియమించే అంశాన్ని పరిశీలించాలి. ఐటీ, పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో ఉండే ఇన్వెస్ట్ తెలంగాణ ఏజెన్సీలోకి విద్యుత్, ఆర్థిక వంటి శాఖల అధికారులు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉండాలి. ఈ ఏజెన్సీ విధివిధానాల రూపకల్పనకు ముందు తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయండి. ఇతర రాష్ట్రాల్లోనూ అమలులో ఉన్న ఉత్తమ విధానాలను తీసుకోండి" అని సూచించారు. అలాగే... రానున్న మూడు నెలల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు టీ-ఫైబర్ ఇంటర్నెట్‌ను వినియోగించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే టీ-ఫైబర్‌కు మారిన ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.54 కోట్ల ఆర్డర్లు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ వీసీఅండ్ఎండీ శశాంక, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని తయారు చేయటమే లక్ష్యం

మొదటి పేజి తరువాయి

ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ 45వ వార్షికోత్సవంలో పాల్గొనటం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. కేవలం ఓ ముఖ్యమంత్రిగానే ఇక్కడికి రాలేదని, ఓ భారతీయుడిగా, గురూజీ బోధనల్ని అనుసరిస్తున్న వ్యక్తిగా ఇక్కడికి వచ్చానని పేర్కొన్నారు. ఆయన కేవలం ఓ ఆధ్యాత్మికతను బోధించే ఓ గురువు మాత్రమే కాదని, శాంతిసామరస్యాలను చాటిచెప్పే ప్రపంచ మానవుడని కొనియాడారు. ప్రాచీన భారతీయ విజ్ఞానానికి ఆధునిక ప్రపంచానికి వారధిగా శ్రీరవిశంకర్ గురూజీ వ్యవహరిస్తున్నారుని అన్నారు. హింసలేని సమాజం-ఒత్తిడి లేని మనుషులు అనే అంశాన్ని సాధించాలని దశాబ్దాలుగా బోధిస్తూ మానవాళికి గొప్పసేవ చేస్తున్నారని కితాబిచ్చారు. యుద్ధాలతో శాంతికి దూరమైన సమాజాన్ని, అనిశ్చితి నుంచి బయటపడేసేలా మానవత్వం అనే అత్యుత్తమ మార్గాన్ని ఆయన ఎంచుకున్నారని కొనియాడారు. యుద్ధక్షేత్రాల నుంచి ట్రాన్స్ ఫర్మేటివ్ పవర్, డైలాగ్, ఇన్నర్ స్ట్రెంత్ అనే విధానాలను అనుసరించారని పేర్కొన్నారు. గ్రామాల నుంచి అంతర్జాతీయ స్థాయి సంస్థల వరకూ, అనిశ్చితి నెలకొన్న కొలంబియా ప్రాంతాల వరకూ చర్చలు అనే శాంతి మార్గం ద్వారా మార్పులు తెచ్చారని గుర్తు చేశారు. సామాన్య ప్రజలతో పాటు అంతర్జాతీయ సంస్థల విశ్వాసాన్ని గెలుచుకున్న ఆధ్యాత్మికవేత్త శ్రీ రవిశంకర్ గురూజీ అన్నారు.

45 ఏళ్లక్రితం హ్యాపీ హ్యూమన్ బీయింగ్, స్ట్రెస్ ఫ్రీ సొసైటీ బెటర్ వరల్డ్ అనే విజన్ తో ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోట్లాది మందికి ప్రేరణగా నిలిచిందని ముఖ్యమంత్రి అన్నారు. సురక్షిత తాగునీరు, రివర్ రిజునవేషన్, మహిళా స్వయం సమృద్ధి, విలువలతో కూడిన విద్య లాంటి రంగాల్లో ప్రజలకు సేవలందిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ను ఆయన అభినందించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీలు రోజువారీ జీవితంలో చాలా ప్రభావాన్ని చూపిస్తున్నాయని వెల్లడించారు. భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తున్నాయని, సామాన్య ప్రజల జీవితాలు కూడా తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతోందని అన్నారు. గ్యాస్, ఇంధనం లాంటి వనరుల మార్కెట్ లభ్యత ప్రజలను ఒత్తిడికి గురి చేస్తోందని తెలిపారు. ఈ సమయంలో ఒత్తిడిని ఎదుర్కొని సమర్థంగా జీవించాల్సిన అవశ్యకత ఉందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలోనే ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి సంస్థలు మానవాళికి అత్యుత్తమ సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ లాంటి సమర్ధవంతమైన నేత దేశానికి నేతృత్వం వహిస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా భారత్ అగ్రగామిగా మారుతుందని జోస్యం చెప్పారు. వేల ఏళ్ల క్రితం వరకూ మానవాళిని నడిపించిన నేల ఇది. ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపించిన దేశం మనదని పేర్కొన్నారు. ఆధునిక జీవనంలో శాంతిని సాధించేలా శ్రీ రవిశంకర్ గురూజీ తన బోధనలతో ప్రభావితం చేశారని, సంస్కృతితో మిళితమైన ఆధునికత, విలువలతో కూడిన జీవనం లాంటి ఎన్నో అంశాల ద్వారా తన బోధనల్ని సాగిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో మేం కూడా ప్రజాప్రతినిధులు, అధికారులకు కూడా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా తరగతులు నిర్వహించామని గుర్తు చేశారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన నేల నుంచి తాను వచ్చానని, ప్రపంచంలో ఉండే హిందువులంతా ఒక్కసారైన తిరుపతి శ్రీవారిని దర్శించుకోవాలని అనుకుంటారని అన్నారు. శ్రీశైలం, ఆహోబిలం, అన్నవరం, సింహాచలం లాంటి అధ్యాత్మిక క్షేత్రాలు నిండిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను రాష్ట్రంలో నిర్మిస్తున్నామని, పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక ప్రగతి, టెక్నాలజీ మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మార్చటమేననేది తన భావన అన్నారు. ప్రతీ పౌరుడూ శాంతి సౌఖ్యాలు, ఆనందంగా జీవించాలన్నదే తన అభిప్రాయమని పేర్కొన్నారు. ఏపీ సమీకృత అభివృద్ధి సాధించాలన్నదే తన లక్ష్యం కూడా అన్నారు.

ఏపీలోని ప్రతీ పౌరుడికీ అత్యుత్తమ జీవన ప్రమాణాలు కల్పించేలా సంకల్పం తీసుకున్నామని చంద్రబాబునాయుడు అన్నారు. అందుకే పీ4 లాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అందుకే స్వర్ణాంధ్ర 2047 విజన్ కూడా అమలు చేశామని వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని తయారు చేయటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సాంకేతికత సాయంతో ఏపీని గ్లోబల్ ఎకానమీలో ఓ కీలకమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. అదే సమయంలో ఎలాంటి ఒత్తిడిలేని సమాజాన్ని కూడా తీసుకురావాలని పేర్కొన్నారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఇంత అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ ప్రజల్లో శాంతి సౌఖ్యాలు రావాలంటే ఆధ్యాత్మికత అవసరమని పేర్కొన్నారు. దీనికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి సంస్థలు ఏపీలో పనిచేయాలని కోరారు.

## కాలుష్య పరిశ్రమలపై కఠిన చర్యలు తప్పవు

మొదటి పేజి తరువాయి




కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) కేవలం నివేదికలకే పరిమితం కావొద్దని ఆయన అధికారులను ఆదేశించారు. నిన్న మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పీసీబీ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. తనిఖీ ప్రక్రియలో పారదర్శకత కోసం బాధితులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. శబ్ద కాలుష్య నియంత్రణపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పరిశ్రమలు, సంస్థలు, ప్రార్థనా మందిరాలతో సహా ప్రతీ ఒక్కరూ పాటించాల్సిందేనని, ఎవరికీ మినహాయింపులు లేవని తేల్చిచెప్పారు. కొన్ని పరిశ్రమలు చట్ట ప్రకారం గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గోస్తనీ నది తీవ్రంగా కాలుష్యమైందని, అక్కడ పర్యావరణ అత్యవసర పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. నదిలో వ్యర్థాలు వదులుతున్న పరిశ్రమలను డ్రోన్లు, వీడియో కెమెరాల ద్వారా గుర్తించి బాధ్యులను చేయాలన్నారు. నెల్లూరు జిల్లాలో 'వైట్ కేటగిరి' కింద నమోదైన కొన్ని పరిశ్రమలు కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయన్న ఫిర్యాదులపై విచారణ జరపాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 13 నగరాల్లో గాలి నాణ్యతను మెరుగుపరిచేందుకు 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం' కింద కేటాయించిన రూ.400 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించాలని సూచించారు. పీసీబీలో సిబ్బంది కొరతపై అధికారులు ప్రస్తావించగా, నియామకాల ఫైలును వెంటనే ముందుకు తీసుకెళ్లాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

## తెలంగాణపై భానుడి ప్రతాపం

మొదటి పేజి తరువాయి

అధిక వేడితో కూడిన వడగాలులకు ప్రజలు హడలెత్తిపోతున్నారు. బుధవారం రాష్ట్రంలో అత్యధికంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో 46.5, తర్వాత హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లో 46.4, కరీంనగర్ జిల్లా చొప్పదండిలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. మొత్తం 33 జిల్లాల్లోనూ 40.5 డిగ్రీలకన్నా ఎక్కువగా ఉన్నాయి. అత్యల్పంగా వనపర్తి జిల్లా చిన్నంబావి గ్రామంలో 40.5 డిగ్రీలుంది. అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లిన వారు వడదెబ్బకు గురవుతున్నారు. బుధవారం ఒక్కరోజే ఇలా వడదెబ్బ బారిన పడి 11 మంది మృతిచెందారు. వీరిలో రైతులు, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

పలుచోట్ల పదేళ్ల రికార్డులు తుడిచేసి..

భానుడి ఉగ్రరూపంతో పలుచోట్ల గత పదేళ్ల మే నెల రికార్డులు తుడిచిపెట్టుకుపోయాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పదేళ్ల మే నెలలో అత్యధిక ఉష్ణోగ్రత రికార్డు 2019 మే 24, 29, 30 తేదీల్లో 46.3 డిగ్రీలుండగా బుధవారం అది చెరిగిపోయి దిలావర్‌పూర్‌లో 46.5 డిగ్రీలు నమోదైంది. అలాగే హనుమకొండలో గత పదేళ్ల రికార్డు 2017 మే 22, 23 తేదీల్లో 45 డిగ్రీలుంటే తాజాగా 46.4 డిగ్రీలతో కొత్త రికార్డు నమోదైంది. కుమురం భీం ఆసిఫాబాద్, జనగామ జిల్లాల్లో తీవ్ర వడగాలులు, ఇతర జిల్లాల్లో వడగాలులు వీచినట్లు వాతావరణశాఖ తెలిపింది. సాధారణంకన్నా 6.5 డిగ్రీలకు మించి అదనంగా ఉష్ణోగ్రతలుంటే తీవ్ర వడగాలులు, 4.5 డిగ్రీలకు మించి అదనంగా ఉంటే వడగాలులు వీస్తున్నట్లు వాతావరణశాఖ ప్రకటిస్తుంది. గురువారం నుంచి 25 దాకా రాష్ట్రంలో పలుచోట్ల వడగాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసింది. పగలు ఎండవేడి సమయంలో బయట తిరగరాదని ప్రజలకు సూచించింది. అలాగే ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో అత్యధికంగా 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

మరింత ముందుకు నైరుతి..

ఎండల వేడి పెరిగినా నైరుతి రుతుపవనాల రాక ఆశాజనకంగా ఉందని వాతావరణశాఖ తెలిపింది. రాబోయే 3, 4 రోజుల్లో తూర్పు, మధ్య బంగాళాఖాతంలోకి ఇవి ప్రవేశించే అవకాశాలున్నట్లు పేర్కొంది. మరోవైపు భూమికి 900 మీటర్ల ఎత్తులో ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ఉత్తర తెలంగాణ వరకూ ఉపరితలద్రోణి ఏర్పడింది. దీనికారణంగా తెలంగాణలో అక్కడక్కడ గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశాలూ ఉన్నట్లు తెలిపింది.

ఎండల ధాటికి విగతజీవులై..

ఎండల ధాటికి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింగాపురానికి చెందిన రైతు సామ లచ్చిరెడ్డి(58), ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ శ్రీపతి లక్ష్మీ(60), పెద్దపల్లి మండలం కొత్తపల్లికి చెందిన కనుకుంట్ల కనకయ్య(77), కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన దివ్యాంగుడు గాజర్ల సతీష్(45), సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం ముక్కుడుదేవులపల్లికి చెందిన బోడ లింగరాజు(34) మృతిచెందారు. ములుగులో మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తున్న బోడ సాంబయ్య(43), మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లికి చెందిన ఉపాధిహామీ కూలీ నేరళ్ల సోమయ్య(75), జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నేలపోగుల గ్రామానికి చెందిన పల్లాటి భిక్షపతి(65), రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వట్టిమల్ల గొల్లపల్లికి చెందిన రైతు లచ్చవ్వ(58), వేములవాడ మండలం ఆరెపల్లికి చెందిన రాజిరెడ్డి(60), ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం దేవాపూర్ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ నాయిని పొచ్చన్న(30)లు ప్రాణాలు కోల్పోయారు.

## ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం పనులకు కేంద్రం పచ్చజెండా

మొదటి పేజి తరువాయి




రూ.9,362.4 కోట్లతో (సివిల్ పనులు) అభివృద్ధి చేయనుంది. ప్యాకేజీ-1లో సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్ నుంచి సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ వరకు 83.518 కి.మీ. మేర పనులు చేపట్టనున్నారు. దీని అంచనా వ్యయం రూ.4,918.71 కోట్లు. ప్యాకేజీ-2లో ప్రజ్ఞాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా తంగడ్‌పల్లి వరకు 78 కి.మీ. మేర పనులు చేపడతారు. దీని అంచనా వ్యయం రూ.4,443.69 కోట్లు. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) రెండు ప్యాకేజీలకు విడివిడిగా టెండర్లు ఆహ్వానించింది. జులై 7వ తేదీ ఉదయం 11 గంటలలోపు బిడ్‌లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి గడువు విధించింది. జులై 8న సాంకేతిక బిడ్‌లు తెరుస్తారు. డిజైన్, బిల్ట్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీవోటీ యాన్యుటీ లేదా హైబ్రిడ్ యాన్యుటీ) ప్రాతిపదికన పనులు చేపట్టాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో ఎన్‌హెచ్ఏఐ పేర్కొంది. డాక్యుమెంటేషన్ కూడా అప్‌లోడ్ చేసింది.

గతేడాది నవంబరు చివరి వారంలో రెండోసారి ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం పనులకు ఐదు ప్యాకేజీలుగా ఎన్‌హెచ్ఏఐ టెండర్లు పిలిచింది. అయితే టెండర్ల ప్రక్రియకు కావాల్సిన డాక్యుమెంటేషన్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకపోవడంతో ఒక్క బిడ్ కూడా దాఖలు కాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పనులను రెండు ప్యాకేజీలకు కుదిస్తూ సంస్థ నిర్ణయం తీసుకుంది. అదే నెలలో ఈ రహదారికి 'ఎన్‌హెచ్-161ఏఏ' నంబరును కేటాయించింది. ప్యాకేజీ-1 పరిధిలో 927.84 హెక్టార్లు, ప్యాకేజీ-2లో 886.54 హెక్టార్ల మేర భూసేకరణ చేశారు. 70 శాతానికిపైగా భూసేకరణకు అవార్డులు ప్రకటించారు. మిగతావి వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. ఈ భాగం రహదారి పనుల్లో 44 పెద్ద వంతెనలు, 127 చిన్న వంతెనలు, 4 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, 44 అండర్‌పాసులు, 1,262 కల్వర్టులు, 9 టోల్‌ప్లాజాలు ఉంటాయి. ఈ రహదారి మొత్తం 9 ప్రాంతాల్లో ఎన్‌హెచ్, ఎస్‌హెచ్ రహదారులతో అనుసంధానమవుతుంది.

గత రెండేళ్లుగా ఉత్తరభాగం పనులపై ఎన్‌హెచ్ఏఐ ఊరిస్తూ వచ్చింది. 2024 డిసెంబరులో మొదటిసారి 4 వరుసల రహదారికి టెండర్ నోటిఫికేషన్ ఇవ్వగా, రెండోసారి 2025 నవంబరులో 6 వరుసల రహదారిగా మార్చి మరోసారి టెండర్లు ఆహ్వానించింది. ఈ రెండుసార్లు ఐదు ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారు. మూడోసారి రెండు ప్యాకేజీలుగా మార్చి బుధవారం నోటిఫికేషన్ ఇచ్చింది. బిడ్‌లు తెరిచి టెండర్ ఖరారు చేసిన అనంతరం లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ అందిన మూడేళ్లలో పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎలాంటి అడ్డంకులు లేకపోతే 2029 నాటికి ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

## ఉక్కపోత... ప్రజలు ఉక్కిరిబిక్కి

మొదటి పేజి తరువాయి



రానున్న నాలుగు రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగనుందని.. అత్యవసరమైతే తప్ప ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు రావొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఎండల తీవ్రత మరింత పెరగనున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఈ వేసవిలో ప్రస్తుతం రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 47.6 డిగ్రీలు నమోదైంది. ఈ వేసవిలో ఇదే అత్యధికం. 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 18 జిల్లాల పరిధిలోని 204 మండలాల్లో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డవడం ప్రచండ భానుడి ప్రతాపానికి నిదర్శనం.

300 మండలాల్లో వడగాలులు!

రాష్ట్రంలో పలు జిల్లాల్లో గురువారం 45 నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. 74 మండలాల్లో తీవ్ర వడగాలులు, 232 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరగొచ్చు. విజయనగరం, మార్కాపురం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విశాఖ, పొట్టిశ్రీరాములు నెల్లూరు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, తిరుపతి జిల్లాల్లో 40 నుంచి 43డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. శుక్ర, శనివారాల్లోనూ ఉష్ణోగ్రతలు భారీగా ఉండొచ్చని ఉండొచ్చు.

వడదెబ్బతో ఇద్దరి మృతి

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం అగ్రహారంలో గీత కార్మికుడు దార్ల కృష్ణ (50) వడదెబ్బతో మృతి చెందాడు. కృష్ణా జిల్లా వణుకూరుకు చెందిన కౌలు రైతు కూనపరెడ్డి రామకృష్ణ (53) పొలం వద్ద వడదెబ్బకు గురై చనిపోయినట్లు రైతులు తెలిపారు.

# ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను పరిశీలించిన మంత్రి



నారాయణపేట మే 21:మక్తల్ పట్టణంలో నిరూపయోగంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు ను గురువారం రాష్ట్ర పాడి పరిశ్రమ, యువజన క్రీడలు,మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పరిశీలించా రు. ఈ మార్కెట్ యార్డు ను మున్సిపాలిటీ కి ఆదాయం వచ్చే విధంగా టౌన్ హాల్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలి

కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట మే 21:నారాయణ పేట జిల్లా కేంద్రం లోని గాయత్రి ఫంక్షన్ హాల్ లో ఈ నెల 22 న ఉదయం 9:30 గంటలకు నిర్వహించే జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్నీ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఒక ప్రకటనలో కోరారు.ముఖ్య అతిథిగా రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి హాజరవుతున్నారనీ తెలిపారు. జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# ఇందిరా మహిళా శక్తి భవనం తుది దశ పనులను పరిశీలించిన కలెక్టర్







నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), మే 21 : నిజామాబాద్ నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమీపంలో అధునాతన హంగులతో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవన సముదాయంను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. తుది దశకు చేరుకున్న నిర్మాణ పనులను, వాటి నాణ్యతను పరిశీలించారు. చివరి దశలో ఉన్న పనులను సైతం వేగవంతంగా పూర్తి చేయించాలని, జూన్ 02వ తేదీ లోపు భవన సముదాయాన్ని సంబంధిత శాఖ అధికారులకు అప్పగించాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి భవనం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని సూచించారు. తుది దశ పనులను కూడా నాణ్యతతో పూర్తి చేయించి, సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఈ భవనం దోహదపడనున్నందున ఎలాంటి సౌకర్యాలకు తావు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓసాయన్న, జిల్లా పంచాయతీరాజ్ అధికారి బావయ్య, ఈ.ఈ వీరానంద్, మెప్మా ఏపీడీ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో 'పాప్ కాన్ 2026 ' ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ సదస్సు

-ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ అరవింద్ సహాయ్

-కీలకోపన్యాసం చేయనున్న డాక్టర్ ఇమంది..శంకరరావు




పఠాన్ చేరు, మే 21 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): భారతదేశంలో ఆచరణాత్మక విద్య భవిష్యత్తును తీర్చిదిద్దే లక్ష్యంతో గీతం డీమ్డ్ టు బి యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో జూన్ 26, 27 తేదీలలో "పాప్ కాన్ 2026" పేరుతో రెండు రోజుల ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ సదస్సు నిర్వహించనున్నారు. ఆచరణాత్మక విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణుల కోసం భారతదేశంలో నిర్వహిస్తున్న తొలి ప్రత్యేక సదస్సుగా దీనిని అభివర్ణిస్తూ గీతం సెంటర్ ఫర్ బిజినెస్ ఎంగేజ్‌మెంట్ చైర్‌పర్సన్ డాక్టర్ జోసెఫ్ పాల్ గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సదస్సు దేశంలో ఆచరణాత్మక విద్యావేత్తల కోసం జాతీయ స్థాయి ఉద్యమానికి నాంది పలుకుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మేనేజ్మెంట్ డెవలప్మెంట్ ఇన్స్ట్యూట్ గుర్గావ్ డైరెక్టర్, బిర్లానూ లిమిటెడ్, టాటా ఏఐఏ, మ్యాటర్, బ్రాండ్ స్కేప్స్, వర్ధమాన్ సంస్థలలో స్వతంత్ర డైరెక్టర్‌గా కొనసాగుతున్న ప్రొఫెసర్ అరవింద్ షావ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే ఎండీఐ గుర్గావ్ మాజీ చైర్మన్, జీఎంఆర్ గ్రూప్ స్వతంత్ర డైరెక్టర్ డాక్టర్ ఇమండీ శంకర్ రావు ముఖ్య వక్తగా కీలకోపన్యాసం చేయనున్నారు. దేశంలో ఆచరణాత్మక విద్యకు పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని పరిశ్రమ అనుభవాన్ని విద్యారంగానికి తీసుకువచ్చే నిపుణులకు అవసరమైన పరికరాలు, అవగాహన, అనుసంధానం కల్పించేందుకు ఈ సదస్సును రూపొందించినట్లు డాక్టర్ జోసెఫ్ పాల్ తెలిపారు. సదస్సులో ప్యానెల్ చర్చలు, నిపుణుల ప్రసంగాలు, కీలకోపన్యాసాలు, కార్యశాలలు, నెట్‌వర్కింగ్ అవకాశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమ నుంచి విద్యారంగానికి మార్పు, ఆచరణాత్మక నిపుణుల అనుభవాలను విద్యా క్రమశిక్షణతో అనుసంధా నించడం, కేస్ స్టడీస్ అభివృద్ధి, ఉన్నత విద్యలో ప్రొఫెసర్స్ ఆఫ్ ప్రాక్టీస్ పాత్ర, విద్యా రంగంలో వృత్తి అవకాశాలు, నిర్మాణాత్మక పరివర్తన ప్రణాళికలు వంటి అంశాలు సదస్సులో ప్రధాన చర్చాంశాలుగా ఉండనున్నాయి. విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణుల మధ్య పరస్పర సహకారం, పరిచయాల పెంపుకు కూడా ఈ కార్యక్రమం వేదిక కానుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్స్ ఆఫ్ ప్రాక్టీస్, అసిస్టెంట్ లేదా అసోసియేట్ ప్రొఫెసర్స్ ఆఫ్ ప్రాక్టీస్, అనుబంధ అధ్యాపకులు, అతిథి ఉపన్యాసకులు, బోధనపై ఆసక్తి కలిగిన పారిశ్రామికవేత్తలు, విద్యారంగంలో కెరీర్ కోరుకునే నిపుణులు, కార్పొరేట్ శిక్షకులు, కన్సల్టెంట్లు, అలాగే విద్యాసంస్థల డీన్లు, డైరెక్టర్లు, రిక్రూటర్లకు ఈ సదస్సు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సదస్సులో పాల్గొనదలచిన వారు నమోదు, రుసుము తదితర వివరాల కోసం కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ అలేఖ్య మరంను ఏఎవఏస్త్రఖుఎ.వఎబ ఈ-మెయిల్ ద్వారా లేదా 96500 89575 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

# కల్వరి టెంపుల్ వ్యవస్థాపకుడిపై జంతు అక్రమ రవాణా ఆరోపణలు

-విదేశీ జాతి కుక్కల బ్రీడింగ్, విక్రయాలపై మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు



శేరిలింగంపల్లి, మే 21 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలోని కల్వరి టెంపుల్ వ్యవస్థాపకుడు పి.సతీష్ కుమార్‌పై జంతు అక్రమ రవాణా, విదేశీ జాతి కుక్కల అక్రమ బ్రీడింగ్, విక్రయాలు, జంతు క్రూరత్వానికి సంబంధించిన ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ మేరకు జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర రెడ్డి మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, సైబీరియన్ హస్కీ, జర్మన్ షెపర్డ్ తదితర విదేశీ జాతి కుక్కలను విదేశాల నుంచి అక్రమంగా తీసుకువచ్చి భారీ స్థాయిలో బ్రీడింగ్ నిర్వహిస్తూ, వాటి పప్పీలను లక్షల రూపాయలకు విక్రయిస్తున్నట్లు ఆరోపించారు. వృద్ధాప్యానికి చేరిన లేదా బ్రీడింగ్‌కు పనికిరాని కుక్కలను సంగారెడ్డి పరిసర ప్రాంతాలలో వదిలేస్తున్నారని, దీంతో కొన్ని కుక్కలు తీవ్రమైన ఎండలను తట్టుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు లేకుండా కుక్కలను వదిలేయడం జంతువులపై అమానుష చర్య అని జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కుక్కలు గ్రామాలలో తిరుగుతూ ప్రజలలో భయాందోళనలు కలిగిస్తున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కల్వరి టెంపుల్ కేంద్రంగా జరుగుతున్న అక్రమ బ్రీడింగ్, జంతువుల కొనుగోలు--విక్రయాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, సంబంధిత చట్టాల ప్రకారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కసిరెడ్డి భాస్కర రెడ్డి పోలీసులను కోరారు.

# దూరదృష్టి నాయకుడు, ఆధునిక భారతా నిర్మాణ సెల్పీ రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులు

-అర్పించిన సినియర్ కాంగ్రెస్ నాయకులు మిరియాల రాఘవరావు, యూత్ ఐకాన్ ప్రీతం



శేరిలింగంపల్లి, మే 21 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): మాజీ ప్రధాని, ఆధునిక భారతదేశ నిర్మాణానికి దూరదృష్టితో పునాది వేసిన మహానేత రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మిరియాల రాఘవరావు, ప్రీతం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశ అభివృద్ధి, సాంకేతిక విప్లవం, యువతకు అవకాశాల కల్పనలో రాజీవ్ గాంధీ పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. రాజీవ్ గాంధీ దేశాన్ని ఆధునికత వైపు నడిపించిన దూరదృష్టి నాయకుడని, సమాచార సాంకేతిక రంగానికి బలమైన పునాదులు వేసి భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, యువతకు విద్యా, ఉపాధి అవకాశాల విస్తరణలో ఆయన చేసిన కృషి దేశ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని మిరియాల రాఘవరావు, ప్రీతం స్పష్టం చేశారు. దేశ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన మహానేతకు ప్రతి భారతీయుడు రుణపడి ఉంటాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొని రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకున్నారు. ఆయన చూపిన మార్గంలోనే దేశ అభివృద్ధి కొనసాగాలని ఆకాంక్షించారు.

# బాచుపల్లిలో మమతా హాస్పిటల్‌పై ఆరోపణలు -రోగులపై అధిక భారం.. సిబ్బందిపై వెట్టి చాకిరి ఆరోపణలు, కనీస వేతనాలు లేవా..!




-ఎంప్లాయ్ పిల్లలకు ఆసుపత్రి సౌకర్యం లేక అసంతృప్తి ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్

పఠాన్ చేరు, మే 21 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): బాచుపల్లి లో ఉన్న మమత హాస్పిటల్ యాజమాన్యంపై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రోగుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయడం, బయట మందులు కొనుగోలు చేయకుండా ఒత్తిడి చేయడం, ఆసుపత్రి ఫార్మసీ నుంచే మందులు తీసుకోవాలని నిబంధనలు పెట్టడం ద్వారా ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సాధారణంగా బయట మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే మందులు ఆసుపత్రి లోపల అధిక ధరలకు విక్రయిస్తున్నారని, "బయట మందులు కొనొద్దు" అంటూ రోగుల బంధువులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని సమాచారం. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనాలు కూడా అమలు కావడం లేదని, తక్కువ జీతాలతో ఎక్కువ పని చేయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది ఉద్యోగులు "వెట్టి చాకిరిలా పని చేయిస్తున్నా, సరైన వేతనం లేదు" అని వాపోతున్నట్లు సమాచారం. అంతేకాకుండా, ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగుల కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఉద్యోగుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, లాభాల కోసమే యాజమాన్యం వ్యవహరిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడం, సిబ్బందిపై ఒత్తిడి, కనీస వేతనాల అమలు లేకపోవడం వంటి అంశాలపై ప్రభుత్వం, కార్మిక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు, బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# సుప్రీంకోర్టు తీర్పుతో బీసీలకు న్యాయం జరుగుతుంది

-జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన ఆర్ కృష్ణయ్య, భేరి రామచంద్ర యాదవ్



హైదరాబాద్, మే 21 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన నిర్వహించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల ఐక్యవేదిక జాతీయ సభ్యులు, బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు భేరి రామచందర్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తూ భేరి రామచంద్ర యాదవ్, ఆర్ కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జనగణనలో కులగణన నిర్వహణ అవసరంపై వారు సానుకూలంగా చర్చించారు. వారు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు దేశంలోని బీసీ కులాలకు ఎంతో మేలు చేసే నిర్ణయమని పేర్కొన్నారు. కులగణన ద్వారా బీసీల వాస్తవ జనాభా వివరాలు వెలుగులోకి వస్తాయని, దాని ఆధారంగా రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు సమగ్రంగా అమలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. తెలంగాణతో పాటు జాతీయ స్థాయిలో కూడా బీసీ వర్గాలకు మరింత హక్కులు, అవకాశాలు లభించే పరిస్థితి ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సమగ్ర జనగణనతో పాటు కులగణనను వెంటనే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

# టిఆర్ ఎస్ జెండా పండుగను ఘనంగా నిర్వహిద్దాం



నారాయణపేట మే 21:జిల్లా కేంద్రంలో ఈ నెల 26న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న పార్టీ జెండా ఆవిష్కరణ మహో త్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు గావినోళ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు చందు పిలుపునిచ్చారు.గురువారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీకి జిల్లాలో అన్ని వర్గాల ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. మహిళలు, యువత, రైతులు, నిరుద్యోగులు, ఉద్యమకారులు పెద్ద ఎత్తున పార్టీ లో చేరుతున్నారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని 28 గ్రామాల్లో పార్టీ కమిటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఈ నెల 20వ తేదీ నుండి వచ్చే నెల 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, మండల కేంద్రాలు మరియు నాలుగు మున్సిపాలిటీల్లో జెండా ఆవిష్కరణ పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.పార్టీ అధికారం లోకి వస్తే ప్రతి విద్యార్థికి ఉచిత విద్య, ప్రతి పేద కుటుంబానికి ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. సామాజిక న్యాయం, రైతు సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తామని, యువతకు నాలుగు లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. స్వయం ఉపాధి కోసం బ్యాంకులతో సంబంధం లేకుండా ప్రభుత్వమే రూ.20 కోట్ల వరకు రుణ సహాయం అందించే విధానాన్ని తీసుకువస్తామని పేర్కొన్నారు.అలాగేనారాయణ పేట్ పట్టణ ములో ప్రభుత్వ ఆసుపత్రి లేనందునా ప్రజలు చాలా యిబ్బంది పడుతున్నారు కాబట్టి వెంటనే ఆసుపత్రి నిర్మాణం చెయ్యాలని మరియు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను కేవలం రెండు ఎకరాలకు మాత్రమే పరిమితం చేయడం రైతులకు అన్యాయం అని విమర్శించారు. మిగిలిన ఎకరాలకు కూడా రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో కొడంగల్ నియోజకవర్గం ఇంచార్జి నీలి జనార్దన్, కొత్త పల్లి మండలం అధ్యక్షులు శివ శంకర్, ఖాజీపూర్ వెంకటప్ప ఆశన్ పల్లి నారాయణ రెడ్డి విట్ల పూర్ భీంశప్ప లతో పాటు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మతు కోసం 25న సిపిఎం బైక్ యాత్ర



నారాయణపేట మే 21:మాగనూరు మండల పరిధిలోని వడ్వాట్ సత్యారం కొలుపూర్ మందిపాల్ వరకు బీటీ రోడ్ పూర్తిగా పాడైపోయింది పాడైన బీటీ రోడ్డును డబుల్ రోడ్డు గా మార్చాలని ఈనెల 25 తేదీనాడు ముక్తల్ నుండి నారాయణపేట కలెక్టర్ కార్యాలయం వరకు జరుగు బైక్ యాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనీ జయప్రదం చేయాలని కోరుతూ గురువారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మక్తల్ ఏరియా కార్యదర్శి పుంజనూర్ ఆంజనేయులు, భరత్ కుమార్ మాట్లాడుతూ మండల కేంద్రం నుండివెళ్తున్న వర్కూర్ నేరడగం ఉజ్జల్లి బైరంపల్లి వరకు, ఎన్ హెచ్ 167 వడ్వాట్ నుండి మందిపాల్ వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసం అయినప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యారని ప్రతిరోజు నిత్యం ప్రమాదా లకు గురై ప్రాణాలు పోతున్న పరిస్థితి ఉంది మండల పరిధిలోని మాగనూరు నుండి కొత్తపల్లి మీదుగా కుస్సీవరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేయాలని, అదేవిధంగా మాగనూరు కట్టెల మిషన్ నుండి ఖాన్ దొడ్డి మీదుగా ఆనంపల్లి వరకు, మాగనూరు సబ్స్టేషన్ నుండి దాసరపల్లి వరకు ఫార్మషన్ రోడ్డు నిర్మాణం చేయాలని , ఎన్ హెచ్ 167 నుండి ఓబులాపురం వరకు బిటి రోడ్డు నిర్మాణం చేయాలని మాట్లాడడం జరిగింది. ప్రస్తుతం ఉన్న బండ్ల బాటలు, నక్ష లో ఉన్న బాటలను మట్టి రోడ్లుగా మార్చాలని డిమాండ్ చేశారు ,ఈనెల 25న మక్తల్ నుంచి నారాయణపేట కలెక్టరేట్ ఆఫీస్ వరకు జరిగే బైక్ యాత్రలో ప్రజలు ప్రజాతంత్ర వాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కే నరసింహా, వడ్డే రాజు, వడ్డే ఆంజనేయులు సత్యారం రాజు సురేష్ వెంకటేష్ దత్తు ఎండి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్‌తో ప్రజల వద్దకే పోలీసు సేవలు: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్




నారాయణపేట మే 21: ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో నారాయణపేట జిల్లా పోలీసులు ఆన్‌సైట్ - ఎఫ్ఐఆర్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదు దారులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సినఅవసరం లేకుండా, సంఘటన జరిగిన ప్రదేశానికే వెళ్లి ఫిర్యాదులను స్వీకరించి ఎఫ్ఐఆర్నమోదు చేసే ఈ విధానం ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసు కుంటు న్నామని ఎస్పీ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు త్వరితగతిన, పారదర్శ కంగా, నమ్మకమైన పోలీసు సేవలు అందించాలనే ఉద్దేశంతో నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ 'ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్' విధానాన్ని అమలు చేస్తోంది. బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల్లో, సంఘటన స్థలానికే వెళ్లి ఫిర్యాదు స్వీకరించి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందించేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతోంది. ప్రత్యేకించి మహిళపై అత్యాచారాలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, చోరీలు, గొడవలు, మిస్సింగ్ కేసులు, లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, ర్యాగింగులు, వృద్ధులు, దివ్యాంగులు, గ్రామీణ ప్రాంత ప్రజలు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న బాధితులకు ఈ సేవ ఎంతో మేలు అనేక సందర్భాల్లో ప్రజలుఅత్యవసర సమయంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితుల్లో 100 డయల్ కు గాని లేదా సంబంధిత పోలీస్ అధికారికి నేరుగా ఫోన్ చేసి సమాచారం అందజేస్తే పోలీసు అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి తక్షణ చర్యలు ప్రారంభిస్తారు. సమస్య ఎక్కడ జరిగినా... ప్రజలకు పోలీసు సహాయం త్వరగా అందాలన్నదే మా లక్ష్యం. ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అవసరమైన చర్యలు తీసుకుంటారు. దీనివల్ల సమయం ఆదా కావడంతో పాటు కేసుల దర్యాప్తు మరింత వేగంగా, సమర్థవంతంగా జరుగుతుందని, వనపర్తి జిల్లా పోలీసులు ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించే దిశగా కృషి చేస్తున్నారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలి. ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా స్పందించి బాధితులకు న్యాయం అందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎస్పీ తెలిపారు.ఈ విధానం ద్వారా ఇప్పటికే పలు కేసుల్లో బాధితులకు వేగవంతమైన న్యాయం అందుతున్నట్లు తెలిపారు. భయపడకుండా ముందుకు వచ్చి సమాచారం అందిస్తే పోలీసు శాఖ ప్రతి బాధితుడికి అండగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.

# పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత అందించిన..మిరియాల ప్రీతమ్

-పై చదువులకు అండగా మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ సహాయం




శేరిలింగంపల్లి, మే 21 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వెంకుంట, చందానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఎంపీహెచ్ఎస్ ఉర్దూ మీడియం)లో పదో తరగతి పూర్తి చేసి ఉన్నత విద్య కోసం ముందుకు సాగుతున్న పేద విద్యార్థులకు మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిరియాల ప్రీతమ్ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ..చదువే నిజమైన ఆస్తి. విద్యార్థుల ప్రగతే మా లక్ష్యం. మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ విద్యార్థులకు అండగా నిలుస్తుంది అని తెలిపారు. అనంతరం పాఠశాల హెచ్.ఎం ఫిర్దోస్ బేగం మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తు కోసం మిరియాల ప్రీతమ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ వారికి ప్రోత్సాహం అందించడం గొప్ప విషయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, సానుభూతి పరులు మహమ్మద్ గౌస్, మల్లెల జయ, పుట్టల శాంత, మీసాల కవిత, సంగీత, నాజియా బేగం, తస్వీర్ బేగం, పాఠశాల ఉపాధ్యాయులు ఫిర్దోస్ బేగం (హెచ్.ఎం -ఉర్దూ మీడియం), మహ్మద్ ఫైసల్ పాషా, షహనా బేగం, మస్రత్ టీచర్, నిఖత్ ఫాతిమా, మహ్మద్ అహ్మద్ (డిప్యుటేషన్ --సిద్ధిక్ నగర్ పాఠశాల), లక్ష్మణ్ నాయక్ (టి.ఎం హెచ్.ఎం) తదితరులు పాల్గొన్నారు.

లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com

జనరల్ న్యూస్

శుక్రవారం - 22 - మే - 2026

## ఇసుక తవ్వకాలు, రవాణాలో పారదర్శకతకు ప్రాధాన్యం,

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,



లోకల్ గైడ్ నాగర్ కర్నూల్ జిల్లా నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా, సరఫరా వ్యవస్థను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) సమావేశం నిర్వహించారు. సమావేశానికి అదనపు కలెక్టర్ అమరేందర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,........ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే జిల్లాలో ఇసుక రవాణాకు అనుమతులు జారీ చేస్తున్నామని తెలిపారు. నిబంధనల అతిక్రమణను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా సంబంధిత శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పట్టా భూముల్లో ఇసుక రీచుల అనుమతుల అంశాన్ని సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో ఇసుక తవ్వకాలు నిలిచిపోయే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, కొత్త ఆసుపత్రులు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, సాగునీటి ప్రాజెక్టులు తదితర ప్రభుత్వ రంగ నిర్మాణాలకు అవసరమైన ఇసుక కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రజలకు నిరంతర ఇసుక సరఫరా అందేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు.వివిధ ఇంజనీరింగ్ విభాగాలతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, నిర్మాణ అవసరాలకు అనుగుణంగా ఏ ఇసుక రీచ్ నుంచి సరఫరా చేయాలనే అంశంపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాకు అవసరమైన ఇసుక లక్ష్యాన్ని నిర్ణయించిన నేపథ్యంలో అన్ని శాఖల నివేదికల ఆధారంగా రీచ్‌లకు అనుమతులు ఇవ్వాలని అధికారులకు సూచించారు."మన ఇసుక -- మన వాహనం" పోర్టల్‌లో నమోదు చేసుకున్న వాహనాలకు మాత్రమే ఇసుక రవాణా అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. రవాణా ప్రతి దశలో పర్యవేక్షణ ఉండాలని, ప్రజలకు ఇసుక సులభంగా అందుబాటులోకి రావడంతో పాటు అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక రవాణా అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక రవాణా విషయంలో లబ్ధిదారులపై ఎలాంటి అదనపు భారం పడకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇసుక రవాణా పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని, ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావు లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## టీజీపీఎస్సీ డిపార్ట్మెంటల్ పరీక్షల నేపథ్యంలో సిద్దిపేటలో 163 బీఎన్ఎస్ఎస్ అమలు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 21:సిద్దిపేట జిల్లాలో నిర్వహించనున్న టీజీపీఎస్సీ డిపార్ట్మెంటల్ పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కట్టుదిట్టం చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ భారతీయ నాగరిక్ సురక్షా సంహిత బీఎన్ఎస్ఎస్ -2023 (దీచీూా-2023) సెక్షన్ 163 కింద ఉత్తర్వులు జారీ చేశారు.ఈ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని కావేరీ యూనివర్సిటీ, గౌరారం గ్రామం, వర్గల్ మండలంలోని పరీక్షా కేంద్రం చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడటాన్ని నిషేధించారు.ఈ ఆంక్షలు ఈ నెల 23వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు జరిగే ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో కర్రలు, రాళ్లు, ఆయుధాలు లేదా ఇతర ప్రమాదకర వస్తువులు తీసుకెళ్లడాన్ని నిషేధించారు. అలాగే పరీక్షలకు సంబంధించిన నిషేధిత పత్రాలు, చీటీలను తీసుకెళ్లడం కూడా పూర్తిగా నేరమని హెచ్చరించారు.పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ప్రింటింగ్ సెంటర్లు, నెట్ సెంటర్లు తప్పనిసరిగా మూసివేయాలని కమిషనర్ ఆదేశించారు.అయితే విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది, సైనిక సిబ్బంది, విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మరియు అంత్యక్రియల ఊరేగింపులకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు కల్పించారు.విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా పరీక్షలు రాసేలా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ స్టేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మ్యూల్ అకౌంట్ సరఫరాదారుడిని అరెస్ట్ చేసిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు

-సోషల్ మీడియా ద్వారా బ్యాంక్ ఖాతాలు సేకరించి సైబర్ మోసాలకు వినియోగం



సైబరాబాద్, మే 21 (లోకల్ గైడ్ (ప్రతినిధి కృష్ణ): సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు, ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో సైబర్ మోసాలకు మ్యూల్ బ్యాంక్ అకౌంట్లు సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ట్రేడింగ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ గేమింగ్, పార్ట్‌టైం జాబ్ మోసాలు తదితర సైబర్ నేరాలకు ఈ ఖాతాలను వినియోగించినట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్టు అయిన నిందితుడు దిలీప్ సింగ్ (27), జీడిమెట్ల అపూర్వ కాలనీలో నివాసం ఉంటూ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల ద్వారా "జోర్డాన్", "పింటూ భయ్యా" అనే వ్యక్తులతో పరిచయం ఏర్పడి, బ్యాంక్ ఖాతాలు సమకూర్చితే భారీ కమిషన్ ఇస్తామని చెప్పడంతో ఈ వ్యవహారంలో చేరినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడు తనతో పాటు ఇతరుల బ్యాంక్ ఖాతాలు, ఏటీఎం కార్డులు, పాస్‌బుక్స్, చెక్‌బుక్స్, సిమ్ కార్డులు సేకరించి సైబర్ మోసగాళ్లకు అందజేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.1.02 లక్షల నగదు, మూడు మొబైల్ ఫోన్లు, 12 డెబిట్ కార్డులు, చెక్‌బుక్స్, పాస్‌బుక్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కొంతమంది బ్యాంకు ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. సులభంగా డబ్బు వస్తుందని చెప్పి బ్యాంక్ ఖాతాలు అద్దెకు ఇవ్వొద్దని, ఏటీఎం కార్డులు, ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే ఈజీ మనీ ఆఫర్ల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సస్పిసియస్ లావాదేవీలు గమనించిన వెంటనే పోలీసులకు లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

## రైతుల రవాణా ఇబ్బందులకు పరిష్కారం.. తొగుటలో రంగంలోకి దిగిన అధికారులు



తొగుట (లోకల్ గైడ్) మే 21:సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో రైతులు ఎదుర్కొంటున్న ధాన్యం రవాణా సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాల ఐకేపీ సెంటర్లను సందర్శించిన సందర్భంగా రైతులు లారీల కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన తొగుట ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్) వెంటనే ఎమ్మార్వో మహ్మద్ సమీర్ హిమ్మద్ ఖాన్, ఎస్సై రవికాంత్, ఏఎస్ఐ రాంరెడ్డి, ఆర్ఐ రాజేందర్ రెడ్డితో కలిసి చర్యలు ప్రారంభించారు.శారదాంబ రైస్ మిల్‌లో ఇప్పటికే లోడ్ ఉన్న లారీలను త్వరితగతిన అన్‌లోడ్ చేయించి, ఆ లారీలను తిరిగి ఐకేపీ సెంటర్లకు పంపించేలా సమన్వయం చేశారు. దీంతో ధాన్యం తరలింపులో వేగం పెరిగి రైతులకు కొంత ఊరట లభించింది.రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలో స్పందించడం పట్ల స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



అక్బర్ పెట్ భూంపల్లి (లోకల్ గైడ్) మే 21:దుబ్బాక నియోజకవర్గంలోని భూంపల్లి గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ రంగయ్య గారి జన్నారెడ్డి అందజేశారు.ఇటీవల అనారోగ్య సమస్యలతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురు బాధితులు సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులు వారికి అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం మరియు స్థానిక ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

21-05-2026,

పత్రిక ప్రకటన

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ (బాలల అవార్డు) కొరకు దరఖాస్తుల ఆహ్వానం:

సిద్దిపేట జిల్లాలో వివిధ రంగాలలో సాంస్కృతిక కలలు, క్రీడలు, సమాజ సేవ, పాండిత్యం, సాహసరంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాలలు సంబంధిత సపోర్టింగ్ డాక్యుమెంట్స్ తో దరఖాస్తు చేసుకోగలరు. ఈ దరఖాస్తులు కేవలం ఆన్లైన్లో మాత్రమే స్వీకరించబడతాయి. మహిళా, శిశు సంక్షేమ శాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కొరకు దరఖాస్తుల ఆహ్వానం. 5 నుండి 18 సంవత్సరాల లోపు బాల బాలికలు అర్హులు ( జులై 31 నాటికి). వీటి అర్హతలకు సంభందదించిన పూర్తి వివరాల కోసం (https://awards.gov.in/Home/AwardLibrary వెబ్ సైట్ లో పరిశీలించి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను 31st 'July'2026 తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి Ch. శారద గారు ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం District Child Protection Unit Room No: (S 28), 2nd floor Collectorate Complx దుద్దెడ సంప్రదించగలరు.

Smt, Ch. శారద
జిల్లా సంక్షేమ అధికారి,
మహిళా, శిశు, వికలాంగ మరియు వృద్ధుల శాఖ,
సిద్దిపేట ,
9494996177

సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 21:భారత ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందజేసే "ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్" అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి చి. శారద తెలిపారు.సాంస్కృతిక రంగం, క్రీడలు, సమాజ సేవ, పాండిత్యం, సాహస రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన 5 నుండి 18 సంవత్సరాల లోపు బాలబాలికలు ఈ అవార్డులకు అర్హులని పేర్కొన్నారు. జులై 31, 2026 నాటికి వయస్సు ప్రమాణంగా పరిగణించబడుతుందని తెలిపారు.అభ్యర్థులు అవసరమైన సపోర్టింగ్ డాక్యుమెంట్స్‌తో ఆన్లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు వెబ్‌సైట్‌లో వివరాలు పరిశీలించి ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.మరిన్ని వివరాల కోసం జిల్లా కలెక్టరేట్ రెండో అంతస్తులోని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (రూమ్ నెం. ూ-28)ను సంప్రదించవచ్చని వెల్లడించారు.

## ఏదులాపురం మునిసిపాలిటి



' లోకల్ గైడ్' ఖమ్మం ' సత్యనారాయణపురం లో మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన రెవిన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి గారు, చైర్మన్ పోకబత్తిని అనిత, ఆత్మ కమిటి చైర్మన్ చావా శివ రామకృష్ణ, మద్దులపల్లి మార్కెట్ కమిటి చైర్మన్ బైరు హరినాద్ బాబు, తోట చిన్న వెంకట రెడ్డి, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ ఉమ్మినేని కృష్ణ, మెంబర్ రంజిత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నగదు చెల్లింపులు సకాలంలో పూర్తి చేయాలి.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తున్న ధాన్యానికి సంబంధించి ఆయా రైతుల ఖాతాలలో నగదు చెల్లింపులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయాన్ని కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్,పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి సందర్శించి రైతులకు చేస్తున్న నగదు చెల్లింపు ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని,ఈ క్రమంలో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలను నగదు చెల్లింపులు సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాలలో రైతుల వివరాలు రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయడంతో పాటు ట్యాబ్ లలో నమోదు చేయాలని,ఆ దిశగా పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు,అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 90 నిమిషాల్లోనే చైన్ స్నాచర్ అరెస్ట్.. హుస్నాబాద్ పోలీసుల చాకచక్యం

సీసీ కెమెరాల సహాయంతో నిందితుడిని పట్టుకున్న సీసీఎస్, హుస్నాబాద్ పోలీసులు



హుస్నాబాద్ (లోకల్ గైడ్) మే 21: వృద్ధ మహిళను మోసం చేసి బంగారు గొలుసు అపహరించిన నిందితుడిని కేవలం 90 నిమిషాల్లోనే అదుపులోకి తీసుకుని హుస్నాబాద్ పోలీసులు తమ



చాకచక్యాన్ని చాటుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం.. అల్లెపు కృష్ణ అనే వ్యక్తి అయిలేని లక్ష్మీ (76) అనే వృద్ధ మహిళను సంప్రదించి ఆమెకు నెలకు రూ.4 వేల పెన్షన్ ఇప్పిస్తానని నమ్మించాడు. గాయత్రి బ్యాంకులో లైన్ ఎంత ఉందో చూసి వస్తానని చెప్పి వెళ్లి వచ్చాడు. అనంతరం బ్యాంకులో ఫోటో కోసం పుస్తెల తాడు కావాలని, ఫోటో దిగిన వెంటనే తిరిగి ఇస్తానని చెప్పి బాధితురాలి మెడలో ఉన్న సుమారు రెండున్నర తులాల బంగారు చైన్ తీసుకుని పరారయ్యాడు.బాధితురాలి ఫిర్యాదు మేరకు హుస్నాబాద్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. స్థానిక ఎస్ఐ లక్ష్మారెడ్డి, కానిస్టేబుల్ నరేష్ ఘటన స్థలానికి చేరుకొని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడి కదలికలను గుర్తించారు. వెంటనే సీసీఎస్ ఇన్స్పెక్టర్లు పెండ్యాల దేవేందర్, రవీందర్ మరియు వారి బృందం రంగంలోకి దిగి సీసీ ఫుటేజ్‌ను విశ్లేషించారు.కేవలం గంటన్నర వ్యవధిలోనే హుస్నాబాద్ బస్టాండ్ వద్ద నిందితుడు అల్లెపు కృష్ణను సీసీఎస్ పోలీసులు విజయవంతంగా అదుపులోకి తీసుకున్నారు.ఏసీపీ హుస్నాబాద్ ఎస్. సదానందం పర్యవేక్షణలో కేసును వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన సీసీఎస్ ఇన్స్పెక్టర్లు పెండ్యాల దేవేందర్, రవీందర్, సీసీఎస్ ఎస్ఐ తిరుపతి, హుస్నాబాద్ ఎస్ఐ లక్ష్మారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు యాదగిరి, నగేష్, కానిస్టేబుల్ నరేష్‌లను సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అభినందించారు.ఈ ఘటనతో సీసీ కెమెరాల ప్రాముఖ్యత మరోసారి స్పష్టమైందని, ప్రజలందరూ తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంలో భాగస్వాములు కావాలని ఏసీపీ సదానందం కోరారు.

## వరిధాన్యం దిగుమతిలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలి..

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కేటాయించిన రైస్ మిల్లులు,గోదాములకు తరలించిన దాన్యం దిగుమతి ప్రక్రియలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని మందమర్రి మండలం అందుగులపేటలో గల వాసవి రైస్ మిల్లును జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు,జిల్లా మేనేజర్ శ్రీకళ,మందమర్రి మండల



తహసిల్దార్ సతీష్ కుమార్ లతో కలిసి సందర్శించి ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు.కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు,గోదాములకు తరలించాలని తెలిపారు.గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతిలో ఆలస్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని,అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు.రైస్ మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు.అనంతరం నస్పూర్ మండల కేంద్రంలోని స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి,జిల్లా మేనేజర్,నస్పూర్ మండల తహసిల్దార్ సంతోష్ లతో కలిసి సందర్శించారు.కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని,నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని తెలిపారు.నిల్వ చేసిన ధాన్యాన్ని తదుపరి ఆదేశాల ప్రకారం తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

## జూన్ 2న సామూహిక ఇందిరమ్మ గృహ ప్రవేశాలకు అధికారులు సిద్ధం కావాలి : కలెక్టర్ హైమావతి

ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ పనులు, వనమహోత్సవం, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై సమీక్ష

సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 21:గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్లు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, నూతన ఘన వ్యర్థాల నిర్వహణ-2026 అంశాలపై ఎంపీడీఓలు, ఎంపీఓలు, గృహనిర్మాణ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా నిర్వహించే సామూహిక ఇందిరమ్మ గృహ ప్రవేశాల కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్లాబ్ స్థాయిలో ఉన్న అన్ని ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల వారీగా శాంక్షన్, మార్కింగ్, బేస్‌మెంట్, గోడలు, స్లాబ్ స్థాయిలో ఉన్న గృహాల వివరాలను పరిశీలించారు. మార్కింగ్ చేసుకుని పనులు ప్రారంభించని లబ్ధిదారులతో అధికారులు ప్రత్యేకంగా మాట్లాడి నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 30లోపు మార్కింగ్ పెండింగ్‌లో



ఉన్న ఇళ్ల పనులు ప్రారంభం కాకపోతే వాటిని డిలీట్ చేయాలని స్పష్టం చేశారు.ఉపాధి హామీ పథకం కింద గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, పాఠశాల కాంపౌండ్ వాల్స్, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ భవనాలు తదితర పనులను వేగవంతం చేయాలని తెలిపారు. కాంట్రాక్టర్లు ముందుకు రాని చోట కొత్తగా ఎన్నికైన సర్పంచులతో సమావేశాలు నిర్వహించి పనులు ప్రారంభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జూన్ 15లోపు పనులు పూర్తి చేయాలని సూచించారు.ప్రస్తుతం జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద రోజుకు 53 వేల మంది కూలీలు పనిచేస్తున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచాలని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7 గంటలకే అధికారులు గ్రామాల్లో పనులను పరిశీలించాలని ఆదేశించారు.వనమహోత్సవం సందర్భంగా జిల్లాకు 15 లక్షల మొక్కల లక్ష్యం కేటాయించబడిందని, నర్సరీల నిర్వహణతో పాటు ఎస్‌హెచ్‌జీ మహిళలతో సమావేశాలు నిర్వహించి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీడీఓలకు సూచించారు. రోడ్ల పక్కనే కాకుండా దీర్ఘకాలం నిలిచే ప్రాంతాల్లో మొక్కలు నాటాలని చెప్పారు.చేయూత పెన్షన్ల ఫేస్ రికగ్నిషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, మరణించిన లబ్ధిదారుల కేసుల్లో తప్పనిసరిగా మరణ



ధృవీకరణ పత్రాలు సేకరించాలని ఆదేశించారు.15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ సర్పంచ్ జనరల్ బాడీ తీర్మానాల ప్రకారం ప్రాధాన్యత ఆధారంగా వినియోగించాలని, ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలను పంచాయతీ రాజ్ శాఖ మార్గదర్శకాల ప్రకారం పగడ్బందీగా అమలు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ రమేష్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, డీపీఓ రవీందర్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి



మిడ్జిల్ మే 21(లోకల్ గైడ్ ):మిడ్జిల్ మండల కేంద్రంలో భారత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. యువతకు ఆయన ఆదర్శప్రాయ నాయకుడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మిడ్జిల్ సర్పంచ్ ఎడ్ల శంకర్, ఉప సర్పంచ్ మన్యం మమత, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోదా కృష్ణ యాదవ్, నాయకులు సాయిలు, మల్లికార్జున్ రెడ్డి, జహంగీర్, జహీర్, అదం, జంగయ్య, నరేష్, చంద్రమౌళి, వార్డు సభ్యులు కురుమయ్య, పర్వతాలు, పంజాం కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# గంజాయి సేవిస్తున్న 4గురు నిందితుల అరెస్టు...
# 15రోజుల పునరావాస కేంద్రానికి తరలింపు..



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తు 4గురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారని మందమర్రి ఎస్ఐ నరేష్ తెలిపారు.ఎస్ఐ తన సిబ్బందితో కలిసి పట్టణంలో సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా 4గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారని,పోలీసులను చూడగానే వారు అక్కడి నుండి పారిపోవడానికి ప్రయత్నించారని ఎస్ఐ తెలిపారు.అప్రమత్తమైన పోలీస్ సిబ్బంది వారిని వెంటాడి చాకచక్యంగా పట్టుకున్నారు.పట్టుబడిన వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా,వారు గంజాయి సేవించినట్లు వారు అంగీకరించారని,తక్షణమే ఘటనా స్థలంలో పంచనామా నిర్వహించి,చట్టపరమైన నిబంధనల ప్రకారం నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.అనంతరం నిందితులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు.వైద్య పరీక్షల్లో వారు గంజాయి సేవించినట్లు వైద్యులు ధృవీకరించారని,వైద్య పరీక్షల అనంతరం నిందితులను వెంటనే స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచారు.కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి నలుగురు నిందితులను15రోజుల పాటు పునరావాస కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.గంజాయి సేవిస్తున్న 4గురు నిందితులను చాకచక్యంగా పట్టుకున్న మందమర్రి ఎస్ఐ,సిబ్బంది మహేష్,చైతన్య లను పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.సమాజంలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## నేడు నిర్వహించే ప్రజా పాలన
## జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి -
## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కిరణ్మయి.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నేడు ( 22వ తేదీన ) నిర్వహించే జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి కోరారు. గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజాపాలన కార్యక్రమాలను చక్కగా నిర్వహించడం జరిగిందని, అదే స్ఫూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మరింత అట్టహాసంగా నిర్వహించేలా కృషి చేయాలన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ఫోటోలు, ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితాలను, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించేందుకు వీలుగా సమగ్ర వివరాలతో నివేదికలను అందించాలని ఆదేశించారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సాధించిన పురోగతిని సమగ్రంగా ప్రదర్శించేలా నివేదికలు ఉండాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి స్టాళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, శాఖల వారీగా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతి..



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మాజీ ప్రధాన మంత్రి,భారత రత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సీసిసి కార్నర్ వద్ద మంచిర్యాల కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్,డిప్యూటీ మేయర్ సళ్ళ రమ్య లు,నాయకులు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని,దేశంలో తీసుకువచ్చిన సంస్కరణలను,పేద,బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ ప్రజలు మర్చిపోలేరని అన్నారు.ముఖ్యంగా యువతకు18సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన మహనీయుడని,అంతేకాకుండా దేశంలో సాఫ్ట్ వేర్ విధానాన్ని ప్రవేశపెట్టి దేశాన్ని ముందుకు నడిపించిన గొప్ప నాయకుడు అని అన్నారు.ఈ కార్యక్రమంలో నస్పూర్ కాంగ్రెస్ ఇంచార్జి నూకల రమేష్,ఆయా డివిజన్ ల కాంగ్రెస్ అధ్యక్షులు,మహిళా,యువజన ,మైనార్టీ,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ధాన్యం దిగుమతి ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాములు.



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి కేటాయించిన గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వి రాములు సూచించారు.గురువారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారంలోని వరలక్ష్మి,జయలక్ష్మి రైస్ మిల్లులు,సుముఖ గోదామును జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు,జిల్లా మేనేజర్ శ్రీకళ,జైపూర్ మండల తహసిల్దార్ వనజా రెడ్డి లతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల మేరకు కొనుగోలు చేస్తున్నామని,రైతుల కోసం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు,నీడ,ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు,గోదాములకు తరలించినట్లు తెలిపారు.రైస్ మిల్లులకు,గోదాములకు తరలించబడిన ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని,అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంచుకోవాలని తెలిపారు.జిల్లాలోని రైతులు ఇబ్బందులు పడకుండా వరి ధాన్యం కొనుగోలు,దిగుమతి ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని,కొనుగోలు చేసిన ధాన్యం రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

# ఆపదలో మేమున్నాం అంటున్న గుంపెళ్ల గూడెం ఉద్యోగ సంఘం

నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ
- మానవత్వం చాటిన
ఉద్యోగ సంఘ నాయకులు
గ్రామంలో పేద కొర్ర విరు కూతురు పెళ్లికి
సహాయం,వృద్ధురాలి ఇంటి
మరమ్మతులకు ఆర్థిక చేయూత



ఖమ్మం జిల్లా, కారేపల్లి : లోకల్ గైడ్, మే 21 : సింగరేణి మండలం గుంపెళ్ల గూడెం గ్రామంలో మానవత్వానికి ప్రతీకగా నిలుస్తూ గుంపెళ్ల గూడెం ఉద్యోగ సంఘం మరోసారి సేవా కార్యక్రమాలతో ప్రజల మనసులు గెలుచుకుంది. గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, "ఆపదలో మేమున్నాం" అనే భావనను కార్యరూపంలో చూపించింది. అవసరంలో ఉన్న వారిని గుర్తించి, తమ వంతు సహాయం అందించడం ద్వారా ఉద్యోగ సంఘ సభ్యులు గ్రామ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు.గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం అయిన కొర్ర వీరు కుటుంబం ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఆయన కుమార్తె వివాహం నిర్వహించడం భారంగా మారిన పరిస్థితిని తెలుసుకున్న ఉద్యోగ సంఘ సభ్యులు వెంటనే స్పందించారు. కుటుంబానికి ధైర్యం చెబుతూ రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. "పెళ్లి అనేది పేద కుటుంబాలకు ఒక పెద్ద బాధ్యత. అలాంటి సమయంలో సమాజం నుంచి చేయూత లభిస్తే ఆ కుటుంబానికి ఎంతో బలం వస్తుంది" అని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఉద్యోగ సంఘం అందించిన ఈ సహాయం కొర్ర వీరు కుటుంబానికి కొంత ఉపశమనం కలిగించిందని గ్రామస్థులు పేర్కొన్నారు.అలాగే గ్రామానికి చెందిన వృద్ధ ఒంటరి మహిళ చంద్రమ్మ పరిస్థితిని తెలుసుకుని ఉద్యోగ సంఘ సభ్యులు మానవత్వంతో ముందుకు వచ్చారు. జీవనాధారం లేక ఇబ్బందులు పడుతున్న చంద్రమ్మ నివాసం శిథిలావస్థకు చేరుకోవడంతో, వర్షాలు పడితే ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని గమనించిన ఉద్యోగ సంఘ సభ్యులు ఆమె నివాసాన్ని బాగు చేసుకునేందుకు రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. దీంతో వృద్ధురాలు భావోద్వేగానికి గురై ఉద్యోగ సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసినట్లు గ్రామస్థులు తెలిపారు.గ్రామంలో ఎవరైనా ఆపదలో ఉన్నారని తెలిసినా, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం వచ్చినా గుంపెళ్ల గూడెం ఉద్యోగ సంఘం సభ్యులు వెంటనే స్పందిస్తూ తమ వంతు సహాయం అందించడం విశేషమని గ్రామ ప్రజలు కొనియాడుతున్నారు. ఉద్యోగం చేస్తూ తమ వ్యక్తిగత జీవితాలతో బిజీగా ఉన్నప్పటికీ, గ్రామ ప్రజల కష్టాలను తమ కష్టాలుగా భావించి ముందుకు రావడం అభినందనీయం అని పలువురు గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ, "గ్రామంలో ఎవ్వరూ ఒంటరిగా లేరని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడటమే తమ బాధ్యతగా భావిస్తున్నామని" తెలిపారు. కష్టాల్లో ఉన్న పేద కుటుంబాలకు, వృద్ధులకు, విద్యార్థులకు తమ వంతు సహాయం అందించేందుకు ఉద్యోగ సంఘం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, గ్రామ అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుండి పనిచేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు బానోత్ వీరన్న, బానోత్ రాంబాబు, బానోత్ వీరన్న (ఈర్య), లకావత్ లక్ష్మణ్, భూక్యా వీరన్న (ఆర్మీ), అంగోత్ అనిల్ (సీ ఐ ఎస్ ఎఫ్ ), గుగులోత్ సురేష్ (ఆర్మీ), గుగులోత్ శంకర్ తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వీరు గ్రామ ప్రజలతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పడం విశేషంగా నిలిచింది.గుంపెళ్ల గూడెం ఉద్యోగ సంఘం చేపడుతున్న ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామంలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా, "మనిషికి మనిషే తోడు" అనే భావనను బలపరుస్తున్నాయని గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు."ఆపదలో ఆదుకునే చేయి దేవుడి చేయితో సమానం" అనే మాటను గుంపెళ్ల గూడెం ఉద్యోగ సంఘం మరోసారి నిజం చేసింది అని గ్రామ సర్పంచ్ గుగులోత్ క్రిష్ణ వేణి వీరబాబు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు ప్రశంసిస్తున్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం.



రామకృష్ణాపూర్ (లోకల్ గైడ్)క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ పట్టణం ఏ జోన్ రాం నగర్ 13వ వార్డుకు చెందిన నిరుపేద వ్యక్తి వెల్డర్ గా పనిచేసే జగన్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు.ఈ విషయం తెలుసుకొని ఆయన కుమారునికి పార్థివాదేహాన్ని అప్పగించి 9వేల రూపాయలు అంత్యక్రియలు ఖర్చులకు ఆర్థిక సహాయం అందించారు.క్యాతనపల్లి మున్సిపాలిటీ మాజీ కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ పల్లె రాజు,నాయకులు పైడాకుల శ్రీనివాస్,అప్పని రామన్న,కొప్పర్తి నవీన్,స్థానికులు అహ్మద్ పాషా,ఇస్లావత్ రాజేష్,గోలేటి అశోక్,భూక్యా రాజు,పుల్లూరి కళ్యాణ్ లు మానవత్వంతో సహకారం అందించారు.

## క్రీడాకారులకు సన్మానం..



బెల్లంపల్లి (లోకల్ గైడ్)ఈనెల10న హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీ ఉత్తమ ప్రతిభ కనబరిచి పథకాలు సాధించిన బెల్లంపల్లి క్రీడాకారులను తిలక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం సన్మానించారు.జంప్స్,త్రోస్,400 మీటర్ రన్స్ క్రీడా పోటీలలో 16సంవత్సరాల బాలికల విభాగంలో కె సహస్ర లాంగ్ జంప్ లో 3:36మీటర్లు దూకి కాంస్య పథకం,20సంవత్సరాల బాలికల విభాగంలో కె వర్షిని 3:75 మీటర్లు దూకి గోల్డ్ మెడల్ సాధించిందని పేర్కొన్నారు.క్రీడాకారులకు భవిష్యత్తులో క్రీడా పరికరాలు వారికి సహాయ సహకారాలు అందిస్తామని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

# రైతు పండించిన పంటకు విలువ ఏది?

"వరి, మొక్కజొన్న కొనుగోళ్లు, అధిక తూకాలు,
గ్రేడింగ్ అక్రమాలు,
మట్టి--ఇసుక దందాలపై మాజీ ఎమ్మెల్యే దాసరి
మనోహర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం



పెద్దపెల్లి, మే,21 :(లోకల్ గైడ్)పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నిర్వహించిన ప్రెస్ మీట్‌లో వరి, మొక్కజొన్న రైతుల సమస్యలు, కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అధిక తూకాలు, ధాన్యం గ్రేడింగ్‌లో జరుగుతున్న అక్రమాలు, బార్దాన్ కొరత, మట్టి--ఇసుక దందాలు, ప్రజాప్రతినిధుల వ్యవహార శైలి వంటి అనేక అంశాలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. రైతులు "ఆరుగాలం కష్టపడి" పండించిన పంటను నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి "రాత్రి పగలు అనకుండా అక్కడే తింటూ, అక్కడే పడుకుంటూ" కాపలా కాస్తున్న పరిస్థితిని ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున, అధికారులు మరియు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. "వర్షం వస్తే ఒక్కో రైతు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి" అంటూ రైతుల మానసిక పరిస్థితిని ఆయన భావోద్వేగంగా వివరించారు.అధిక తూకాల వ్యవహారంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు మరియు గతంలో కొనుగోలు కేంద్రాల వద్ద తిరుగుతూ "40 కిలోల 650 గ్రాముల కంటే ఒక్క గ్రాము కూడా ఎక్కువ తూకం వేయనివ్వం" అని చెప్పిన ప్రజాప్రతినిధులే ఇప్పుడు అదే కేంద్రాల్లో 41 కిలోల నుంచి 42 కిలోల వరకు తూకం వేయిస్తున్నారని ఆరోపించారు. "40.650 కంటే ఎక్కువ జోకితే దొంగతనమే" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రైతుల నుంచి అదనంగా తీసుకుంటున్న ప్రతి కిలో వెనుక రైస్ మిల్లర్లు, కొందరు నాయకులు ఉన్నారని ఆరోపిస్తూ, "ఈ దొంగతనం వెనకాల మీరందరూ ఉన్నారు" అని నేరుగా విమర్శించారు. ప్రతి సంచిపై తరుగు పేరిట మరో అర కిలో నుంచి ఒక కిలో వరకు తగ్గిస్తున్నారని, మొత్తం మీద ప్రతి క్వింటాల్‌కు రైతు 4 నుంచి 5 కిలోల వరకు నష్టపోతున్నాడని అన్నారు.ధాన్యం గ్రేడింగ్ అంశాన్ని ప్రస్తావిస్తూ, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సూపర్ ఫైన్, ఫైన్ రకాల ధాన్యాన్ని గ్రేడ్-1గా గుర్తించి ప్రతి క్వింటాల్‌కు అదనంగా ?20 రైతులకు అందేలా చేశామని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు అన్ని రకాల ధాన్యాన్ని "కామన్ రకం" కింద చూపిస్తూ రైతులకు రావాల్సిన అదనపు డబ్బును కట్ చేస్తున్నారని ఆరోపించారు. "దాదాపు లక్షల క్వింటాళ్లకు రావాల్సిన ఆ ఇరవై రూపాయలు ఎక్కడికి పోతున్నాయి?" అని ప్రశ్నించారు. "రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు నష్టం చేస్తున్నారు" అంటూ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు.మొక్కజొన్న రైతుల పరిస్థితిని ప్రస్తావిస్తూ "నెల పదిహేను రోజులుగా రైతులు కల్లాల్లో మొక్కజొన్న కుప్పలు పోసి ఎప్పుడెప్పుడు తూకం వేస్తారా అని ఎదురుచూస్తున్నారు" అని అన్నారు. మొక్కజొన్న తడిస్తే "బూజు ఎక్కుతుంది, ఫంగస్ వస్తుంది, దేనికీ పనికిరాదు" అని తెలిసినా ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని ప్రశ్నించారు. రైతులకు అవసరమైన బార్దాన్ సంచులు కూడా ప్రభుత్వం అందించలేకపోతూ, "సంచులు కొనుక్కోండి రైతులారా" అని చెప్పడం అన్యాయమని అన్నారు. రైతు ఒక సంచి ?30 నుండి 35వరకు కొనుగోలు చేస్తే ప్రభుత్వం మాత్రం ?21 మాత్రమే చెల్లిస్తోందని, దీంతో రైతు నేరుగా నష్టపోతున్నాడని పేర్కొన్నారు. "ప్రభుత్వానికే దొరకని సంచి రైతుకు ఎక్కడ దొరుకుతుంది?" నీవు ఒక స్థానిక ప్రజా ప్రతినిధివి ప్రభుత్వ విప్పువ్వు నీవే సంచులు తెప్పించ లేకపోతే రైతులు ఎక్కడనుండి తెచ్చుకుంటారని ప్రశ్నించారు. పైగా నీవే సంచులు తెచ్చుకోమనడం సిగ్గుచేటు అన్నారు. హమాలీలు లేరనే పేరుతో రైతులనే "మీరు పది మందిని తెచ్చుకుని, మీరే నిప్పుకోండి" అని చెప్పడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఓదెల కొనుగోలు కేంద్రంలో లారీలు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తే సంక నాకండి అనడం ఎంతవరకు సబబు. హమాలీలు ఎక్కువ మొత్తంలో డబ్బులు అడుగుతున్నారని అన్న రైతుల తోటి కాళ్ళు మొక్కు దండం పెట్టు, పనులు చేయించుకోవాలని ఇది కూడా నాకు చెప్తారా అని అనడం జరిగింది.మార్క్‌ఫెడ్ కొనుగోళ్లను కొత్తగా ప్రచారం చేస్తున్నారని, కానీ గతంలో కూడా డీసీఎంఎస్ ద్వారా ఇదే విధంగా కొనుగోళ్లు జరిగాయని గుర్తు చేశారు. శ్రీరాంపూర్, ఓదెల, సుల్తానాబాద్, జూలపల్లి, పెద్దపల్లి వంటి ప్రాంతాల్లో గతంలో కూడా రైతులు మొక్కజొన్నను ప్రభుత్వ కేంద్రాల్లో అమ్ముకున్నారని పేర్కొన్నారు. "ఇదేదో కొత్త విషయం జరిగినట్టు మాట్లాడుతున్నారు" అంటూ ఎద్దేవా చేశారు.ప్రెస్ మీట్‌లో వ్యక్తిగత దూషణల అంశాన్ని కూడా ఆయన బలంగా ప్రస్తావించారు. తనపై "నీ మొఖం ఎక్కడది? నీ బతుకు ఎక్కడది?" అని మాట్లాడడం ప్రజాప్రతినిధులకు తగదని అన్నారు. "నీ మొఖం ఉన్నట్టే నా మొఖం ఉంటుంది, నీ బతుకు ఉన్నట్టే నా బతుకు ఉంటుంది" అంటూ కౌంటర్ ఇచ్చారు. "నువ్వు మనిషివైతే ఎదుటివాడు మనిషిలా కనిపిస్తాడు, నువ్వు ఇంకోటి అయితే ఇంకోలాగా కనిపిస్తాడు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కుక్కలు, నక్కలు, లుచ్చాలు, దొంగలు" వంటి పదజాలం ఉపయోగించడం సరైంది కాదని, "లుచ్చ పని చేసేటోడికి అందరూ లుచ్చలాగే కనిపిస్తారు, దొంగ పని చేసేటోడికి అందరూ దొంగల లాగే కనిపిస్తారు" అంటూ తీవ్రమైన విమర్శలు చేశారు.మట్టి వ్యవహారంపై స్పందిస్తూ, తాను చెరువు మట్టిని పొలాల్లో వేయడం "మిషన్ కాకతీయ" అసలు ఉద్దేశానికి అనుగుణంగానేనని చెప్పారు. చెరువులు లోతు కావాలి, మట్టి పొలాల్లో పడాలి, భూసారం పెరగాలి అనే ఆలోచనతో ప్రభుత్వం 2015 లో మిషన్ కాకతీయ పథకం తీసుకువచ్చిందని గుర్తు చేశారు. "పొలంలో పోయకపోతే నీ నోట్లో పోస్తానా?" అని ప్రశ్నిస్తూ విమర్శకులపై తీవ్ర స్థాయిలో స్పందించారు. కాలేజీ పక్కన వ్యవసాయ భూమిలో మట్టి వేసినా దాన్ని వక్రీకరించి చూపిస్తున్నారని అన్నారు. "కన్ను సరిగ్గా కనపడకపోతే నేనేం చేయాలి?" అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు.2009లో ఎమ్మెల్యేగా నువ్వు ఉన్న సమయంలోనే ఎటువంటి అనుమతులు లేకుండా చెరువులు తవ్వించారని, ఇటుకబట్టీలకు మట్టి తరలింపులు జరిగాయని ఆరోపించారు. "ఈ మట్టి దొంగతనానికి ఆద్యుడివి నువ్వే" అని నేరుగా విమర్శించారు. బీ=ూ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మైనింగ్, ఇరిగేషన్ శాఖల ద్వారా నియంత్రణ తీసుకువచ్చి రైతులకు మట్టి వినియోగం ప్రోత్సహించిందని అన్నారు. గతంలో "నీ వారి ఇటుకబట్టీలకే అనుమతులు ఇప్పించావు" అని కూడా ఆరోపించారు.ఇసుక అక్రమాల అంశంలో కూడా ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. స్థానిక అవసరాల కోసం ఉచిత ఇసుక విధానం తానే తీసుకొచ్చానని, కానీ ఇప్పుడు అదే పేరుతో అక్రమ రవాణా జరుగుతోందని అన్నారు. పిట్టలఎల్లయ్య పల్లి, నారాయణపూర్, సుగ్లంపల్లి ప్రాంతాల్లో ఇసుక డంపులు వేసి రాత్రిళ్లు హైదరాబాద్‌కు లారీలు పంపుతున్నారని ఆరోపించారు. (పట్టుబడిన ఇసుక లారీల వార్తాపత్రికల్లో వచ్చిన కథనాలను చూపించడం జరిగింది)."ఇసుక దందా ఎవరు చేస్తున్నారు?" అని ప్రశ్నిస్తూ, "ఒక్క ఇసుక లారీ కూడా తిరగకుండా ఆపితేనే నిజాయితీ అని నమ్ముతాం" అన్నారు. మీ నాయకులు సంబంధించిన ఇసుక లారీలను పట్టుకున్న అధికారులను బదిలీ చేసిన ఘటనలను కూడా ప్రస్తావించారు.నీవు నిజాయితీ పరునివైతే ప్రజల సంక్షేమాన్ని కోరుకున్నట్లయితే నీ నిజాయితీ నిరూపించుకోవడానికి గుట్టల నుండి గుట్ట బోరు నుండి మట్టి తీయడం ఆపివేయాలన్నారు. చెరువుల నుండి మట్టిని రైతులకు మాత్రమే ఇచ్చి భూసారం పెంచుకునే విధంగా చేయాలన్నారు. ఇటుక బట్టీలకు ఎట్టి పరిస్థితులలో ఇవ్వకుండా నిరోధించాలని పేర్కొన్నారు. వరి ధాన్యం మొక్కజొన్న కొనుగోలు వేగవంతం చేయాలని, నీవు గతంలో చెప్పిన విధంగా గతంలో చెప్పిన విధంగా వరి ధాన్యం కేవలం బస్తాకు 40 కిలోల 650 గ్రాములు మాత్రమే బస్తాలో తూకం వేయించే విధంగా చూడాలన్నారు. తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ, "నేను ఒక్క రూపాయి తినలేదు" అని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రతి గ్రామ దేవాలయంలో ప్రమాణం చేయడానికి సిద్ధమని అన్నారు. "నువ్వు రైస్ మిల్లర్ల వద్ద, ఇటుక బట్టి యజమానుల వద్ద పైసలు తీసుకున్నావని నేను ప్రతి గుడిలో ప్రమాణం చేస్తా" అంటూ ప్రత్యర్థులపై ఆరోపణలు చేశారు. "దొంగతనం, లంగ పని, లుచ్చ పని అంతా మీదే" అంటూ తీవ్రమైన పదజాలం ఉపయోగించారు. "మాకు కూడా నోరు ఉంది, నీ ఒక మాట చెబితే మేము 100 మాటలు చెప్పగలము. కానీ సభ్యత సంస్కారం అడ్డం వస్తుంది" అని వ్యాఖ్యానించారు.అధికారం శాశ్వతం కాదని హెచ్చరిస్తూ, "ఇంకో రెండున్నర సంవత్సరాలు తర్వాత సినిమా చూస్తావు" అన్నారు. "పిల్లిని గదిలో వేసి కొడితే పులి అవుతుంది" అనే సామెతను ఉపయోగిస్తూ ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. ఎన్నికల్లో తప్పుడు హామీలు, అబద్ధాలతో గెలిచారని ఆరోపిస్తూ, ఇప్పుడు వాటిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.రైతులకు ప్రకటించిన రుణమాఫీ పూర్తిగా అందలేదని, సుల్తాన్‌పూర్ వంటి గ్రామాల్లో సీట్ కంపెనీల వారు 500 అధిక ధర తో కొనుగోలు చేస్తామని చెప్పినా కూడా, నేను బోనస్ ఇప్పిస్తానని చెప్పి ఐకెపి ద్వారా కొనుగోలు చేయించినా మీరు, అట్లు అమ్మిన అనేక మంది రైతులకు బోనస్ రావాల్సి ఉందని తెలిపారు.మీరు ఇచ్చింది కాదు ఇంకా ఇవ్వాల్సింది ఎంతో , ఎంతమందికి బోనస్ ఇవ్వాల్సి ఉందో బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. తాను మాట్లాడిన ప్రతి అంశం స్థానిక పత్రికల్లో వచ్చిన కథనాలు, రైతుల ఫిర్యాదుల ఆధారంగానేనని, వ్యక్తిగత ద్వేషంతో మాట్లాడలేదని స్పష్టం చేశారు. రైతులకు న్యాయం చేయడం, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే తన ఉద్దేశమని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజకుమార్, మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, మాజీ ఎంపీపీలు నూనేటి సంపత్ యాదవ్, స్రవంతి మోహన్ రావు, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్,్రూజూ మాజీ చైర్మన్ సందీప్ రావు, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, సర్పంచులు, గొడుగుల సతీష్, బోయిని శ్రీనివాస్, బీ=ూ నాయకులు మోబిన్, పెంచల శ్రీధర్, సరేష్ , సలేంద్ర రాములు, బాబు, దేవయ్య, శ్రీనివాస్ రెడ్డి, గోపి, దయాకర్, అరుణ, కొండల్ రాజా, సమ్మయ్య , తిరుపతి రెడ్డి, ముత్యాల రాజయ్య, తీగల సదయ్య, రామ్ రెడ్డి, కోయిడ శ్రీనివాస్, రాపెల్లి శ్రీను, విజయ్ రాజ్, కాశి పాక వాసు, ముఖీమ్, ఆదిల్, యూసుఫ్, నరేష్ గౌడ్, పల్లె మధు, బొడ్డుపల్లి రమేష్, ధర్మపురి, మెట్టు సమ్మయ్య,అజయ్,కిషోర్, లింగన్న, చంద్రయ్య, ప్రేమ్ సాగర్, కార్యకర్తలు పాల్గొన్నారు..

## టీఆర్ఎస్ జెండా పండుగకు పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జ్‌గా సలేంద్ర కొమురయ్య యాదవ్ నియామకం



పెద్దపల్లి , మే 21:(లోకల్ గైడ్ )కల్వకుంట్ల కవిత నాయకత్వంలోని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న "జెండా పండుగ" కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జ్‌గా సలేంద్ర కొమురయ్య యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర నాయకత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల వరకు రాష్ట్రంలోని 33 జిల్లాలు, 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నాయి. కార్యక్రమం విజయవంతం కోసం జిల్లా, నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రత్యేక దృష్టి సారించారు. పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినందుకు సలేంద్ర కొమురయ్య యాదవ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన పార్టీ జెండా ఎగరవేసి, ఉద్యమకారులు, పార్టీ నాయకులతో సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, జెండా పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని సలేంద్ర కొమురయ్య యాదవ్ స్పష్టం చేశారు.

## పెట్రోల్ డీజిల్ సిఎన్జి గ్యాస్ ధరలు తగ్గించాలని ,
# 4 లేబర్ కోడ్స్ రద్దు చెయ్యాలి

( సిఐటియు -) అధ్యక్ష కార్యదర్శులు వై విక్రం , జిల్లా ఉపేందర్



ఖమ్మం :లోకల్ గైడ్ :ఖమ్మం : ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై విక్రం , జిల్లా ఉపేందర్ మాట్లాడుతూ..... అంతర్జాతీయ మార్కెట్లో మూడి చమురులు ధరలు తగ్గుతున్న కేంద్ర ప్రభుత్వం దేశంలో ఇంధన ధరలను పెంచి వాహనరంగంపై సామాన్య ప్రజలపై అదనపు భారం మోపిందని విమర్శించారు . కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేందుకు బిజెపి ప్రభుత్వం ఇలా ప్రజల జేబులు ఖాళీ చేస్తుందని కేంద్ర ప్రభుత్వము మొన్నటికి మొన్న ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత పెట్రోల్ పై 3 రూపాయలు డీజిల్ పై 3 రూపాలు పెంచింది , అట్లాగే రెండు రోజుల క్రితం 90 పైసలు డీజిల్ ,పెట్రోల్ పెంచింది గ్యాస్ ధరను రూపాయి చేసింది , ఈరోజు నిన్న పెట్రోల్పై 80 పైసలు , డీజిల్ పై 80 పైసలు మళ్లీ నాలుగు రోజుల వ్యవధిలోనే ఇలా 4 రూపాయలు పెట్రోల్ , డీజిల్ ధరలు పెంచడం మూలంగా ఈరోజు రవాణా రంగం ఆటో, ట్రాలీ , క్యాబ్ , డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు, కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి పెట్టుబడిదారులు ఆదాని అంబానీ కొరకు 4 లేబర్ కోడ్స్ ను అమలు చేసిందని , కార్మికుల పొట్ట కొడుతుందని గుర్తు చేశారు . వెంటనే 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు . ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వము ప్రవేశపెట్టిన ఫ్రీ బస్సు వల్ల వందమంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు . కారు ట్రావెల్స్ , ఆటో, ట్రాక్టర్ , లారీ వాహనాలకు గిరాకి లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు . ఈ తరుణంలో ములిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు చందనంగా తయారైందని ఈ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వం తీరు అని ఆగ్రహం వ్యక్తం చేశారు . పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని , ఈ సందర్భంగా వారు ,కేంద్ర ప్రభుత్వాల ను డిమాండ్ చేశారు .



## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై బీఆర్ఎస్ ధర్నా

కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతో సామాన్యులపై పెనుభారం : బీఆర్ఎస్ నేతలు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 21:గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాజనర్సు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఇంధన ధరల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజలపై అదనపు భారం పడుతోందన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం, తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నడ్డివిరిచే విధంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, లేదంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇబ్రహీంనగర్‌లో బెల్ట్ షాపులపై
# పోలీసుల మెరుపు దాడులు

46 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం.. ఇద్దరిపై కేసులు నమోదు



చిన్నకోడూరు (లోకల్ గైడ్) మే 21: చిన్నకోడూరు మండలంలోని ఇబ్రహీంనగర్ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్ మరియు చిన్నకోడూరు పోలీసులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించి భారీగా అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామంలోని కొన్ని కిరాణా దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ బృందం, స్థానిక పోలీసులు కలిసి దాడులు చేపట్టారు. షాపుల వద్దే మందుబాబులను కూర్చోబెట్టి మద్యం తాగిస్తూ న్యూసెన్స్ సృష్టిస్తున్నట్లు గుర్తించారు. దాడుల్లో ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన గౌరిశెట్టి శ్రీనివాస్ (42) వద్ద నుంచి 20.41 లీటర్లు, పంతం లక్ష్మణ్ (49) వద్ద నుంచి 25.5 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 46 లీటర్లకు పైగా మద్యం పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసులు నమోదు చేసి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చిన్నకోడూరు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ బెల్ట్ షాపులు నిర్వహించినా, షాపుల వద్ద మద్యం సేవించేలా అనుమతించి అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఏవైనా అక్రమ కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# సంక్షేమంతో పాటు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి..

.రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రూ.4.02 కోట్లతో 3.6 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

తెల్దారుపల్లిలో ఇప్పటికే 9 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు అమలు

ఎదులాపురం మునిసిపల్ ప్రాంతం తెల్లారుపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి





ఎదులాపురం, మే-21:లోకల్ గైడ్ :ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ 14వ వార్డు పరిధిలోని తెల్దారుపల్లి నుంచి ఖమ్మం- కోదాడ రోడ్డు వరకు వయా రాముడు చెరువు మార్గంలో 4 కోట్ల 2 లక్షల వ్యయంతో చేపట్టనున్న 3.6 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లిమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూలిరాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగుతోందన్నారు. తెల్దారుపల్లి ప్రాంతంలో ఇప్పటివరకు సుమారు 9 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. 4 కోట్ల 2 లక్షల వ్యయంతో 3.6 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు నేడు శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గురుకులాల్లో డైట్ ఛార్జీలను 40 శాతం పెంచడంతో పాటు కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు తెలిపారు. యువతకు 72 వేల ఉద్యోగాలు కల్పించామని, రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేశామని మంత్రి పేర్కొన్నారు. సన్న ధాన్యానికి 500 రూపాయలు బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర కేబినెట్ సమావేశంలో కొత్త ఆసరా పెన్షన్లపై నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు ఇంటి స్థలం అప్పగింత పట్టా ధృవీకరణ పత్రాలను మంత్రి, జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఈ పంచాయతీ రాజ్ వెంకట్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో సాంకేతిక రంగానికి బలమైన పునాదులు వేసిన మహనీయుడు రాజీవ్ గాంధీ: డాక్టర్ కోట నీలిమ



కుత్బుల్లాపూర్ మే 20 (లోకల్ గైడ్ ప్రతినిధి)దేశంలో సాంకేతిక రంగానికి బలమైన పునాదులు వేసిన మహనీయుడు దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ కోట నీలిమ అన్నారు. భారత సమాచార విప్లవ పితామహుడు, మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులతో కలిసి పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ కోట నీలిమ గారు పుష్పాంజలి ఘటించిఘనంగానివాళులర్పించారు. అనంతరంనియోజకవర్గంలోని పద్మారావు నగర్, సనత్ నగర్, ా= నగర్ డివిజన్లలో పర్యటించి రాజీవ్ గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ క్రమంలో పలు డివిజన్లలో అన్నదానం, హెల్త్ క్యాంప్ నిర్వహించడంతో పాటు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ... అతిపిన్న వయసులోనే ప్రధాన మంత్రి పదవిని అధిష్ఠించిన రాజీవ్ గాంధీ దేశ భవిష్యత్తుకు నాడు నాటిన అభివృద్ధి మొక్కలు నేడు వృక్షాలై ఫలాలు అందిస్తున్నాయన్నారు. ఆయన దూరదృష్టితో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆర్థిక వ్యవస్థ సరళీకృతం చేయడం, పరిశ్రమలకు రాయితీలు, పంచా యతీ రాజ్ వ్యవస్థ పటిష్ఠత వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు. 21వ శతాబ్దిలో దేశాన్ని నూతన పథంలో నడిపించేలా ఆయన దిశానిర్దేశం చేశారన్నారు. యువతరంలో శక్తిమంతమైన మార్పును ఆకాక్షించి కంప్యూటర్ యుగానికి నాంది పలకడంతో ఇప్పుడు దేశం అభివృద్ధి దిశలో పయనిస్తోందన్నారు. ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశంలో సమాచార సాంకేతిక రంగానికి బలమైన పునాదులు వేసి, యువతకు నూతన అవకాశాల దారులు తెరిచిన మహానేత రాజీవ్ గాంధీ అని అన్నారు. కంప్యూటర్ విప్లవం, టెలికమ్యూనికేషన్ రంగ అభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం వంటి కీలక సంస్కరణల ద్వారా భారతదేశాన్ని ఆధునిక యుగంలోకి తీసుకెళ్లిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. యువత శక్తిపై అపార విశ్వాసం ఉంచిన రాజీవ్ గాంధీ, దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని నమ్మారని గుర్తుచేశారు. 18 సంవత్సరాల యువతకు ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో యువశక్తికి ప్రాధాన్యం పెంచారని పేర్కొన్నారు. పేదరికాన్ని పారదోలడానికి, సమసమాజ స్థాపనకోసం రాజీవ్ గాంధీ ఎంతో శ్రమించారన్నారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంస్కరణలకు తీసుకొచ్చారని కొనియాడారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమన్నారు. సాంకేతికతను గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లి, దేశ అభివృద్ధిని వేగవంతం చేయాలన్న రాజీవ్ గాంధీ ఆశయాలను కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం కూడా యువత అభివృద్ధి, డిజిటల్ పురోగతి, క్రీడలు, ఉపాధి అవకాశాల కల్పనకు కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజనులకు లబ్ధి లేని డిసిల్టేషన్ మాకొద్దు
## ఇసుక ర్యాంపులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ముత్తారం గ్రామస్తులు



ములుగు : లోకల్ గైడ్ : ములుగు జిల్లా వెంకటాపురం మండలం ముత్తారం గ్రామానికి చెందిన ముత్తారం మహిళా గిరిజన ఇసుక లేబర్ కాంట్రాక్ట్ పరస్పర సహకార సంఘం లిమిటెడ్‌కు చెందిన కొంతమంది గ్రామస్తులు గురువారం ములుగు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఇసుక డిసిల్టేషన్ పనులపై ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ర్యాంపుల ద్వారా కేవలం కాంట్రాక్టర్లకే లాభం జరుగుతోందని, గిరిజనులకు ఎటువంటి ప్రయోజనం కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 6 సంవత్సరాలుగా మూడు టర్మ్‌లుగా ఒకే సొసైటీ కొనసాగుతోందని, గ్రామ ప్రజలకు బోనస్ గానీ, అభివృద్ధి పనులు గానీ జరగలేదని తెలిపారు. లారీ లెవలింగ్ పనులు తప్ప గ్రామానికి ఎలాంటి మేలు జరగలేదని ఆరోపించారు. సొసైటీని మార్చాలని అడిగితే "ర్యాంప్ పెట్టిన అవసరమైతే మిమ్మల్ని తీసేస్తాం" అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా గ్రామంలో తమను కులం నుంచి వెలివేశారని, తమకు రావాల్సిన రూ.6 లక్షలు గ్రామ పెద్దల వద్దే ఉన్నాయని ఆరోపించారు. శుభకార్యాలు, అశుభకార్యాలకు కూడా తమను పిలవడం లేదని వాపోయారు. ర్యాంపుల కారణంగా ఒకే కుటుంబంలోని సభ్యులు విడిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక బ్రోకర్ల మాటలు విని గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు సర్వేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే కలెక్టరేట్ ముట్టడికి కూడా దిగుతామని తెలిపారు. ర్యాంప్ కాంట్రాక్టర్ల పేరుతో కొంతమంది రాజకీయాలు చేస్తూ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు సృష్టిస్తున్నారని, అలాంటి ఆగడాలను అరికట్టాలని కలెక్టర్‌ను కోరారు.

## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి.



బెల్లంపల్లి (లోకల్ గైడ్)బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి వేడుకలు గురువారం పట్టణ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు మాట్లాడుతు రాజీవ్ గాంధీ దేశంలో టెలికాం విప్లవం కంప్యూటరీకరణకు పునాదివేసి 21వ శతాబ్దపు భారతదేశానికి దిశా నిర్దేశం చేసిన గొప్ప దార్శనీకుడని అన్నారు. అంతేకాకుండా పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసి గ్రామాలకు అనేక రకాల అధికారులు అందించిన గొప్ప సంస్కర్త అని అన్నారు. ముఖ్యంగా 18సంవత్సరాలకే యువతకు ఓటు హక్కు కల్పించి దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేశారని ఆయన కలలుగన్న ఆధునిక,సాంకేతిక,స్వశక్తి భారత నిర్మాణమే మన అందరి లక్ష్యం కావాలని,ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మెంబర్ చిలుముల శంకర్,కౌన్సిలర్లు జంగం కల్పన,రాయమల్లు కాంగ్రెస్ నాయకులు గెల్లి రాజలింగు,దామర శ్రీనివాస్,నీలి కృష్ణ,ఐ ఎన్ టి యు సి నాయకులు ప్రకాష్ రావు,యువజన కాంగ్రెస్,మహిళా,మైనార్టీ,బీసీ సెల్,ఎస్సి సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ కుటుంబంపై దుష్ప్రచారం



అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**మహా న్యూస్ ఎండీ వంశీకృష్ణపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్!**

అశ్వారావుపేట, లోకల్ గైడ్ :బహుజన సామాజిక వర్గ అగ్రనేత, ఐపీఎస్ మాజీ అధికారి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ గారి కుటుంబ సభ్యులపై ఒక ప్రణాళికాబద్ధమైన కుట్రతో అవమానకర ప్రసారాలు చేస్తున్నారంటూ అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. మోడల్ కాలనీ పేరాయిగూడెం కి చెందిన తగరం రామ్ నివాస్ అనే యువకుడు గురువారం అశ్వారావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ను కలిసి ఈ మేరకు లిఖితపూర్వక ఫిర్యాదును అందజేశారు. ?ఇటీవల తెలంగాణలో సంచలనం సృష్టించిన ఒక పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ అనే వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత మైనర్ బాలికకు న్యాయం చేయాలని డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రెస్ మీట్ ద్వారా డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం, బాధితుల పక్షాన నిలబడి ఆయన చేసిన ఈ వ్యాఖ్యలను జీర్ణించుకోలేని కొన్ని అసాంఘిక శక్తులు ఇప్పుడు ఆయన కుటుంబాన్ని టార్గెట్ చేశాయని ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న మహా న్యూస్‌బాధితులకు మద్దతుగా మాట్లాడినందుకు గానూ, ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ రాజకీయ ప్రతిష్టను, పరువును దెబ్బతీసేందుకు మహా న్యూస్ తెలుగు ఛానల్ రంగంలోకి దిగిందని ఫిర్యాదులో ఆరోపించారు. ?గత మూడు రోజులుగా సదరు ఛానల్ యాజమాన్యం మరియు మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ కొడుకులు మంచి వాళ్లా, చెడ్డ వాళ్లా? అంటూ అత్యంత అభ్యంతరకరమైన, సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ట్రోలింగ్‌లు మరియు కథనాలను ప్రసారం చేస్తున్నారని రామ్ నివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలకు డిమాండ్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ షెడ్యూల్డ్ కులానికి చెందిన బలమైన నాయకుడు కావడంతోనే, ఆయన్ను మానసికంగా కుంగదీసేందుకు వారి కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో ట్రోల్స్ చేయిస్తూ, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో వివరించారు. ?ఈ కుట్ర వెనుక ఉన్న శక్తులపై మరియు మహా న్యూస్ ఎండీ వంశీకృష్ణపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు తగిన క్రిమినల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సదరు ఛానల్‌లో వస్తున్న అవమానకర ప్రసారాలను తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని అశ్వారావుపేట పోలీసులను కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన- - ఎస్పీ

- రైతు పండించిన ప్రతి గింజ అమ్ముడయ్యే వరకు అండగా ఉంటాం..



- ఏటూరు నాగారం. లోకల్ గైడ్:- ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ములుగు జిల్లా ఎస్పీ- సుధీర్ రామ్నాథ్ కేషన్ ఐపీఎస్ గురువారం అధికారులతో కలిసి సందర్శించి. వడ్ల . తూకం. రవాణా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వడ్ల తూకంలో ఎలాంటి అక్రమాలు జరిగినా వెంటనే సమాచారం అందించాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. పండించిన వడ్లను తరలించేందుకు తగినన్ని వాహనాలు అందుబాటులో ఉంచాలని స్థానిక అధికారులను ఆదేశించారు. రైతు పండించిన ప్రతి గింజ అమ్ముడు అయ్యేవరకు జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏ ఎస్పీ- మనన్ బట్. ఐపీఎస్. ములుగు డిఎస్పి - రవీందర్ . ఇన్స్పెక్టర్ - శంకర్. ఏటూరు నాగారం సిఐ - శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు...

## పాతకక్షల నేపథ్యంలో దారి కాశి కొట్టి కులం పేరుతో దూషించి కొట్టి చంపేందుకు ప్రయత్నించిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలి గిరిజన సంఘం కేవీపీస్ డిమాండ్



లోకల్ గైడ్, వికారాబాద్ వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎన్కతల గ్రామానికి చెందిన తలారి శ్రీకాంత్ ను పరామర్శించిన గిరిజన సంఘం కెవిపిఎస్ సిపిఎం నాయకులు పాత కక్షల నేపశితో 20 తారీకు బుధవారం రోజు మధ్యాహ్నం 12 గంటలకు వికారాబాద్ నుండి తలారి శ్రీకాంత్ అతని భార్య స్కూటీపై తన ఇంటికీ వెళుతుండగా, దారి కాచి వెనుక నుంచి ఆక్సిడెంట్ చేసి ఎస్సి కులం పేరుతో దూషించి కట్టెలతో రాళ్ళతో కొట్టి చంపేందుకు ప్రయత్నించిన నవాబ్ పేట్ మండల, మందన్ పల్లి గ్రామానికి సంతోష్, ఎన్కతల గ్రామానికి చెందిన మల్లేశం,మనికంఠ సంతోష్, వాళ్ళ అనుచరుల 6 మందిపై చట్టపైన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసిన నేటికీ ఎఫైర్ చేయలేదు. గాయాల పాలైన శ్రీకాంత్ వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తలకు బలమైన గాయం 14 కుట్లు పడ్డవి, చేతి విరిగింది అతని హైదరాబాదు హాస్పిటల్ కు రిఫర్ చేశారు నవాబ్ పేట పోలీసు లు వెంటనే నిందితులను అరెస్టు చేసి ఎస్సీ ఎస్టీ మర్డర్ కేసులు పెట్టి వెంటనే అరెస్టు చేయాలని గిరిజన సంఘం నాయకులు శ్రీనివాస్ కేవీపీస్ ఆనంద్ కృష్ణయ్య రాజు సిపిఎం జిల్లా కార్యదర్శి మహిపాల్, శ్రీకాంత్ కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## ప్రజారోగ్య సేవలో అజరామరమైన పేరు... డాక్టర్ ఓ. నాగేశ్వరరావుకు73వ జన్మదిన వేడుకలు



కుత్బుల్లాపూర్ మే 20 (లోకల్ గైడ్ ప్రతినిధి)కొంతమంది వ్యక్తులు తమ జీవితాన్ని కుటుంబానికే పరిమితం చేస్తారు... మరికొందరుసమాజానికి అంకితం చేస్తారు. అలాంటి అరుదైన సేవామూర్తుల్లో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఓ. నాగేశ్వరరావు ఒకరు. ప్రజారోగ్య పరిరక్షణను తన జీవిత ధ్యేయంగామార్చుకుని దశాబ్దాలుగా వేలాది మందికి ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఆయన 73వ జన్మదిన వేడుకలు గురువారం అత్యంత ఆత్మీయ వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి.ఎస్సార్ నగర్ బీకే గూడలోని శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం సేవా భావానికి ప్రతీకగా నిలిచింది. జన్మదినాన్ని కేవలం కేక్ కటింగ్‌తో కాకుండా, సమాజానికి ఉపయోగపడే విధంగా జరుపుకోవాలన్న ఆలోచనతో ట్రస్ట్ సభ్యులు 350 మంది సీనియర్ సిటిజెన్లకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధులు ఆనందంగా భోజనం చేస్తూ డాక్టర్ నాగేశ్వరరావుకుహృదయపూర్వక ఆశీస్సులు అందించారు.ఈ సందర్భంగా వృద్ధుల కోసం ప్రత్యేకంగా బగారా రైస్, పెరుగన్నం, నిమ్మకాయ పచ్చడి, మసాలా వడలు, సున్ని ఉండలు, మసాలా మజ్జిగతో రుచికరమైన భోజన విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమ ప్రాంగణం మొత్తం ఆప్యాయత, ఆదరణ, సేవా స్ఫూర్తితో నిండిపోయింది. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ... "డాక్టర్ నాగేశ్వరరావు గారు ఎన్నో సంవత్సరాలుఆయురారోగ్యాలతో సమాజ సేవలో కొనసాగాలని" ఆకాంక్షించారు.ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడంలో డాక్టర్ నాగేశ్వరరావు చేసిన కృషి విశేషమని పలువురు కొనియాడారు. ముఖ్యంగా పొగాకు వ్యతిరేక ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. యువత పొగాకు బారిన పడకుండా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ఎంత కృషి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కుసుమ భోగరాజు పాల్గొని డాక్టర్ ఓ నాగేశ్వరరావు గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

## చివరి గింజ వరకు మద్దతు ధరతో పంట కొనుగోలు చేసూతాం:: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దు.. రైతు సంక్షేమమే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత

వరి, మొక్కజొన్న పంటలను చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం

కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధం

పత్రికా ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



పెద్దపల్లి, మే-21:(లోకల్ గైడ్ )రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలను చివరి గింజ వరకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, రైతు సంక్షేమమే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని మంత్రి పేర్కొన్నారు. రైతులు పండించిన మొత్తం పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు.గతంలో వివిధ కారణాలు చూపిస్తూ బస్తాకు 5 నుంచి 10 కిలోల కోతల పరిస్థితులు ఉండేవని, కానీ ప్రస్తుత ప్రభుత్వ పాలనలో అలాంటి కోతలు, పరిమితులు అనుమతించబోమని స్పష్టం చేశారు. రైతులు పండించిన చివరి గింజ వరి, మొక్కజొన్నను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు.కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన లారీలు, రవాణా ఏర్పాట్లు ప్రభుత్వం సిద్ధం చేసిందని మంత్రి వెల్లడించారు. అలాగే హమాలీలు, గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు తదితర మౌలిక సదుపాయాలు కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.రైతులు కొంత సహనంతో అధికారులకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అనవసర ఆందోళనలకు గురై తక్కువ ధరలకు పంటను అమ్ముకోవద్దని రైతులకు సూచించారు.

# పోక్సో బాధితులకు భరోసా కేంద్రం ..

-- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి:

ప్రతి ఒక్కరూ శారీరక దారుఢ్యం , ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి :

--- వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి..

తెలంగాణ భరోసా కేంద్రాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి:

---- జోగులాంబ గద్వాల జోన్ డిఐజి ఎల్ ఎస్ చౌహన్..

---- వనపర్తిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో భరోసా కేంద్రం, జిమ్ సెంటర్‌లను ప్రారంభించిన నేతలు ..



.వనపర్తి లోకల్ గైడ్ మే 21:(అంబటి స్వామి ప్రతినిధి)...పోక్సో కేసుల బాధితులు మానసిక క్షోభ కలగకుండా, వారి గోప్యతను కాపాడుతూ తగిన భద్రతను కల్పిస్తూ భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి చెప్పారు. గురువారం వనపర్తి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన "భరోసా సెంటర్" , ఏఆర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్ సెంటర్ లను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నా రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, ఎల్ ఎస్ చాహన్ లు ప్రారంభించారు. వీరితోపాటు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు ఎస్పీ రాజేష్, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, మీనా తదితరులు పాల్గొన్నారు.ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ, మహిళలకు భరోసా కల్పించడమే భరోసా కేంద్రాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. హింస, వేధింపులు మరియు లైంగిక దాడులకు గురైన మహిళలు, పిల్లలకు తక్షణ సహాయం, రక్షణ అందించేందుకు తెలంగాణ పోలీస్ విభాగ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'భరోసా కేంద్రాలు' అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయన్నారు. బాధితులకు ఒకే చోట అన్ని రకాల సేవలను అందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా వీటిని విస్తరిస్తున్నట్లు తెలిపారు.

మద్యం సేవించడం వల్లే అనేక వేధింపులు, సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొంటూ, ప్రజలు తమ అలవాట్లను



మార్చుకుని మద్యం సేవనాన్ని తగ్గించాలని సూచించారు. "హెల్త్ ఈజ్ వెల్త్" అని పేర్కొంటూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని కోరారు. పాత భవనాలను పునరుద్ధరించి వినియోగించడం కూడా మంచి అలవాటని తెలిపారు.ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక క్రీడా వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న క్రీడా కార్యక్రమాలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక దారుఢ్యం ఎంతో అవసరమని తెలిపారు. నల్లచెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద రెండు జిమ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ మాట్లాడుతూ, పోక్సో కేసుల బాధితులకు ఒకే చోట న్యాయ సహాయం, మానసిక భరోసా కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం 2018లో భరోసా కేంద్రాలను ప్రారంభించిందన్నారు. ఈ విధానం ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతూ వారికి అవసరమైన సహాయం అందించడం భరోసా కేంద్రాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ సహకారంతో ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో జిమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి ఒక్కరూ శారీరక దారుఢ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, పోలీసులు మరియు యువత జిమ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ?భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఒకే వాతావరణంలో వైద్యం, చట్టపరమైన సహాయం, మానసిక కౌన్సెలింగ్ మరియు పునరావాసం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ పోక్సో మరియు రేప్ కేసుల బాధితులకు తదుపరి మానసిక క్షోభ కలగకుండా, వారి గోప్యతను కాపాడుతూ తగిన భద్రతను భరోసా కేంద్రాలు చేకూరుస్తున్నాయన్నారు. తెలంగాణ పోలీస్ మహిళా భద్రత విభాగం ఐజి చారు సిన్హా నేతృత్వంలో రాష్ట్రంలో మహిళా భద్రతకు అత్యధిక ప్రాధాన్యత పోలీసు శాఖ కల్పిస్తుందని తెలిపారు. అదేవిధంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక క్రీడా మరియు యువజన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో పోలీస్ జట్టు విజేతగా నిలవగా, ఉపాధ్యాయుల జట్టు రన్నరప్‌గా నిలిచింది. అనంతరం పోలీసు సిబ్బందికి నూతన క్యాప్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీత రెడ్డి, అదనపు ఎస్పీ రాజేష్, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, మీనా, డీఎస్పీలు బాలాజీ నాయక్, గిరి ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి ఇతర అధికారులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బాలసదనం, జిల్లా జైలు పరిశీలించిన న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు

పిల్లల సంక్షేమం, ఖైదీల సమస్యలపై ఆరా --- ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని సూచన




సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మే 21:తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, హైదరాబాద్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ శ్రీమతి కే. సాయి రమాదేవి ఆదేశాల మేరకు గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలసదనం, సిద్దిపేటను సందర్శించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శ్రీ వై. జయప్రసాద్, తొలి అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి, సిద్దిపేట, అలాగే శ్రీ ఎన్. సంతోష్ కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఏవం ఎఫ్ఏసీ సెక్రటరీ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు బాలసదనంలోని పిల్లలతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ, విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.అనంతరం శిశుగృహంలోని గదులు, పరిసరాలను పరిశీలించి సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. బాలసదనంలో అందిస్తున్న భోజన నాణ్యత, వంటగది పరిశు భ్రత, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను కూడా పరిశీలించారు.అదే రోజు ఉదయం సిద్దిపేట జిల్లా జైలును కూడా న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు సందర్శించారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ జి. రత్నం, డిప్యూటీ జైలు సూపరింటెండెంట్ వికాస్ మరియు జైలు సిబ్బంది వారికి స్వాగతం పలికారు.జైలులో ఖైదీల వంటగది, స్టోర్‌రూమ్, టాయిలెట్స్ పరిశీలించి, ఖైదీలకు అందిస్తున్న భోజన వసతులపై అధికారులను అడిగి




తెలుసుకున్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలని సూచించిన న్యాయమూర్తులు, వారి సమస్యలను కూడా తెలుసుకున్నారు.ప్రతి ఖైదీకి న్యాయ సహాయం అందుబాటులో ఉండాలని పేర్కొంటూ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ ప్రతి వారం జైలును సందర్శిస్తారని తెలిపారు. అడ్వకేట్లు లేని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని వివరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ చి. శరత్ బాబు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎం. రవి కుమార్, జైలు సిబ్బంది, బాలసదనం సిబ్బంది మరియు న్యాయసేవా సిబ్బంది పాల్గొన్నారు.

## నారాయణరెడ్డికి తుగ్గలి వైసీపీ నేతల ఘన నివాళి

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, పత్తికొండ నియోజకవర్గ ప్రముఖులు దివంగత చెరుకులపాడు నారాయణరెడ్డి,9వ వర్ధంతి వేడుకలను వారి స్వగ్రామంలో ఘనంగా నిర్వహించారు. తుగ్గలి మండలం నుండి పెద్ద ఎత్తున వైసీపీ ముఖ్య నాయకులు పాల్గొని చెరుకులపాడు నారాయణరెడ్డి,చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చెరుకులపాడు నారాయణరెడ్డి పార్టీ కోసం, ప్రజల కోసం చేసిన సేవలను కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ, ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు .నారాయణరెడ్డి వైఎస్‌ఆర్సిపి పార్టీ బలోపేతానికి, నియోజకవర్గ చేసిన కృషి మరువలేనిదని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, వైసీపీ సీనియర్ నాయకులు గుంత రఘు, ముక్కెళ్ల గోవర్ధన్ రెడ్డి, వైయస్‌ఆర్పి ముఖ్య నాయకులు పాల్గొన్నారు. వైసిపి సీనియర్ నాయకులు చెరుకులపాడు నారాయణరెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ నగరంలోని 150 మందిఅనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామని. వైసీపీ ఎస్సిసిఎల్ ఉపాధ్యక్షులు చక్క శీను, తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమం

తిరుపతి స్టాఫ్ రిపోర్ట్ తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం బత్తలవలం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమానికి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రాప్ అవుట్ విద్యార్థులు అలాగే ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న విద్యా సదుపాయాలు నాణ్యమైన బోధన ఉచిత పార్టీ పుస్తకాలు మధ్యాహ్న భోజనం డిజిటల్ విద్య వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు కోసం ప్రభుత్వం గురించి ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరి విద్యను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు పిడి బి కుమార్, శ్రీనాథ్ బాబు హిందీ ఉపాధ్యాయుడు, వెంకటేశ్వర్లు లెక్కలు ఉపాధ్యాయుడు తదిత ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడారు గ్రామ ప్రజలు కూడా కార్యక్రమానికి మంచి స్పందన తెలిపారు.

## యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఓటు పై అవగాహన.

### షకీల్ షఫీ ఆధ్వర్యంలో ఘనంగా ఓటు పై అవగాహన కార్యక్రమం.

నగరంలోని పారడైస్ ఫంక్షన్ హాల్ నందు యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ ( యూజెఏసీ ) ఆధ్వర్యంలో సమాజంలో ప్రతి ఒక్కరికీ ఓటు పై అవగాహన కల్పించేందుకు, ఓటర్ లిస్ట్‌లో తప్పుల సవరణ, వెరిఫికేషన్ ప్రక్రియ పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు అల్హాజ్ కె.యం. షకీల్ షఫీ హాజరై, ఓటు హక్కు ప్రాధాన్యతపై సదస్సును ఉద్దేశించి అత్యంత కీలకమైన ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా షకీల్ షఫీ మాట్లాడుతూ.. ఓటు మన ఆయుధం ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ తమ ఓటును ఖచ్చితంగా వెరిఫై చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటర్ లిస్ట్‌లో పేర్లు తొలగింపు కాకుండా చూసుకోవడం, కొత్త ఓటర్ల నమోదు మరియు తప్పుల సవరణ ప్రక్రియను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ వసీం, యూజెఏసి కన్వీనర్, సిపిఐ నాయకులు జాఫర్, తెలుగుదేశం నాయకులు అడ్వకేట్లు ఆర్.రెహ్మాన్, బాకే హబీబుల్లా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దాదా గాంధీ, కాంగ్రెస్ నాయకులు ఎం.ఎం.డి.ఏ ఇమామ్, నవాజ్ ఖాద్రి సాహెబ్, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు రిజ్వాన్, మాజీ కార్పొరేటర్ ఇసాక్, తెలుగుదేశం పార్టీ మాజీ కో ఆప్షన్ మెంబర్ మునవర్, తెలుగుదేశం నాయకులు ఐఎంఎం మహబూబ్ బాషా, మానవ హక్కుల జాకీర్ యూజెఏసీ సభ్యులు మరియు జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు పెద్ద ఎత్తున ఇమాములు, ముతవల్లిలు తదితరులు పాల్గొన్నారు.

## షిర్డీసాయి ఆలయ నిర్మాణానికి రూ.50,116 రూపాయల విరాళం అందజేసిన మదనాపు కొండన్న కుటుంబ సభ్యులు

షిర్డీసాయి ఆలయ నిర్మాణానికి రూ.50,116 రూపాయల విరాళం అందజేసిన మదనాపు లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు

బత్తలపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న షిర్డీసాయి ఆలయానికి షిర్డీసాయి హై స్కూల్ మాజీ కరస్పాండెంట్ మదనాపు కొండన్న, నిర్మల, కుమారుడు కృపాకర్, శివరాణి, జస్విత, జాశ్విన్ కుటుంబ సభ్యులు రూ. 50,116లను విరాళంగా అందజేశారు, షిర్డీసాయి ఆలయ నిర్మాణానికి రూ. 50,116 రూపాయల విరాళం అందజేసిన మదనాపు లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు కూడా విరాళం అందజేసారు.గురువారం షిర్డీసాయి సేవా సంఘం కమిటీ సభ్యులు విలేకర్లతో మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులు భక్తుల సహకారంతో కొనసాగుతున్నాయని తెలిపారు. కమిటీ సభ్యుల విజ్ఞప్తికి స్పందించిన మదనాపు కొండన్న దంపతులు, మదనాపు లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు తమ వంతు సహాయంగా నగదు విరాళం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలను కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే మండలంలోని దాతలు, భక్తులు ముందుకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించి ఆలయ నిర్మాణానికి తోడ్పడాలని వారు కోరారు.

## అవినీతి లంచగొండి ప్రిన్సిపాల్ మాకొద్దు.

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారికి

వినతిపత్రం సమర్పించిన గిరిజన సంఘం నాయకులు

ప్రకాశం జిల్లా చీమకుర్తి లోని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకులం రెసిడెన్షియల్ పాఠశాల నందు ప్రిన్సిపాల్ గా పనిచేస్తూ అక్కడ అడ్మిషన్ల కోసం విచ్చలవిడిగా విద్యార్థుల తల్లిదండ్రుల నుండి డబ్బులు వసూలు చేసి పాఠశాలకు వచ్చే గ్రాంట్ వర్కులలో కాంట్రాక్టర్ల వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ కొద్ది రోజులు జైలు జీవితం గడిపి వచ్చిన తర్వాత సస్పెన్షన్ అనంతరం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం లోని గిరిజన గురుకులం రెసిడెన్షియల్ పాఠశాలకు పోస్టింగ్ ఇవ్వడం విచారించ దగ్గ విషయమని ఆయనకు ఇక్కడ పోస్టింగ్ ఇచ్చిన విషయాన్ని పసిగట్టిన గిరిజన సంఘం నాయకులు శివ కుమార్ నాయక్ గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, గిరిజన ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గర్మా మల్లికార్జున నాయక్ గురువారం అనంతపురం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ..ఇక్కడ పనిచేయకూడదని పనిచేసినట్లయితే గిరిజన విద్యార్థులకు గిరిజన జాతికి తీవ్ర నష్టం కలుగుతుందని కాబట్టి ప్రవీణ్ కుమార్ ప్రిన్సిపాల్ ను తక్షణం గురుకులం సరెండర్ చేసుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ధనుంజయ నాయక్, బాబు నాయక్, రాజు నాయక్, ప్రసాద్ నాయక్.. తదితరులు పాల్గొన్నారు

## మోరేపల్లి గ్రామంలో రైతు కొత్తపల్లి శ్రీనివాసులు వ్యవసాయ పొలంలో మోటార్ కేబుల్ వైర్ కత్తిరించి తీసుకెళ్లిన దుండగులు



కళ్యాణదుర్గర్ మే 21:అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం కళ్యాణదుర్గం మండలం మోరేపల్లి గ్రామంలో రైతు శ్రీనివాసులు వ్యవసాయ తోటలో నిన్న రాత్రి మోటర్ కేబుల్ వైర్లు కత్తిరించి తీసుకెళ్లిన దుండగులు మోరేపల్లి గ్రామంలో ఇతర రైతుల వ్యవసాయ పొలంలో పలు మార్లు మోటార్ కేబుల్ వైర్లు కత్తిరించి తీసుకెళ్లారని తెలిపారు.ఇలా పలుమార్లు కేబుల్ వైర్లను కత్తిరించి తీసుకెళ్తున్న దుండగులను పోలీసులు స్పందించి దుండగులను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఏలూరు పవర్ పేట లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవరణ ప్రతి గురువారం ఉచిత వైద్య శిబిరం ఆదర్శవంతంగా కొనసాగుతుంది .



ఏలూరు జిల్లా ,ఏలూరు ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో స్ఫూర్తివంతమైన సేవలను ఆదర్శవంతంగా ముందుకు తీసుకెళ్ళేందుకు ప్రత్యేక దృష్టిసారించినట్లు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి చంటి వెల్లడించారు. ఇదేతరుణంలో దాతలు స్పందిస్తోన్న తీరు ఎంతో అమోఘమని ఆయన కొనియాడారు. అవసరార్థులకు సమయానికి వివిధ రూపాల్లో అందించే సేవలు ఎంతో నిరుపమానమైనవని భావించే ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి,,, ఆ దిశగా వాటిని ఎంతో ఆదర్శవంతంగా ముందుకు తీసుకెళ్తూ వస్తున్నారు. ఇదేక్రమంలో ప్రతి గురువారం వైద్య శిబిరం నిర్వహించాలనే ఉన్నతాలోచన చేశారు. అనుకున్నదే తడవుగా దాన్ని ఆచరణలోనూ పెట్టారు. దీంతో ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ప్రతి గురువారం ఉచిత వైద్య శిబిరం ఎంతో ఆదర్శవంతంగా కొనసాగుతోంది. దీనిలో భాగంగా ఈ గురువారం కూడా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ద్వారా అనేక మంది అవసరార్థులు వైద్య సేవలు పొందారు. శిబిరానికి విచ్చేసిన వారికి వైద్యులు, వైద్య సిబ్బంది బిపి, షుగర్ వంటి వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించీ, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం కొనసాగుతోన్న తీరును స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే బడేటి చంటి,,, పలువురికి ఉచితంగా మందులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను చేయాలనుకున్న మంచికి దాతల నుండి అందుతోన్న సహకారం కూడా ఎంతో గొప్పదన్నారు. ఈ గురువారం వైద్య శిబిరానికి విచ్చేసే రోగులకు కైకలూరుకు చెందిన కృష్ణ మెడికల్స్ అధినేత రాధాకృష్ణ మూర్తి సాధారణ వ్యాధులకు సంబంధించి ఉచితంగా మందులను అందజేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడిన ఎమ్మెల్యే చంటి,,, రానున్న రోజుల్లో నెలకి ఒకసారి ఒక్కో స్పెషలిస్టు వైద్యునితో శిబిరంలో ఉచిత వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సేవలను అవసరార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఈడ చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ చల్లా వెంకట సత్య వరప్రసాదరావు (కంప్యూటర్ ప్రసాద్) ,టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు, తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ అధ్యక్షులు జుంజు మోసెస్, బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ బోర్డు డైరెక్టర్ లంకపల్లి మాణిక్యాలరావు, నగర ఎస్ .సి .సెల్ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, నాయకులు మారం అను, జాల బాలాజీ, చోడే బాలు, రేవుల గడ్డ లాలా లజపతిరాయ్, తదితరులు పాల్గొన్నారు.

## కమలపాడు హైడ్రో ప్రాజెక్టు రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి : తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి



తాడిపత్రి మే 21 :యాడికి మండలంలో ప్రతిపాదిత "కమలపాడు పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు" కోసం భూములు కోల్పోతున్న రైతులకు కూటమి ప్రభుత్వం న్యాయమైన పరిహారం చెల్లించాలని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు రైతులకు ఏ పద్ధతిలో భూ సమీకరణ చేసి పరిహారం ఇస్తున్నారో,పోలవరం నిర్వాసిత రైతులకు ఎంత ఇస్తున్నారో,అదే విధంగా రాయలసీమ రైతులకు కూడా న్యాయం చేయాలని ఆయన కోరారు.గతంలో ఆర్.ఎస్. కొండాపురం మండలం టీ.కోడూర్ వద్ద సోలార్ ప్రాజెక్టు కోసం దళారుల ద్వారా ఎకరాకు ?30 వేల చొప్పున కౌలు అగ్రిమెంట్ చేసుకునే ప్రయత్నం చేయగా,రైతులు ఎదిరించడంతో ఇప్పుడు అదే కంపెనీ ఎకరాకు ?18 లక్షల చొప్పున పరిహారం ఇస్తోందని ఆయన గుర్తు చేశారు.ప్రాంతాల మధ్య పరిహారం విషయంలో పాలకులు వివక్ష చూపడం ఆనవాయితీగా మారిందని నాగార్జున రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.రాయలసీమలో ఏర్పాటు చేసే పరిశ్రమలకు,కోస్తాలో సేకరించే భూములకు ఇచ్చే పరిహారంలో చాలా తేడాలు ఉన్నాయని మండిపడ్డారు.పక్కనే ఉన్న నంద్యాల, వైఎస్ఆర్ జిల్లాల రైతులకు ఇచ్చే పరిహారంలో సగం కూడా అనంతపురం జిల్లా రైతులకు ఇవ్వలేమని అధికారులు,యాజమాన్యాలు సభలో చెప్పడం బాధాకరమన్నారు.ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని, రాయలసీమ రైతులకు సమన్యాయం జరిగేలా చూడాలని ఆయన సవినయంగా కోరారు.

## ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి కె .అనురాధ తడికలపూడి గ్రామంలో పర్యటించారు తడి చెత్త పొడి చెత్త పై అవగాహన కల్పించారు .




ఏలూరు జిల్లా ,తడికలపూడి ,మే 21 ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి కె. అనురాధ గురువారం తడికలపూడి గ్రామంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వ పారిశుధ్య సేవలపై వచ్చే ఐవీఆర్ఎస్ కాల్స్ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం వీధుల్లోని పారిశుధ్య పనులను, వర్మీ కంపోస్ట్ కేంద్రాన్ని సందర్శించి ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని




వ్యాపారులను, పారిశుధ్యంలో అలసత్వం వహించవద్దని సిబ్బందిని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సరళకుమారి, పంచాయతీ కార్యదర్శి కె. నాగరాజు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎండ తీవ్రతపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. వృద్ధులు, దివ్యాంగులు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి.



ఏలూరు జిల్లా ,ఏలూరు ,మే 21 (ఆర్టిఐ ఎక్స్ప్రెస్ న్యూస్ )ఏలూరు, జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు అధికారులు సమన్వయంతో పనిచెయ్యాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టరు సూచించారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టరేటు ఛాంబరు నుండి ఎండ తీవ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరు పలుసూచనలు జారీచేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అత్యవసరం అయితేనే మధ్యాహ్న సమయంలో బయటకు రావాలని రాష్ట్ర వాతావరణశాఖ హెచ్చరికలు నేపథ్యంలో ఈ నెల 26వ తేదీ వరకూ తీవ్రవడగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 11 గంటలు నుండి సాయత్రం 4 గంటలు వరకూ అత్యవసరం అయితేనే బయటకు రావాలని అన్నారు. అయితే బయటకు వచ్చేవారు తగినంత త్రాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలను గుర్తించాలని అన్నారు. శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలను అధిక దాహం, తలనొప్పి, వాంతులు, అలసట అటువంటి లక్షణాలు కనిపిస్తే దగ్గర్లో ఉన్న వైద్యకేంద్రాలను సంప్రదించాలని సూచించారు. ఎండ తీవ్రతపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, ఎటువంటి చిన్న పొరపాటు చేసినా ఎండ తీవ్రత వలన తీవ్రఇబ్బందులు ఎదుర్కొన వలసి వస్తుందని స్పష్టం చేశారు. వ్యవసాయ, ఉద్యానవన, తదితర పంటలు, మూగజీవాలను డ్రోన్లు ద్వారా సర్వేచేసి నీటిఎద్దడి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. దివ్యాంగులు, వృద్ధులు ఎండలో తిరగకుండా తగు జాగ్రత్తలు జిల్లా దివ్యాంగులు సహాయ సంచాలకులను ఆదేశించారు. ముఖ్యమైన కూడలిలో చలి వేంద్రాలు, బస్సు కోసం నిలిచే ప్రయాణికులకు తాత్కాలిక పందర్లను ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. ఎస్ఎస్సి, తదితర పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు వెళ్ళుటకు, వచ్చుటకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. వేసవిలో కరెంటు కోతలు, లోవోల్టేజీ లేకుండా విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చెయ్యాలని విద్యుత్తు శాఖ అధికారులను ఆదేశించారు. చేపలు, రొయ్యలు, తదితర చెరువులు వద్ద ఎండ సమయములో పనులు చేయకుండా తగుచర్యలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ డిడిని ఆదేశించారు. చిన్న, పెద్ద పరిశ్రమలు రసాయనిక పదార్థాలు దగ్గర ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, జిల్లాకు కొత్తగా వచ్చిన వాహనాలను సద్వినియోగం చేసుకుని ఎటువంటి ఫోన్ కాల్ వచ్చినను సంబంధిత ప్రాంతాన్ని వెనువెంటనే చేరుకునేలా సిద్ధంగా ఉండాలని అగ్నిమాపకదళ అధికారిని ఆదేశించారు. జిల్లాలో పర్యాటక కేంద్రాలకు, పుణ్య క్షేత్రాలకు వెళ్ళే భక్తులకు, పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. ఎండ తీవ్రపై ఎప్పటికప్పుడు తగు సమాచారాన్ని ప్రింటు ఁ అండ్ ఎలక్ట్రాన్ మీడియా ప్రతినిధులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియ జెయ్యాలని డీపీఆర్వోను ఆదేశించారు. ఏలూరు, నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమీషనర్లు 24 గంటలు అప్రమత్తంగా ఉండి ప్రజలకు మంచి సేవలు అందించాలని అన్నారు. పంట పొలాల్లో వివిధ రకాలు వ్యర్థాలు కాల్చకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎండ తీవ్రత పరిస్థితులు, ముందస్తు జాగ్రత్తలు, తాగునీటి సరఫరా, వైద్యసేవలు తదితర అంశాలుపై ఎక్కడా ఎటువంటి లోటు లేకుండా చూడాలని అన్నారు. వడదెబ్బ కేసులు నమోదు కాకుండా గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆరోగ్యశాఖ అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, బస్టాండ్లు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో తాగునీటి సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. మున్సిపల్, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటిసరఫరా శాఖలు అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కార్మికులు, వృద్ధులు, చిన్నారులు ఎండ ప్రభావానికి గురికాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా వివిధ శాఖలు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు వారివారి కార్యాలయంలో పాల్గొన్నారు.

## ఆన్లైన్ లో మందుల విక్రయాలు నిలుపుదల చెయ్యాలి జంగారెడ్డిగూడెం లో ఔషధ దుకాణాలు బంద్ విజయవంతం



ఏలూరు జిల్లా ,జంగారెడ్డిగూడెంజంగారెడ్డిగూడెం : అఖిల భారత్ కేమిస్ట్ మరియు డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఔషధ దుకాణాలు బంద్ జంగారెడ్డిగూడెం లో విజయవంతం అయ్యింది. జంగారెడ్డిగూడెం బోసుబొమ్మ కూడలి నుంచి ఆర్టీసీ బస్సు స్టాండ్ వరకు కేమిస్టులు నల్ల బ్యాడ్జి లను ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. జంగారెడ్డిగూడెం మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు నున్న చైతన్య కుమార్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం ను చేపట్టారు. ఆన్లైన్ లో విచ్చలవిడిగా మందుల విక్రయాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అధిక డిస్కౌంట్ ల పేరుతో కార్పరేట్ విక్రయాలు చేస్తున్న కంపెనీ లను అరికట్టాలని కోరారు. కార్యక్రమం లో జిల్లా సెక్రటరీ శివ రామకృష్ణ, జంగారెడ్డిగూడెం అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రాధా కృష్ణ, సెక్రటరీ ప్రవీణ్, మెడికల్ షాప్ యజమానులు పోతుల గణేష్ కుమార్, కాకి రామకృష్ణ, చిన్ని, ప్రసాద్, చైతన్య, రామకృష్ణ, హర్ష, దిలీప్, బాలు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ ఉద్యోగ మోసం కేసులో గంటా సాయి కృష్ణ అరెస్ట్.



ఏలూరు జిల్లా ,లింగపాలెం , లింగపాలెం మండలంలోని మఠంగూడెం గ్రామానికి చెందిన గంటా సాయి కృష్ణపై భారీ మోసం ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. అమెరికాలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అమాయక నిరుద్యోగులను నమ్మబలికి కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.సమాచారం ప్రకారం, సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో పలువురు యువకులకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పి సుమారు రూ.90 లక్షల వరకు డబ్బులు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో తెలిసింది.అదే కాకుండా మిర్చి వ్యాపారం సమయంలో కూడా పలువురు రైతులను లక్షల రూపాయల మేర మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పలు దొంగతనాల కేసుల్లో కూడా అతని పేరు వినిపిస్తున్నట్లు సమాచారం. గంటా సాయి కృష్ణ తమ్ముడు అమెరికాలో ఉండటంతో విదేశీ ఉద్యోగాల పేరుతో నమ్మకం కల్పించి ఈ మోసాలకు పాల్పడినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.ఈ వ్యవహారంపై గుంటూరు జిల్లా సత్తెనపల్లి పోలీస్ స్టేషన్లో లో క్రైమ్ నెంబర్ 58/25 కింద కేసు నమోదైనట్లు తెలిసింది. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు గంటా సాయి కృష్ణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.ఇక రాజకీయ వర్గాల్లో కూడా గంటా సాయి కృష్ణ వ్యవహారం చర్చనీయాంశమైంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి ఆ పార్టీ నాయకులను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేస్తాడనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే గత కొంతకాలం నుండి గంటా సాయి కృష్ణ పోలీసులకు కనిపించకుండా పరారీలో ఉన్నట్లు సమాచారం. సత్తనపల్లి ఎస్సై గంటా సాయి కృష్ణను అరెస్టు చేసినట్లు ఏలూరు టూ టౌన్ ఎస్ఐకి సమాచారం ఇచ్చినట్లు సమాచారం.అయితే ఈ ఆరోపణలపై అధికారికంగాపూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రంగాపురం గ్రామంలో సెంట్ జాన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ ఇనిస్ట్యూట్ ఫోర్త్ యాన్యువల్ డే ఘనంగా నిర్వహించారు .

ఏలూరు జిల్లా ,లింగపాలెం ,మే 21 లింగపాలెం మండలం రంగాపురం గ్రామం రంగాపురం గ్రామంలో



ఈరోజు సెంట్ జాన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఫోర్త్ యాన్యువల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ధర్మాజీగూడెం జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెవరెండ్ ఫాదర్ ప్రదీప్ పాల్గొన్నారు.సెయింట్ జాన్స్ ఒకేషనల్ ఇన్స్టిట్యూట్ కరెస్పాండెంట్ కాట్రు జాన్ రాజ్ మాట్లాడుతూ దీని యొక్క ముఖ్య ఉద్దేశం లింగపాలెం మండలంలోని చుట్టుపక్కల గ్రామాలలో ఉన్న యువతీ యువకులకు సదా అవకాశంగా ఈ సెంటర్లో స్పోకెన్ ఇంగ్లీష్ అలాగే కంప్యూటర్ ట్రైనింగ్ టైలరింగ్ బ్యూటిఫికేషన్ ట్రైనింగ్ ఇస్తూ వారి యొక్క ప్రతిభను గుర్తించి వారికి ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుంది. అదేవిధంగా చుట్టుపక్కల గ్రామాల లో ఉన్న విద్యార్థిని,విద్యార్థులు ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు టీచర్స్ పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఆనందంతో ఆటపాటలతో అలరించారు.

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుడు మృతి... నివాళులర్పించిన ఉమామహేశ్వర నాయుడు...





కళ్యాణదుర్గర్ మే 21:అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరు మండలం అచ్చంపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుడు హనుమంతరాయుడు ఆకస్మికంగా మృతి చెందడంతో విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాదినేని ఉమామహేశ్వర నాయుడు ఆయన భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ దహన సంస్కార ఖర్చుల నిమిత్తం ఐదువేల(5000) రూపాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ములుకునూర్ తిమ్మరాయుడు,రూరల్ కన్వీనర్ వడ్డే వెంకటప్ప, ఎంపీపీ భీమేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తలారి సత్యప్ప, జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గాజుల రామాంజనేయులు, కర్ణం వెంకటేశులు, మైనారిటీ విభాగం అధ్యక్షులు దాదు, ఎంపీటీసీ నాగేంద్ర, నాగరాజు,నరసింహ, రవి తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సీఏ గా నూతనంగా బాధ్యతలు సేకరించిన ఐ వి నాగేంద్ర కుమార్



ఏలూరు జిల్లా ,నూజివీడు నూజివీడు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సి ఐ )గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఐ.వి. నాగేంద్ర కుమార్ని... డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ లిలిరాపర్ల బాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.రూరల్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రజాప్రతినిధులుగా తమ వంతు పూర్తి సహకారం ఉంటుందని రాపర్ల బాలకృష్ణ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

:శంకరపట్నం మండల కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు బండారి తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మత్స్యగిరీంద్ర స్వామి ఆలయ చైర్మన్ కోరం రాజిరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ ఉప్పుగల్ల మల్లారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, సర్పంచ్ శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్లు చింత రాజేశం, దండు రాజేష్, గొట్టే మధు, నాయకులు ఊకంటి మధుకర్, కవ్వ పద్మ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజ కొమురయ్య, ఎగ్గని రమేష్, దుర్గం తిరుపతి, రాజేశం, ఇస్మాముద్దీన్, షారుక్ తదితరులు పాల్గొన్నారు.

## యూటర్న్ వద్ద లారీ డ్రైవర్లకు ఇక్కట్లు

:జాతీయ రహదారిపై యూటర్న్ సమస్య కారణంగా లారీ డ్రైవర్లు, భారీ వాహనాల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.శంకరపట్నం మండలం తాడికల్ గ్రామం నుంచి కేశవపట్నం వరకు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.తాడికల్ గ్రామ శివారులో బైపాస్ రోడ్డుపై అండర్‌పాస్ నిర్మాణ పనులు చేపట్టారు.వరంగల్ నుంచి కరీంనగర్ వైపు వెళ్లే లారీలు, ఇతర భారీ వాహనాలు తాడికల్ అండర్‌పాస్ సమీపంలోని యూటర్న్ వద్ద సరిగా తిరగలేక డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. అండర్‌పాస్ బ్రిడ్జి కింద ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. యూటర్న్ వద్ద సరైన వెడల్పు లేకపోవడంతో వాహనాలు తిరగలేక ప్రమాదాలకు గురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.యూటర్న్ నిర్మాణానికి ప్రభుత్వం భూ సేకరణ చేపట్టినప్పటికీ, పనులు పూర్తికాకపోవడంతో వాహనదారులు రివర్స్‌లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగి ప్రమాదాల ముప్పు అధికమవుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జాతీయ రహదారి నిర్వహణ సంస్థ స్పందించి యూటర్న్ విస్తరణ పనులు పూర్తి చేసి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి.. పూలమాలలు వేసి నివాళులర్పించిన మంత్రి పొంగులేటి....

:ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణం మెయిన్ రోడ్‌లో మాజీ ప్రధాని, భారతరత్న శ్రీ స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ కలిసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను మంత్రి పొంగులేటి స్మరించుకుంటూ... 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించడం, దేశంలో ఐటీ, టెలికాం విప్లవానికి నాంది పలకడం, పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

# ఢిల్లీ ఎయిర్పోర్టులో ప్రయాణికులకు కీలక సూచనలు



న్యూఢిల్లీ : ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో .... ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం అప్రమత్తమైంది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వస్తున్న లేదా ఆయా దేశాల మీదుగా ప్రయాణిస్తున్న ప్రయాణికుల కోసం గురువారం ఒక హెల్త్ అడ్వైజరీని జారీ చేసింది. వ్యాధి లక్షణాలు కనిపించినవారు వెంటనే విమానాశ్రయంలోని ఆరోగ్య అధికారులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేసింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) జారీ చేసిన ఈ మార్గదర్శకాలను ఢిల్లీ ఎయిర్పోర్ట్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా పంచుకుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నివేదికల ఆధారంగా డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్‌లను హై-రిస్క్ దేశాలుగా గుర్తించారు. ఈ దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల్లో జ్వరం, వాంతులు, తీవ్రమైన నీరసం, విరేచనాలు, తలనొప్పి, కండరాల నొప్పి, గొంతునొప్పి, వివరించలేని రక్తస్రావం వంటి లక్షణాలు ఉంటే ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే ఎయిర్‌పోర్ట్ హెల్త్ ఆఫీసర్‌కు లేదా హెల్త్ డెస్క్‌కు తెలియజేయాలని సూచించారు. అలాగే, ఎబోలా సోకినట్లు అనుమానిస్తున్న లేదా నిర్ధారణ అయిన రోగి రక్తం లేదా శరీర ద్రవాలతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్నవారు కూడా అధికారులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. భారత్‌కు వచ్చిన 21 రోజుల్లోగా ఈ లక్షణాలు కనిపిస్తే .... తక్షణమే వైద్య సహాయం తీసుకోవాలని, తమ ప్రయాణ వివరాలను వైద్యులకు వెల్లడించాలని అడ్వైజరీలో పేర్కొన్నారు. కాగా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో తాజాగా 513 అనుమానిత ఎబోలా కేసులు, 131 అనుమానిత మరణాలు నమోదయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో .... జోర్డాన్ ఇప్పటికే కాంగో, ఉగాండా ప్రయాణికులపై తాత్కాలిక నిషేధం విధించింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఆరోగ్య తనిఖీలకు అందరూ సహకరించాలని ఢిల్లీ విమానాశ్రయం విజ్ఞప్తి చేసింది.

600కు పెరిగిన బండిబుగ్యో స్ట్రెయిన్ కేసులు..

ఎబోలా ప్రస్తుత వ్యాప్తికి బండిబుగ్యో స్ట్రెయిన్ రకం ప్రధాన కారణం. ఈ వైరస్ రకాన్ని ఇప్పటివరకు 600 మందిలో గుర్తించారు. ఆ లక్షణాలతో 139 మంది ప్రాణాలు కోల్పోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) వెల్లడించింది. బండిబుగ్యో స్ట్రెయిన్ కట్టడికి ఆమోదించిన టీకాలు ఏవీ అందుబాటులో లేవు. కొన్ని నెలల్లో మానవులపై ప్రయోగాలు జరగొచ్చని తెలుస్తోంది.ం

# పరువు నష్టం, విమర్శల మధ్య గీత చాలా సన్ననిది

– ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్య



న్యూఢిల్లీ : పరువు నష్టం, విమర్శల మధ్య చాలా సన్నని గీత ఉంటుందని ఢిల్లీ హైకోర్టు గురువారం వ్యాఖ్యానించింది. ఈ అంశం వ్యక్తిత్వ హక్కుల ఉల్లంఘనగా కాకుండా, ఒక నేత రాజకీయ నిర్ణయాలపై విమర్శగా కనిపిస్తోందని జస్టిస్ అమిత్ బన్సల్ పేర్కొన్నారు. రాజ్యసభ ఎంపి రాఘవ్ చద్దా పిటిషన్ పై ఢిల్లీ హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఆప్ నుండి బిజెపిలోకి మారిన తనను లక్ష్యంగా చేసుకుని ఎఐతో సృష్టించిన డీప్‌ఫేక్‌లు, మార్ఫింగ్ చేసిన వీడియోలు, పరువు నష్టం కలిగించే సోషల్ మీడియా కంటెంట్ ద్వారా తన వ్యక్తిత్వ హక్కులను ఉల్లంఘించారని ఆరోపిస్తూ పిటిషన్ పై ఢిల్లీ హైకోర్టు ప్రాథమికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ప్రాథమికంగా ఇందులో వ్యక్తిత్వ హక్కుల ఉల్లంఘన జరిగినట్లు కనిపించడం లేదని, ఇది కేవలం ఒక నేత తీసుకున్న రాజకీయ నిర్ణయంపై వచ్చిన విమర్శగా మాత్రమే కనిపిస్తోందని జస్టిస్ బన్సల్ పేర్కొన్నారు. ఆన్‌లైన్ కంటెంట్ రాజకీయ విమర్శల పరిధి దాటి పరువు నష్టం కలిగించేలా ఉందని రాఘవ్ చద్దా న్యాయవాది రాజీవ్ నాయర్ వాదించారు. కొన్ని పోస్టులు ఆయన "డబ్బు కోసం తనను తాను అమ్ముకున్నట్లు" తప్పుగా చిత్రీకరించాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వ్యక్తిత్వ హక్కులను వ్యాపారంగా మార్చడానికి, విమర్శలకు మధ్య వ్యత్యాసం ఉందని కోర్టు అభిప్రాయపడింది. గతంలో శశి థరూర్ కేసులో ఆయన విలక్షణమైన ప్రసంగ శైలిని పరిరక్షించిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావించింది. కీర్తి, గౌరవ హక్కులను కాపాడటం అవసరమే అయినప్పటికీ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం లభించే వాక్ స్వాతంత్ర్యాన్ని అడ్డుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. పరువు నష్టం కలిగించే విషయాలపై మధ్యంతర ఉపశమనం కల్పించాలన్న రాఘవ్ చద్దా తరపు న్యాయవాది అభ్యర్థనపై కోర్టు నిర్ణయాన్ని రిజర్వ్ చేసింది. అలాగే ఈ పిటిషన్‌ను ఒక దావాగా నమోదు చేయాలని ఆదేశించింది.

# ఆర్థిక వ్యవస్థలో ప్రధాని మోడీకి జ్ఞానం అవసరం



న్యూఢిల్లీ : ప్రధాని మోడీ జ్ఞానేష్ సాయంతో ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారని, ఆర్థిక వ్యవస్థలోనూ ఆయనకు జ్ఞానం అవసరమని గురువారం కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ప్రతినిధి జైరామ్ రమేష్ విమర్శించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషన్ జ్ఞానేష్ కుమార్‌ను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారతదేశ ఆర్థిక విధాన రూపకల్పనలో సమూల మార్పు అవసరమని, కానీ మోడీ ప్రభుత్వానికి ఈ ఆలోచన రావడం లేదని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థపై సెంటిమెంట్ ఎంతగా దిగజారిందంటే, మోడీ ప్రభుత్వానికి వృత్తిపరమైన మద్దతుదారులు కూడా తమ ఆందోళనలను బహిరంగంగా వ్యక్తం చేయడం ప్రారంభించారని అన్నారు. "ద్రవ్యోల్బణ అంచనాలు తీవ్రంగా పెరుగుతుండగా, వృద్ధి అంచనాలు గణనీయంగా తగ్గాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ద్రవ్యోల్బణ అంచనాలు తీవ్రంగా పెరుగుతుండగా, వృద్ధి అంచనాలు గణనీయంగా తగ్గాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్ డి ఐలు ) క్షీణిస్తూనే ఉన్నాయి. సరఫరా గొలుసులను (సప్లై చైన్‌లను) ఎంత దారుణంగా నిర్వహించారంటే, పెట్టుబడిదారులు తమ పెట్టుబడిని తగ్గించుకోవాలని ప్రధాని మోడీ ప్రజలకు ఇప్పుడు బహిరంగంగా సూచించారు " అని ఆయన అన్నారు. ఈ ఆందోళనలు కొత్తవి కావని.. గత కొంతకాలంగా కాంగ్రెస్ హెచ్చరిస్తూనే ఉందని అన్నారు. అత్యంత ముఖ్యమైనది మందకొడి పెట్టుబడి వాతావరణానికి సంబంధించినదని అన్నారు. ఇటలీ ప్రధాని మెలోనికి ప్రధాని మోడీ టోఫీలు బహుమతిగా ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ, మన ప్రధాని టోఫీలు పంచుతూ, ప్రజలకు విజ్ఞప్తులు చేయడంలో నిమగ్నమై ఉన్నారని విమర్శించారు. దేశం కాళ్ల కింద నేల జారిపోతోందని, ఆర్థిక విధాన రూపకల్పనలో మనకు సమూలమైన మార్పు అవసరమని, కానీ మోడీ ప్రభుత్వానికి యథావిధిగా ఆత్మస్తుతి చేసుకోవడం తప్ప వేరే ఆలోచనలు లేకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.ు

# వడ్డీ రేట్ల పెంపుపై ఆర్ బి ఐ కసరత్తు



ముంబయి : రూపాయి విలువను స్థిరీకరించడానికి, వడ్డీ రేట్ల పెంపుతో సహా అందుబాటులో ఉన్న అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) పరిశీలిస్తోందని సంబంధిత అధికారులను ఉద్దేశించి 'బ్లూమ్‌బెర్గ్' గురువారం ఒక నివేదికలో వెల్లడించింది. రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో సహా ఆర్‌బీఐ ఉన్నతాధికారులు వరుస అంతర్గత సమావేశాలు నిర్వహించినట్లు ఈ నివేదిక పేర్కొంది. గడిచిన బుధవారం నాటి ట్రేడింగ్‌లో రూపాయి అంతర్గతంగా 96.95 వద్ద రికార్డు స్థాయి కనిష్టానికి పడిపోయింది. ఆ తర్వాత కోలుకుని డాలర్‌తో పోలిస్తే 96.86 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ ఇండెక్స్ బలంగా ఉండటం, ముడి చమురు ధరలు అధికంగా కొనసాగడంతో డాలర్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఈ పరిణామాల వల్లే రూపాయి విలువ చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయి, కొత్త ముగింపు రికార్డును నమోదు చేసింది. అయితే, గురువారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి తన సర్వకాలిక కనిష్ట ముగింపు స్థాయి నుండి 41 పైసలు పుంజుకుని అమెరికా డాలర్‌తో పోలిస్తే 96.45కు చేరుకుంది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి 96.25 వద్ద బలంగా ప్రారంభమై, ఆ తర్వాత స్వల్పంగా తగ్గి 96.45 వద్ద ట్రేడయ్యింది. బుధవారం నాటి ముగింపు ధర 96.86తో పోలిస్తే ఇది 41 పైసల రికవరీని సూచిస్తోంది.

## రోజువారీ అవసరాలకోసం 'యాప్స్'డెవలప్ చేస్తున్న గాజా యువత

సమస్యను అందరూ గుర్తిస్తారు. కానీ, దాని పరిష్కార మార్గాలను కొందరే కనుగొంటారు. వారు మార్గదర్శకులుగా నిలుస్తారు. ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధం, దాడులతో గాజా విధ్వంసమైంది. ఆ ప్రాంతమంతా సంక్షోభంలో నిండిపోయింది. ఆ సంక్షోభంలోనూ కొత్త దారులేస్తూ ఆశలు చిగురింపజేస్తున్నారు అక్కడి యువత. సాంకేతికతతో తమ దేశ పునర్నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారు. అవకాశాలు కోల్పోయినందుకు నిరాశతో ఊసురోమని కూర్చోకుండా తామే కొంతమందికి అవకాశం కల్పిస్తున్నారు. గాజా నగరంలోని 'తాకత్'వర్క్ స్పేస్‌లో ఓ మూలన లాప్‌టాప్‌తో కూర్చుని సీరియస్‌గా పనిచేసుకుంటోంది 23 ఏళ్ల సజా అల్ ఘూల్. ఆమె మరో దేశంలోని కంపెనీ కోసం పనిచేయడంలేదు. పాలస్తీనా ప్రజల ఎదుర్కొంటున్న కష్టాలను పరిష్కరించడానికి పనిచేస్తోంది. తన సొంత మొబైల్ యాప్‌ను డెవలప్ చేస్తోంది. ఆమె డెవలప్ చేస్తున్న యాప్ పేరు 'వాసెల్నీ'(డబ్ల్యూఏఎస్ఈఎల్ఎన్ఐ). అంటే అరబిక్‌లో 'నా గమ్యాన్ని చేరడంలో నాకు సహాయం చేయండి'అని అర్థం. యుద్ధం తరువాత పాలస్తీనాలో పెరిగిన రవాణా ఖర్చులను తగ్గించడానికి రూపొందించిన రవాణా యాప్. ఈ యాప్ వల్ల ప్రయాణాలను ఒకరితో ఒకరు పంచుకోవచ్చు. ఉదాహరణకు, ఉదయం 8 గంటలకు అల్--షిఫా నుంచి మధ్య గాజా నగరంలోని అస్--సరయాకు ఎవరైనా ఒక ప్రయాణాన్ని ప్రతిపాదించవచ్చు. ఆ తర్వాత అటుగా వెళ్లాల్సి ఉన్న ఇతర వ్యక్తులు కూడా అదే ప్రయాణంలో చేరే అవకాశం ఉంటుంది. దీనివల్ల ఖర్చును పంచుకోవచ్చు. జస్ట్ లైక్ క్యాబ్ షేరింగ్ అన్నమాట.

తప్పిపోయిన వస్తువులు...

సజా తరహాలోనే యుద్ధ సమయంలో సర్వసాధారణమైన మరో సమస్యపై దృష్టి పెట్టారు 26 ఏళ్ల ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ గ్రాడ్యుయేట్ బహా అల్‌మల్లాహి. యుద్ధ సమయంలో ప్రజలు సర్వం కోల్పోయారు. వ్యక్తిగత వస్తువులు, అధికారిక పత్రాలు, ఫోన్లు, బ్యాగులు.. మరెన్నో. వాటి ఖరీదు ఎక్కువేం కాకపోవచ్చు. కానీ, వాటి విలువ ఎక్కువ. జీవితంలో ఎంత ప్రాముఖ్యత ఉన్న వస్తువులై ఉంటాయి. అలా పోగొట్టుకున్న వస్తువుల గురించి సోషల్ మీడియా వేదికల్లో విజ్ఞప్తులు వెల్లువెత్తుతుండటం బహా గమనించారు. పోగొట్టుకున్న, లేదా దొరికిన వస్తువుల కోసం ఒక ప్రత్యేక డిజిటల్ వేదికను సృష్టించాలనే ఆలోచన అతనికి వచి?చంది. అలా డెవలప్ అయ్యిందే 'రజ్జా'లి'. అంటే అరబిక్‌లో 'నాకు తిరిగివ్వండి'అని అర్థం. 'మీకు ఏదైనా దొరికినా లేదా మీరేమైనా పోగొట్టుకున్నా.. దానికోసం ఇక్కడ వెతకండి'అని

# కొత్తరూపు సంతరించుకుంటున్న గాజా టెక్ రంగం




అన్నాడు. అయితే, ఈ ప్రాజెక్ట్ అక్కడితో ఆగలేదు. యుద్ధం నిరాశ్రయులను చేస్తుండటంతో గాజాలో వలసలు రోజురోజుకు పెరిగాయి. ఈ క్రమంలో కిక్కిరిసిన జనాల మధ్య తమ ఆత?మయులను కోల్పోతున్నారు. అలా తప్పిపోయిన పిల్లల కేసులను కూడా చేర్చడానికి భవిష్యత్తులో ఈ ప్లాట్‌ఫారమ్‌ను అభివృద్ధి చేసే పనిలో ఉన్నారు. ఒక నిర్దిష్ట ప్రాంతంలో పిల్లలు తప్పిపోతే, వెంటనే వారి ఫొటో వివరాలతో వెంటనే సమీప ప్రాంతాల ప్రజలకు తక్షణం తెలపడానికి ఈ యాప్ రూపొందించారు.

అనేక అడ్డంకులు..

అయితే, యాప్‌ను రూపొందించడంతో సగం పని మాత్రమే పూర్తయ్యింది. వాటిని జనంలోకి విస్తతంగా తీసుకెళ్లడం అసలైన టాస్?క. ఉదాహరణకు, సజా రూపొందించిన వాసెల్నీ యాప్‌ను ఒక వ్యక్తి తెరిచి, అదే సమయంలో అదే మార్గంలో ప్రయాణించడానికి తక్కువ మంది ఉండటమో, అసలు లేకపోవడమో జరిగితే.. అతను ఆ యాప్‌పై విముఖత చూపే అవకాశం ఉంది. అందుకే దీన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి, డ్రైవర్లను ధృవీకరించడానికి స్థానిక అధికారుల ఆమోదం అవసరమని సజా అంగీకరిస్తున్నారు. పోగొట్టుకున్న పత్రాలను కనుగొనడానికి తన ప్లాట్‌ఫామ్‌ను విశ్వసించాలంటే అధికారిక సంస్థల సహకారం అవసరమని బహా చెబుతున్నారు. ఇదంతా వారికి ఆర్థిక భారంగా మారింది. ఎందుకంటే, కొత్త ప్రాజెక్టులు ఎక్కువగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనాలపై ఆధారపడుతున్నాయి. వీటి కొనుగోలు చాలా ఖరీదైన పని.

శిక్షణా కేంద్రంగా..

అయితే కేవలం పనిచేసుకోవడానికి కొన్ని సదుపాయాలు, స్థలం మాత్రమే కల్పిస్తే సరిపోదని తొందర్లోనే అర్థమైంది. గాజా సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రపంచ టెక్ ప్రపంచం నుంచి యుద్ధం వేరు చేసింది. రెండేళ్లలో టెక్ ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతుండగా, గాజాలోని యువత ప్రాణాలు కాపాడుకోవడానికి కష్టపడాల్సి వచ్చింది. మరీ ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగవంతమైన విజృంభణతో.. గాజాలో ప్రోగ్రామర్లు ప్రపంచ మార్కెట్ డిమాండ్లను అందుకోవడంలో వెనుకబడ్డారు. ఈ అంతరాన్ని పూడ్చే శిక్షణా కార్యక్రమాలపై దృష్టి పెట్టడం ప్రారంభించింది. ఫలితంగా, విశ్వవిద్యాలయాలు, స్థానిక, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యంతో 'తాకత్'ఒక కార్యక్షేత్రం నుంచి శిక్షణనిచ్చే ఇంక్యుబేషన్ కేంద్రంగా రూపాంతరం చెందింది. వీరి నుంచే కొత్త ఆలోచనలు మొదలయ్యాయి. తమ ప్రత్యక్షంగా ఎదుర్కొనే సమస్యల అనుభవాల నుంచే ఈ పరిష్కార మార్గాలు కనిపెట్టారు విద్యార్థులు. అయినప్పటికీ, ఈ ప్రాజెక్టులకు మోక్షం కలగాలంటే పెట్టుబడి అవసరం. డెవలపర్లు ప్రధాన ఆర్థిక, సాంకేతిక అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. వారి ప్రతిభను ఆచరణలోకి తీసుకురావడానికి పెట్టుబడుల కోసం ఎదురు చూస్తున్నారు.

ఉద్యోగులకు 'తాకత్'...

యుద్ధం ప్రారంభమైన తర్వాత చాలా మంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. ఆ తరువాత అవకాశాల కోసం ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఇక, ఉన్నా.. విద్యుత్ అందుబాటులో లేకపోవడం, ఇంటర్నెట్ అంతరాయాలతో ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. అవి విలాస వస్తువులుగా మారిపోయాయి. కేవలం విద్యుత్, ఇంటర్నెట్ ఉన్న చోటుకోసం నెలకు రెండొందల షెకెల్స్.. అంటే దాదాపు ఏడువేలు. అలాంటి వారికోసమే కో వర్కింగ్‌స్పేస్ స్థాపించారు సీఈఓ, ఇంజనీర్ అయిన షరీఫ్ నయీమ్. దాని పేరు 'తాకత్'. 'యుద్ధం ప్రారంభంలో మౌలిక సదుపాయాలు ధ్వంసవ్వడంతో చాలాకాలం పాటు కమ్యూనికేషన్లు, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వేలాది మంది ఫ్రీలాన్సర్లు, ప్రోగ్రామర్లు పనిచేసే అవకాశం కోల్పయారు. చాలా మంది ఉద్యోగాలు కోల్పోయారు. కొందరు అంతర్జాతీయ కాంట్రాక్టులను పోగొట్టుకున్నారు. పవర్ లేక కొందరు ఆన్‌లైన్ సమావేశాలకు హాజరు కాలేకపోయారు. వారందరికీ పనిచేసుకునే అవకాశం కల్పించాలనే లక్ష్యంతో గాజాలో 'తకాత్'స్థాపించాను'అని నయీమ్ చెబుతున్నారు. యుద్ధ సమయంలో గాజా నగరంలో ఏర్పాటైన ఇది క్రమంగా నుసైరత్, డెయిర్ అల్--బలాహ్ సహా అనేక ప్రాంతాలకు విస్తరించింది. గాజా నగరంలో తన ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించి, సుమారు 250 మంది ఫ్రీలాన్సర్లు, ప్రోగ్రామర్లకు వసతి కల్పించింది.

## వాతావరణ మార్పుల దుష్ప్రరిణామానికి బలవుతున్న నదీమతల్లులు

## చేపలు, జలచరాలకు ప్రాణసంకటంగా తయారైన గ్లోబల్ వార్మింగ్

శిలాజ ఇంధనాల విచ్చలవిడి వినియోగంతో అంతర్జాతీయంగా ఉష్ణోగ్రతలు ఎగసి వాతావరణ మార్పులు సర్వసాధారణ మవుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ ధాటికి వర్షాలు తగ్గి పంటదిగుబడి దారుణంగా పడిపోయి ప్రజలకు ఆకలికష్టాలు మరింత ఎక్కువవుతున్నాయి. వాతావరణ మార్పులు అనేవి ఒక్క మానవాళికే కాదు జలచరాలకూ కొత్త పెనుసమస్యగా దాపురించిందని అంతర్జాతీయ అధ్యయనం ఒకటి హెచ్చరికలు చేసింది. ఉష్ణోగ్రతలు పెరగడంతో నదీజలాల ఉపరితల ఉష్ణోగ్రతలు హెచ్చుతున్నాయని దీంతో నదీజలాల నుంచి ఆక్సిజన్ నెమ్మదిగా అదృశ్యమవుతోందన్న ప్రమాదహెచ్చరికలను చైనాలోని శాస్త్రవేత్తలు సాక్ష్యాధారాలసహితంగా వెల్లడించారు. 1985 ఏడాది నుంచిచూస్తే ప్రపంచవ్యాప్తంగా ఉన్న 21,000 ప్రధాన నదుల్లో ఆక్సిజన్ స్థాయిలు నెమ్మదిగా తగ్గుతున్నాయని అధ్యయనంలో తేలింది. 1985 ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం ముఖ్యమైన నదీజలాల్లో ఆక్సిజన్ 2.1 శాతం తగ్గిందని వెల్లడైంది. ఉష్ణోగ్రతలు ఇలాగే అత్యధిక స్థాయిల్లో కొనసాగితే నదీజలాల్లో ఆక్సిజన్ క్షీణత మరింత పెరిగే ఆస్కారముంది. ఆక్సీజన్ తగ్గిపోతే ప్రాణవాయువును పీల్చి బతికే జలచరాల మనుగడే ప్రశ్నార్థకమంగా మారే ప్రమాదముంది. ఈ పరిశోధన తాలూకు వివరాలు 'సైన్సెస్ అడ్వాన్సెస్'జర్నల్‌లో శుక్రవారం ప్రచురితమయ్యాయి. ఆమ్లజని గాఢత తగ్గుతూ పోతే వచ్చే శతాబ్దంచివరినాటికి తూర్పు అమెరికా మొదలు భారత్ దాకా ఉష్ణమండల ప్రాంతాలు దేశాల్లో నదుల్లో చేపల వంటి జలచరాల సంఖ్య దారుణంగా పడిపోతాయి. అప్పుడు నదీజలాల్లో వెతికినా ఒక్క చేప కూడా దొరకదని అధ్యయనం ముందస్తు ప్రమాదఘంటికలు మోగించింది. సాధారణంగా భౌతిక, రసాయన శాస్త్ర భావనల ప్రకారంచూసినా వేడి నీటిలో ఆక్సిజన్ శాతం తక్కువగా ఉంటుంది. మరీ ముఖ్యంగా మానవప్రేరేపిత వాతావరణ మార్పుల ప్రభావం అతిగా ఉంటుందని, ఇలాంటి సందర్భాల్లో ఆయువు పోయాల్సిన ఆమ్లజనికి మనిషే స్వయంగా ఆయువు తీస్తున్నాడని నివేదిక ఘాటు వ్యాఖ్యలుచేసింది. ప్రస్తుతమున్న క్షీణతరేటును పరిగణనలోకి తీసుకుంటే ఈ శతాబ్దంచివరినాటికి నదుల్లో ఆక్సిజన్ 5 శాతం తగ్గిపోయే అవకాశముంది.

# నదీజలాల్లో తగ్గిపోతున్న ఆక్సిజన్




## నదులపై ఆధారపడే వాళ్లకు కష్టం

మత్స్యకారులకు, మత్స్యసంబంధ వృత్తులతో జీవనం సాగించే జనాభాకు ఆర్థిక కష్టాలు పెరుగుతాయని ఈ పరిశోధనలో కీలక రచయిత, నంజియాంగ్ సిటీలో చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో ఎన్విరాన్‌మెంటల్ విభాగ శాస్త్రవేత్త క్వీ గువాన్ ఆందోళన వ్యక్తంచేశారు. "నదుల్లో ఆక్సిజన్ తగ్గిపోతే దానిని డీఆక్సిజనరేషన్‌గా పిలుస్తాం. ఇది చేపల సంతతిపై, వాటి మనుగడపై దుష్ప్రభావం చూపిస్తుంది. నాణ్యమైన ఆక్సిజన్ లేకపోతే జలచరాల ఉనికి ప్రమాదంలో పడుతుంది. చేపలు, రొయ్యలు, ఇతరత్రా చలజరాల దిగుబడి తగ్గిపోతే మత్స్యకారులతోపాటు మత్స్యరంగం అభివృద్ధి సైతం కుంటుబడుతుంది. ఇది పరోక్షంగా ఆయా దేశాల జీడీపీపైనే ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఆక్సిజన్ క్షీణతరేటు విపరీతంగా పెరిగిపోతే నదీమతల్లులు చివరకు జలచరాల మృత్యుకుహరాలుగా రూపాంతరంచెందుతాయి. గల్ఫ్ ఆఫ్ మెక్సికో, చీసాపీక్ బే, లేక్ ఎరీ లాంటి ప్రాంతాల్లో చేపలు కనీసం శ్వాసించే పరిస్థితి ఉండదు. ఒకప్పుడు మత్స్యసంపదకు ఆలవాలమైన ప్రాంతాలన్నీ డెడ్ జోన్‌లుగా మిగిలిపోతాయి"అని శాస్త్రవేత్త హెచ్చరించారు.

## గంగానది మరింత దారుణం

"పారిశ్రామిక విప్లవం ముందునాటితో పోలిస్తే ప్రపంచ ఉష్ణోగ్రతల్లో సగటు మరింత పెరుగుతున్న ఈ రోజుల్లో గంగానదిలో ఆక్సిజన్ పాళ్లు ఏకంగా 20 రెట్లు ఎక్కువ వేగంతో క్షీణిస్తున్నాయి. తూర్పు అమెరికా, ఆర్కిటిక్, భారత్, దక్షిణ అమెరికాలోని నదుల్లో ఈ శతాబ్దం చివరినాటికి ఆక్సిజన్ దాదాపు 10 శాతం క్షీణించనుంది. బ్రెజిల్‌లోని అమెజాన్ వంటి ఉష్ణమండల నదుల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. 1980 నుంచి చూస్తే అమెజాన్ నదిలో ఆక్సీజన్‌లేని డెడ్‌జోన్ ప్రాంతాల్లో రోజుల సంఖ్య ప్రతి దశాబ్దానికి అదనంగా 16 రోజులు పెరుగుతూ పోతోంది"అని శాస్త్రవేత్త క్వీ గువాన్ తెలిపారు. అందరి ఆయువును నిలబెట్టే ఆక్సీజన్‌ను నదుల్లో నిలుపుకోవాల్సిన బాధ్యత అన్ని దేశాలపై ఉందని శాస్త్రవేత్తలు హితబోధచేశారు.

# స్వాగతించదగిన తీర్పు

బహిరంగ ప్రదేశాల్లో వీధికుక్కల బెడద మనుషుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించినప్పుడు ఉదాసీనంగా ఉండటం రాజ్యానికి సాధ్యంకాదని మంగళవారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వాలకూ, జంతు ప్రేమికులకూ కళ్లు తెరిపించాలి. మనిషి ప్రాణమా, శునకాల ప్రాణమా... ఏది ప్రధానం అనే సమస్య తలెత్తినప్పుడు మానవ జీవితమే సర్వోన్నతమైనదనీ, జీవించే హక్కుకు పూచీపడుతున్న రాజ్యాంగంలోని 21వ అధికరణం ఈ విషయంలోనూ వర్తిస్తుందనీ ముగ్గురు సభ్యుల ధర్మాసనం తేల్చిచెప్పడం గమనించ దగ్గది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల తర్వాత జంతు జనన నియంత్రణ(ఏబీసీ) నిబంధనలు సవ్యంగా అమలైతే ఈ సమస్యే ఉత్పన్నమయ్యేది కాదు. కానీ ప్రభుత్వాలు, మున్సిపాలిటీలు, ఇతర స్థానిక సంస్థలు నిరాసక్తంగా, నిర్లిప్తంగా ఉండిపోయాయి. దాని పర్యవసానమే తాజా తీర్పు. గ్రామాలు, పట్టణాలు, నగరాలన్న తేడా లేకుండా జనావాసాలన్నిటా శునకాలు తారసపడతాయి. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, క్రీడా మైదానాలు, విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, మతపరమైన ప్రదేశాలు, పర్యాటక కేంద్రాలు... ఒకటేమిటి ఎక్కడికెళ్లినా వీధికుక్కల బెడద తప్పడం లేదు. అవి సవ్యంగానే ఉన్నాయా, ప్రమాదకరమైన జబ్బులతో ఉన్నాయా అని ఆరా తీసేవారుండరు. వాటి నియంత్రణ కర్తవ్యమని భావించే యంత్రాంగం ఎక్కడా కనబడదు. అలాగని వాటిని బంధించి, అత్యంత క్రూరంగా చంపటం కూడా పరిష్కారం కాదు. అనుకోని దురదృష్ట కర సంఘటన జరిగినప్పుడు మున్సిపల్ సిబ్బంది కుక్కలవేట మొదలెట్టడం, సద్దుమణి గాక ఊరుకోవటం రివాజుగా మారింది. మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకున్నప్పుడూ, ఎవరైనా వాటిని విషాహారంతో చంపినప్పుడూ జంతు ప్రేమికులు రంగప్రవేశం చేసి కేసులు పెడతారు. ఎల్లకాలమూ ఇదిలా కొనసాగుతూనే పోవటం సరికాదు. ఎక్కడో అక్కడ అడ్డుకట్ట పడితీరాలి. కుక్కల బెడదవల్ల ఎదురయ్యే సమస్యలు తక్కువేమీ కాదు. ఒక అంచనా ప్రకారం మన దేశంలో దాదాపు 8 కోట్ల వీధికుక్కలున్నాయి. ఏటా కోటిన్నర నుంచి రెండు కోట్ల వరకూ కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఈ ఏడాది తొలి త్రైమా సికంలో దాదాపు లక్షన్నర కేసులు నమోదైనట్టు అంచనా. తమిళనాడు, కర్ణాటకల్లో ఈ సంఖ్య 4.5 లక్షలవరకూ ఉందని గణాంకాలు చెబుతున్నాయి. రేబిస్ వ్యాధిబారినపడి దేశ వ్యాప్తంగా ఏటా 20,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మరో ఆశ్చర్యకరమైన విష యమేమంటే... ఏటా ప్రపంచవ్యాప్తంగా సంభవించే కుక్కకాటు మరణాల్లో మన దేశం వాటా 36 శాతం. అందుకే ప్రమాదకర కుక్కలకు కారుణ్యమరణం ప్రసాదించ వచ్చునీ,అంత ప్రమాదంలేని వాటిని జనావాసాలనుంచి తొలగించాలనీ తీర్పు స్పష్టం చేసింది. కుక్కకాట్లవల్ల సామాన్యులకూ, ప్రభుత్వాలకూ





కూడా ఆర్థికభారం తప్పడంలేదు. బాధితులకిచ్చే పీఈపీ వాక్సిన్లకూ, ఇంజక్షన్లకూ ప్రభుత్వాలు వందలకోట్లు వ్యయం చేస్తున్నాయి. అయినా వీటి లభ్యత సరిగా లేదు. బాధితుల్లో అత్యధికులు రెక్కాడితేగానీ డొక్కాడని సాధారణ జనం. చిన్నా చితకా వ్యాపారాల కోసమో, ఉపాధికోసమో వెళ్లే వారు, చెత్త ఏరుకుని జీవించేవారు. వీరంతా పనులు మానుకుని ఆస్పత్రులచుట్టూ తిరుగుతున్నారు. పాశ్చాత్య దేశాలు వీధికుక్కల్ని నియంత్రించి, వాటి బెడద లేకుండా చేయగలిగినప్పుడు మన దేశంలో ఎందుకు సాధ్యపడదు? ఏబీసీ నిబంధనలు పాటించని ప్రభుత్వ విభాగాలను జంతు ప్రేమికులో, మరొకరో నిలదీయరు. అది తమ బాధ్యతగా భావించరు. సమస్య ఉగ్రరూపందాల్చాక చర్యలు మొదలైతే మాత్రం ఆందోళనకు దిగుతారు. వీధికుక్కల్ని జనావాసాలనుంచి షెల్టర్లకు తరలించాలని నిరుడు ఆగస్టులో సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆదేశాలిచ్చినప్పుడు నిరసనలు వెల్లువెత్తాయి. రాజ్యాంగంలోని 51ఏ (జి) అధికరణం మూగజీవాలపట్ల కారుణ్యంతో మెలగాలని చెబుతోంది. దాన్ని పాటిచాల్సిందే. కానీ మనుషుల ప్రాణాలకు ముప్పు కలిగితే పట్టనట్టు ఉండకూడదు. సర్వోన్నత న్యాయస్థానం తాజా తీర్పు ప్రభుత్వాల కర్తవ్యాన్ని గుర్తుచేయటమేకాక,అవి విఫలమైన పక్షంలో ఎలాంటి చర్యలుండాలో సూచించింది. అందుకే ఇది ఆహ్వానించదగ్గ తీర్పు.

# సమతుల్య పోషణతోనే సేంద్రియ దిగుబడులు

సేంద్రియ కూరగాయల సాగులో ఒకటికి నాలుగు రకాల సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు కలిపి వాడినప్పుడు మాత్రమే అన్ని రకాల పోషకాలు సమతుల్యంగా అందుతాయని, తద్వారా అత్యుత్తమ దిగుబడులు సాధించగలమని తాజా పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి విశ్వవిద్యాలయం, పరివృద్ధి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పాలీహౌస్‌లో రెడ్ క్యాబేజీ, కాలీఫ్లవర్ పంటలను ప్రయోగాత్మకంగా పూర్తిగా సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తూ 2025--26 శీతాకాల పంటలో ఉత్తమ ఫలితాలు సాధించారు. మల్లారెడ్డి యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ డీన్ డాక్టర్ ఎ. రాజారెడ్డి పర్యవేక్షణలో హార్టికల్చర్ అసిస్టెంట్ ?రపొఫెసర్లు డా. సీహెచ్ షణ్ముఖి, డా. టి. శిరీష నిర్వహిస్తున్న ఈ మూడేళ్ల పరిశోధనా ప్రాజెక్టుకు భారతీయ కిసాన్ సంఘ్‌కు చెందిన సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ నిపుణులు ఎం.ఎస్. సుబ్రహ్మణ్యం రాజు సాంకేతిక సలహాదారుగా వ్యవహరిస్తున్నారు.



### కాలీఫ్లవర్ ఎకరానికి 8 టన్నులు

పూర్తిగా సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పాలీహౌస్‌లో ఎత్తు మడులపై కాలీఫ్లవర్‌ను వివిధ రకాల, వివిధ మోతాదుల్లో సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ 9 రకాల కాంబినేషన్లతో ప్రయోగాత్మక సాగు చేశారు. హెక్టారుకు 25 టన్నుల పశువుల ఎరువు మాత్రమే వాడుతూ పాలీహౌస్‌లో కాలీఫ్లవర్ సాగు చేస్తే 5.8 టన్నుల దిగుబడి వచ్చింది. అయితే, కోళ్ల ఎరువుతో పాటు 3 రకాల జీవన ఎరువులు వాడితే అత్యధికంగా హెక్టారుకు 8 టన్నులకుపైగా సేంద్రియ కాలీఫ్లవర్ దిగుబడి వచ్చింది. హెక్టారుకు 7.5 టన్నుల కోళ్ల ఎరువుతో పాటు వామ్ 5 కిలోలు, అజోస్పిరిల్లం 2 కిలోలు, పీఎస్బీ 5 కిలోలు వాడినప్పుడు అత్యధికంగా ఒక్కో కాలీఫ్లవర్ బరువు 825 గ్రాములు తూగింది. ఎకరానికి పది వేల మొక్కల చొప్పున 8టన్నులకు పైగా దిగుబడి వచ్చింది. అయితే, జీవన ఎరువులతో పాటు వర్మీ కంపోస్టు లేదా జీవామృతం లేదా లిగ్నైట్ కలిపి వాడినప్పుడు.. కోళ్ల ఎరువుతో పాటు జీవన ఎరువులు వాడినప్పటికన్నా తక్కువ దిగుబడి రావటం విశేషం.

### రెడ్ క్యాబేజీ ఎకరానికి 9 టన్నులు

పూర్తిగా సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పాలీహౌస్‌లో ఎత్తు మడులపై రెడ్ క్యాబేజీ పంటను వివిధ రకాల, వివిధ మోతాదుల్లో సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ 6 రకాల కాంబినేషన్లతో ప్రయోగాత్మక సాగు చేశారు. పాలీహౌస్‌లో హెక్టారుకు 25 టన్నుల పశువుల ఎరువు మాత్రమే వాడితే హెక్టారుకు 5 టన్నుల రెడ్ క్యాబేజీ దిగుబడి వచ్చింది. అయితే, హెక్టారుకు 25 టన్నుల పశువుల ఎరువుతో పాటు మరో 4 రకాల సేంద్రియ ఎరువులు వాడితే హెక్టారుకు అత్యధికంగా 9 టన్నులకుపైగా సేంద్రియ రెడ్ క్యాబేజీల దిగుబడి వచ్చింది. హెక్టారుకు 5 టన్నుల పశువుల ఎరువు, వర్మీకంపోస్టు 2 టన్నులు, వేపపిండి 1 టన్ను, లిగ్నైట్ 2 టన్నులు, ద్రవరూప జీవన ఎరువులు 2 లీటర్లు వాడారు. ఒక్కో రెడ్ క్యాబేజీ బరువు 962 గ్రాములు తూగింది. ఎకరానికి పది వేల మొక్కల చొప్పున 9 టన్నులకు పైగా దిగుబడి రావటం విశేషం. అయితే, పశువుల ఎరువు అసలు వాడకుండా.. హెక్టారుకు వర్మీకంపోస్టు 2 టన్నులు, వేపపిండి 1 టన్ను, లిగ్నైట్ 2 టన్నులు, ద్రవరూప జీవన ఎరువులు 2 లీటర్లు వాడినప్పుడు ఒక్కో రెడ్ క్యాబేజీ బరువు 935 గ్రాములకు మాత్రమే పెరిగింది.

### సమతుల్య పోషణే కీలకం

సేంద్రియ సాగులో పంటలకు అవసరమైన అన్ని పోషకాలనూ సమతుల్యంగా తగు పాళ్లలో అందించగలిగినప్పుడే రసాయన సేద్యంతో సమానంగా దిగుబడులు సాధించటం సాధ్యమవుతుందని మల్లారెడ్డి యూనివర్సిటీలో తాజా పరిశోధనలు తేల్చాయి. పాలీహౌస్ ప్రయోగాత్మక సాగులో ఎకరానికి 8 టన్నుల కాలీఫ్లవర్, 9 టన్నుల రెడ్ క్యాబేజీ దిగుబడులు మాకు సంతృప్తి కలిగించాయి. అన్ని యూనివర్సిటీలూ ఈ దిశగా పరిశోధనలు చేస్తే రైతులకు మంచి ఆదాయంతో పాటు వినియోగదారులకు ఆరోగ్యదాయకమైన ఆహారం లభిస్తుంది.

### సేంద్రియ పరిశోధనలు కొనసాగిస్తాం

పూర్తిగా సేంద్రియ కూరగాయల సాగులో మూడేళ్ల పరిశోధనా ప్రాజెక్టు తొలి ఏడాది ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయి. మరో రెండు సంవత్సరాలు ఈ ప్రయోగాలు కొనసాగిస్తాం. సేంద్రియ ఎరువుల యాజమాన్యం, దిగుబడుల స్థిరీకరణ చేసి పూర్తి ఫలితాలు ఆ తర్వాత ప్రకటిస్తాం.

# పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ఈ యోగాసనాలను రోజూ వేయాలి..



పిల్లల ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగకరమని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం పిల్లలు చదువులు, స్క్రీన్ టైమ్, ఆటలు వంటి అనేక పనులతో బిజీగా గడుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో కొన్ని సులభమైన యోగా ఆసనాలు వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. యోగా వల్ల కండరాలు బలపడటంతో పాటు శరీర సమతుల్యత, శ్వాస నియంత్రణ కూడా మెరుగుపడుతుంది. అలాగే ప్రతిరోజూ యోగా చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడం, మంచి నిద్ర రావడం, ఆత్మవిశ్వాసం పెరగడం వంటి ప్రయోజనాలు కూడా ఉంటాయని చెబుతున్నారు. పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కొన్ని సులభమైన యోగాసనాల గురించి నిపుణులు వివరిస్తున్నారు.

### తాడాసనం, బాలాసనం..

తాడాసనం పిల్లలకు మంచి ప్రారంభ ఆసనం అని చెప్పవచ్చు.. ఈ ఆసనంలో పాదాలను కలిపి నిటారుగా నిలబడాలి. చేతులను పైకి ఎత్తి శరీరాన్ని పైవైపు చాపాలి. కొద్దిసేపు లోతుగా శ్వాస తీసుకుంటూ ఈ స్థితిలో ఉండాలి. ఇది శరీర భంగిమను మెరుగుపరచడంతో పాటు పిల్లల్లో స్థిరత్వాన్ని పెంచుతుంది.

వృక్షాసనం చెట్టులా నిలబడే ఆసనం. ఒక కాలిపై నిలబడి మరో కాలును తొడ భాగానికి ఆనించాలి. చేతులను నమస్కార ముద్రలో ఉంచి కొద్దిసేపు నిలబడాలి. తరువాత మరో కాలితో కూడా చేయాలి. ఈ ఆసనం పిల్లల్లో ఏకాగ్రత, సమతుల్యతను పెంచడంలో సహాయపడుతుంది. కాళ్ల కండరాలు కూడా బలపడతాయి. అలాగే బాలాసనం పిల్లలకు మానసిక ప్రశాంతతను అందించే ఆసనం. మోకాళ్లపై కూర్చుని ముందుకు వంగి నుదిటిని నేలపై ఉంచాలి. చేతులను ముందుకు చాపి కొద్దిసేపు నెమ్మదిగా శ్వాస తీసుకోవాలి. ఈ ఆసనం వెన్ను, భుజాలు, నడుము భాగాల్లో ఒత్తిడిని తగ్గించడంలో ఉపయోగపడుతుంది.

### అధోముఖ శ్వాసాసనం..

అధోముఖ శ్వాసాసనం శరీరాన్ని ఇంగ్లీష్ అక్షరం ఎ ఆకారంలో ఉంచే ఆసనం. చేతులు, కాళ్లు నేలపై ఉంచి నడుమును పైకి ఎత్తాలి. కొద్దిసేపు ఈ స్థితిలో ఉండాలి. ఇది చేతులు, భుజాలు, వెన్ను భాగాన్ని బలపరుస్తుంది. పిల్లల్లో శరీర సమన్వయాన్ని కూడా మెరుగుపరుస్తుంది. భుజంగాసనంను కోబ్రా పోజ్‌గా కూడా పిలుస్తారు. పొట్టపై పడుకుని చేతుల సహాయంతో ఛాతిని పైకి ఎత్తాలి. ఈ ఆసనం వెన్నెముకను బలపరచడంలో సహాయపడుతుంది. అలాగే శ్వాస సామర్థ్యాన్ని పెంచి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బద్ధకోణాసనం లేదా బటర్‌ఫ్లై పోజ్‌లో కాళ్ల పాదాలను కలిపి మోకాళ్లను బయటకు వంచాలి. చేతులతో పాదాలను పట్టుకుని మోకాళ్లను సున్నితంగా కదిలించాలి. ఇది నడుము భాగానికి మంచి స్ట్రెచ్ ఇస్తుంది. జీర్ణక్రియకు కూడా మేలు చేస్తుంది.

### శవాసనం..

శవాసనం పిల్లలకు విశ్రాంతిని అందించే ముఖ్యమైన ఆసనం. నేలపై సూటిగా పడుకుని చేతులు, కాళ్లు సడలించి కళ్లను మూసుకోవాలి. కొద్దిసేపు నెమ్మదిగా శ్వాస తీసుకుంటూ విశ్రాంతి తీసుకోవాలి. ఇది ఒత్తిడిని తగ్గించి మంచి నిద్రకు సహాయపడుతుంది. మర్జరాసనం-బిటిలాసనం లేదా క్యాట్-కౌ పోజ్ వెన్నెముకకు మంచి వ్యాయామంగా పనిచేస్తుంది. నాలుగు కాళ్ల స్థితిలో ఉండి శ్వాస తీసుకుంటూ వెన్నును కిందికి వంచాలి. శ్వాస వదులుతూ వెన్నును పైకి వంపుగా మార్చాలి. ఈ కదలికలను కొన్ని సార్లు చేయాలి. ఇది శరీర భంగిమను మెరుగుపరచడమే కాకుండా జీర్ణక్రియకు కూడా సహాయపడుతుంది. ఈ విధంగా రోజూ ఈ ఆసనాలు వేయడం వల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారవుతారని నిపుణులు చెబుతున్నారు.

# కరువు కాలపు పంట బ్రహ్మజెముడు

## పశుగ్రాసంతో పాటు 5 ఉపయోగాలు

ముళ్ళు లేని బ్రహ్మజెముడు (స్పైన్‌లెస్ కాక్టస్) కరువుప్రాంతాల్లో రైతులకు చక్కని పశుగ్రాసం సహా 5 రకాలుగా ఉపయోగపడే ఒక చక్కని పంట. వాతావరణ మార్పులను తట్టుకోగల పంట. తక్కువ నీటితో పెరుగుతుంది. సారహీనమైన నేలల్లో కూడా (చౌడు భూముల్లో తప్ప) పెరుగుతుంది. ఇప్పటికే ఉన్న తోటల్లో మధ్యలో వరుసలుగా దీన్ని పెంచవచ్చు. ఇది చిన్న రైతులను ఆదుకునే పంట. కరువు పీడిత రైతులకు బహుళ ఆదాయ మార్గాలను సృష్టిస్తుంది. సుస్థిర జీవనోపాధిని కల్పిస్తుంది.

### హెక్టారుకు 80 నుంచి 100 టన్నులు

ముళ్ళు లేని బ్రహ్మజెముడు ఒక్కసారి నాటితే 25 సంవత్సరాలకు పైగా ఫలసాయాన్నిచ్చే దీర్ఘకాలిక పంట. చిన్న పండ్లతో సహా ఈ చెట్టులోని ప్రతి భాగం విలువైన పశువుల మేతగా ఉపయోగపడుతుంది. తక్కువ ఖర్చుతో సమకూరే పచ్చిమేతను అందిస్తుంది. సంవత్సరానికి హెక్టారుకు 80 నుంచి 100 టన్నుల వరకు బ్రహ్మజెముడు ఆకుల దిగుబడి వస్తుంది. కరువు సమయంలో నమ్మకంగా, తక్కువ ఖర్చుతో కూడిన పశుగ్రాసాన్ని అందిస్తుంది. తద్వారా పశుగ్రాస ఖర్చులను తగ్గిస్తుంది. దీని ఆకులను అంగుళం ముక్కలుగా కోసి పశువులకు మేపాలి. పాలిచ్చే పశువులకు రోజుకు 10--15 కిలోలు (రోజువారీ పచ్చిమేతలో 25% వరకు) మేపవచ్చని కర్నాల్‌లోని ఎన్‌డీఆర్‌ఐ నిపుణులు చెబుతున్నారు. ఇతర పశువులకు రోజుకు 8--12 కిలోల వరకు, ఆర్నెల్లు పైబడిన దూడలకు 2--4 కిలోలు మేతగా ఇవ్వొచ్చు. క్రమంగా అలవాటు చెయ్యాలి.

### బయోగ్యాస్ తయారీకి ఉపయోగం

ముళ్ళు లేని బ్రహ్మజెముడు బయోగ్యాస్ తయారీకి అద్భుతంగా ఉపయోగపడుతుంది. దీని ఆకులకు 60--65% మీథేన్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. బయోగ్యాస్ తయారీ తర్వాత వెలువడే స్లర్రీ విలువైన సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. 3 కిలోల బ్రహ్మజెముడు ఆకులతో 3.38 చదరపు అడుగుల విస్తీర్ణం గల బయో--లెదర్ షీట్‌ను తయారు చేయొచ్చు. దీనితో రెండు జతల బూట్లు లేదా మూడు చిన్న బ్యాగులు తయారు చేయవచ్చు. దీని పండ్లు పోషక విలువలతో కూడి ఉంటాయి. దీని ఆకులను కూరగానూ వండుకొని తినొచ్చు.

### ఎవరిని సంప్రదించాలి?





ముళ్లులేని బ్రహ్మజెముడు పంట సాగును వ్యాప్తిలోకి తేవాలంటే రైతులకు దీని గురించి తెలియజె??పాలి. నాటుకునే బ్రహ్మజెముడు ఆకులను అందించాలి. మార్కెట్‌ను అనుసంధానం అవసరం. పరిశోధనా సంస్థలు, ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థలు కలసి పనిచేస్తే ఈ కరువు కాలపు పంటను వేగంగా రైతులకు అందించవచ్చు. ఉత్తరప్రదేశ్‌లోని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) అనుబంధ సంస్థ ఇండియన్ గ్రాస్‌ల్యాండ్ అండ్ ఫాడర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ దీనిపై విస్తృతంగా పరిశోధనలు చేసింది. అదనపు సమాచారం కోసం డా. శివ్ కుమార్ అగర్వాల్‌ను సంప్రదించవచ్చు.

# తేనెలో అసలు ఎన్ని రకాలు ఉన్నాయో.. ఏది ఎలాంటి రుచిని అందిస్తుందో తెలుసా..?



తేనె బంగారు రంగు, మధురమైన వాసన, సహజ గుణాలతో ప్రసిద్ధి చెందిన ఆహార పదార్థం. శతాబ్దాలుగా ఇది ఆహారంగానే కాకుండా సంప్రదాయ వైద్యంలో కూడా ఉపయోగంలో ఉంది. పూల నుంచి తేనెటీగలు సేకరించే మకరందం ఆధారంగా తేనె రుచి, రంగు, గాఢత్వం మారుతూ ఉంటాయి. అందుకే అన్ని తేనెలు ఒకేలా ఉండవు. కొన్ని తేనెలు తేలికపాటి రుచితో ఉంటే, మరికొన్ని బలమైన గాఢమైన రుచిని కలిగి ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన కొన్ని ముఖ్యమైన తేనె రకాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు. తేనెటీగలు ఏ పూల నుంచి మకరందాన్ని సేకరిస్తాయో దానిపైనే తేనె ప్రత్యేకత ఆధారపడి ఉంటుంది. ఒకే రకం పూల నుంచి సేకరించిన మకరందంతో తయారైనది మోనోఫ్లోరల్ హనీగా పిలుస్తారు. వివిధ పూల నుంచి సేకరించిన మకరందంతో తయారయ్యేది వైల్డ్ ఫ్లవర్ లేదా మల్టీఫ్లోరల్ హనీగా ఉంటుంది.తేనె ఉత్పత్తులు

### ప్రభావితం చేసే పలు అంశాలు..

వాతావరణం, నేల స్వభావం, ప్రాసెసింగ్ విధానం కూడా తేనె రుచిని ప్రభావితం చేస్తాయి. అకేసియా తేనె చాలా లేత రంగులో ఉండి స్వల్ప పూల వాసనతో మృదువైన తీపి రుచిని కలిగి ఉంటుంది. అధిక ఫ్రక్టోజ్ ఉండటం వల్ల ఇది చాలా కాలం ద్రవరూపంలోనే ఉంటుంది. టీ, పెరుగు, పండ్లపై చల్లుకోవడానికి లేదా సలాడ్ డ్రెస్సింగ్‌లలో ఉపయోగించడానికి ఇది అనుకూలంగా ఉంటుంది. అలాగే న్యూజిలాండ్‌లో పెరిగే మనూకా మొక్క మకరందం నుంచి మనూకా తేనె తయారవుతుంది. దీనికి గాఢమైన, కొంచెం చేదు కలిగిన ప్రత్యేక రుచి ఉంటుంది. యాంటీ బ్యాక్టీరియల్ గుణాల కారణంగా ఆరోగ్యపరంగా కూడా దీనికి మంచి పేరు ఉంది. వేడి పానీయాలు, మారినేడ్స్ లేదా నేరుగా తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.కొత్త రుచులు

### క్లోవర్ తేనె వినియోగం ఎక్కువ..

వైల్డ్ ఫ్లవర్ తేనె వివిధ రకాల పూల నుంచి సేకరించిన మకరందంతో తయారవుతుంది. ఈ తేనె రుచి, రంగు కాలానుసారం మారుతూ ఉంటుంది. కొన్ని తేనెలు తేలికపాటి రుచిని కలిగి ఉండగా, మరికొన్ని గాఢమైన రుచిని ఇస్తాయి. వంటలు, బేకింగ్, బ్రెడ్‌పై రాయడానికి దీన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు. అదే విధంగా ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఎక్కువగా వినియోగించే తేనెల్లో క్లోవర్ తేనె ఒకటి. లేత బంగారు రంగు, మృదువైన తీపి రుచి దీనికి ప్రత్యేకత. టీ, టోస్ట్, సీరియల్స్, బేకరీ పదార్థాల్లో దీన్ని సాధారణంగా ఉపయోగిస్తారు. బక్‌వీట్ తేనె గాఢమైన రంగు, మందమైన గాఢత్వంతో ఉంటుంది. మొలాసిస్ తరహా రుచి, స్వల్ప పొగ వాసన కలిగి ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఈ తేనెను బలమైన రుచులను ఇష్టపడేవారు ఎక్కువగా తీసుకుంటారు. జింజర్ బ్రెడ్, స్పైసీ కేక్స్ వంటి బేకింగ్ వంటల్లో ఇది బాగా సరిపోతుంది.

### పేస్ట్రీలు, కేకులకు అయితే..

యునైటెడ్ కింగ్‌డమ్‌లో ప్రసిద్ధి చెందిన హీతర్ తేనె గాఢ అంబర్ రంగులో ఉండి జెల్లీ తరహా టెక్స్చర్ కలిగి ఉంటుంది. పూల వాసనతోపాటు చెక్క వాసన కలిసిన ప్రత్యేక రుచి ఉంటుంది. చీజ్, రోస్ట్ చేసిన మాంసాహార వంటకాలు, క్రంపెట్స్‌తో ఇది బాగా సరిపోతుంది. సిట్రస్ పూల మకరందం నుంచి తయారయ్యే ఆరెంజ్ బ్లాసమ్ తేనెకు సున్నితమైన నారింజ వాసన ఉంటుంది. డెజర్ట్స్, హెర్బల్ టీలు, సలాడ్ డ్రెస్సింగ్‌లలో దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు. పేస్ట్రీలు, కేకులకు కూడా ఇది మంచి కాంబినేషన్‌గా ఉంటుంది. ఇక ముడి తేనెని ఎక్కువగా వేడి చేయకుండా సహజ రూపంలోనే ఉంచుతారు. అందువల్ల ఇందులో సహజ ఎంజైమ్స్, పుప్పొడి గుణాలు ఎక్కువగా ఉంటాయి. సెట్ హనీ లేదా క్రీమ్డ్ హనీ మాత్రం మృదువుగా, సులభంగా రాయడానికి అనుకూలంగా ఉండేలా క్రిస్టలైజ్ చేస్తారు. టోస్ట్, బేకింగ్ వంటకాల్లో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. తేనె కొనుగోలు చేసే సమయంలో దాని మూలం, స్వచ్ఛత, ప్రాసెసింగ్ విధానం తెలుసుకోవడం మంచిది. సహజ తేనె రుచి మాత్రమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. తదుపరి తేనె జార్ తీసుకునేటప్పుడు దాని ప్రత్యేకతను గమనిస్తే మీకు కొత్త రుచులు కూడా పరిచయం అవుతాయి.

# చియా గింజలకు, సబ్జా గింజలకు తేడా ఏమిటి.. ఏవి ఎక్కువ మేలు చేస్తాయి..?



ఎండాకాలంలో శరీరాన్ని చల్లగా ఉంచేందుకు అనేక ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ముఖ్యంగా ఆహారపు అలవాట్లపై చాలామంది ప్రత్యేక శ్రద్ధ పెడుతుంటారు. అందులో భాగంగా సబ్జా గింజలు, చియా గింజలు వేసిన పానీయాలను వేసవిలో ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. అయితే నీటిలో నానబెట్టిన తర్వాత ఈ రెండు గింజలు ఒకేలా కనిపించినప్పటికీ శరీరంపై చూపే ప్రభావం మాత్రం భిన్నంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచడంలో ఏవి ఎక్కువ ఉపయోగపడతాయనే విషయంపై వారు వివరాలను వెల్లడిస్తున్నారు.

### తేడాలేంటి..

సబ్జా గింజలు తులసి జాతికి చెందిన స్వీట్ బాసిల్ మొక్క నుంచి లభిస్తాయి. వీటిని చాలాకాలంగా ఫలూదా, షర్బత్ వంటి వేసవి పానీయాల్లో ఉపయోగిస్తున్నారు. నీటిలో వేసిన కొన్ని నిమిషాల్లోనే ఇవి విస్తరించి జెల్‌లా మారిపోతాయి. చియా గింజలు మాత్రం సాల్వియా మొక్క నుంచి వస్తాయి. వీటిని సాధారణంగా స్మూతీలు, హెల్త్ డ్రింక్స్, పుడ్డింగ్స్‌లో ఉపయోగిస్తారు. చియా గింజలు కూడా నీటిని పీల్చుకుని జెల్‌లా మారతాయి కానీ పూర్తిగా నానేందుకు ఎక్కువ సమయం పడుతుంది. శరీరాన్ని చల్లబరచడంలో సబ్జా గింజలు ఎక్కువగా ఉపయోగపడతాయని సంప్రదాయ వైద్య విధానాలు చెబుతున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం బాసిల్‌లో ఉండే బయో యాక్టివ్ సమ్మేళనాలు శరీర వేడిని తగ్గించడంలో, జీర్ణక్రియను ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడతాయి. అందుకే వేసవిలో నిమ్మరసం, రోజ్ షర్బత్, కొబ్బరి నీటిలో సబ్జా గింజలను కలిపి తీసుకునే అలవాటు ఉంటుంది. అలాగే చియా గింజలు మాత్రం నేరుగా శరీరాన్ని చల్లబరచడంలో కాకుండా పోషక విలువల కోసం ఎక్కువగా గుర్తింపు పొందాయి. వీటిలో ఫైబర్, ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ, గుండె ఆరోగ్యం, జీర్ణక్రియ మెరుగుదలకు ఇవి సహాయపడతాయని పరిశోధనలు చెబుతున్నాయి.

### నానబెట్టాకే తినాలి..

హైడ్రేషన్ విషయంలో రెండు గింజలూ ఉపయోగకరమే అయినప్పటికీ సబ్జా గింజలు జీర్ణాశయానికి తేలికగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి అధిక ఆమ్లత్వం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. సబ్జా గింజలు తమ బరువుకంటే దాదాపు 15 రెట్లు ఎక్కువ నీటిని నిల్వ చేసుకోగలవు. చియా గింజల్లో ఫైబర్ అధికంగా ఉండటంతో అవి ఎక్కువసేపు ఆకలి లేకుండా ఉంచుతాయి. అయితే సరైన విధంగా నానబెట్టకుండా తీసుకుంటే వేసవిలో కొందరికి కడుపు భారంగా అనిపించే అవకాశం ఉంటుంది. పోషక విలువల పరంగా చూస్తే చియా గింజలు ముందుంటాయి. వీటిలో ప్రోటీన్, ఐరన్, మెగ్నీషియం, ఫాస్ఫరస్ వంటి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. శక్తిని ఎక్కువసేపు నిల్వ ఉంచడంలో, తృప్తి భావాన్ని కలిగించడంలో ఇవి ఉపయోగపడతాయి. సబ్జా గింజల్లో ప్రోటీన్ తక్కువగా ఉన్నప్పటికీ ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి.

### వేసవిలో అయితే ఇవి మేలు..

వేసవిలో సబ్జా గింజలను నిమ్మరసం, రోజ్ మిల్క్, కొబ్బరి నీరు వంటి తేలికపాటి పానీయాల్లో కలిపి తీసుకోవడం మంచిది. ఇవి 10 నుంచి 15 నిమిషాల్లోనే నానిపోతాయి. చియా గింజలను మాత్రం ఓవర్‌నైట్ డ్రింక్స్, స్మూతీలు, బ్రేక్‌ఫాస్ట్ బౌల్స్‌లో ఉపయోగిస్తే మంచిది. శరీరాన్ని చల్లగా ఉంచుకోవడం ప్రధాన లక్ష్యమైతే సబ్జా గింజలు మంచి ఎంపిక అని చెప్పవచ్చు. పోషక విలువలు, ఫైబర్, ఎక్కువసేపు శక్తి కావాలనుకుంటే చియా గింజలు మెరుగైనవి అని చెప్పవచ్చు. అయితే ఈ రెండింటినీ అవసరానికి అనుగుణంగా వేసవి ఆహారంలో చేర్చుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDY Published from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor
CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499\\\Edited, Printed, Published & Owned by CH.RAM REDDY Published from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital
Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499\\\